PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 124 | విజయవాడ, శుక్రవారం 6 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Friday 6 December 2024 | Rs


నింగిలోకి దూసుకెళ్తున్న పిఎస్‌ఎల్‌విసి -59

పిఎస్‌ఎల్‌వి సి-59 రాకెట్ ప్రయోగం విజయవంతం
- నింగిలోకి యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ఉపగ్రహాలు

ప్రజాశక్తి- సూళ్లూరుపేట

అంతరిక్షంలోకి మరో అద్భుత రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో 61వ రాకెట్‌ను ఇస్రో ప్రయోగించింది. పిఎస్‌ఎల్‌వి సి-59 రాకెట్‌ను శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి గురువారం సాయంత్రం 4.12 గంటలకు ప్రయోగించారు. ఇంతకుముందు ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్-1కు తోడుగా ప్రస్తుతం ప్రోబా-3 పరిశోధనలు చేపట్టనుంది. సూర్యుని బాహ్య వలయంలోని కరోనా పొరను అధ్యయనం చేయడం, అవసరమైతే కృత్రిమ సూర్య గ్రహణాలు కూడా ఏర్పాటు చేసి సూర్యుడి గుట్టును రట్టు చేసేందుకు ఈ ప్రోబా-3ని అత్యంత ఆధునిక ఉపకరణాలతో నిర్మించారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3లో రెండు ఉపగ్రహాలున్నాయి. పిఎస్‌ఎల్‌వి సి-59 రాకెట్‌ను చాలా కాలం తర్వాత ఆరు స్ట్రాపాన్ బూస్టర్లతో నిర్మించారు. ప్రయోగ సమయంలో 44.5 మీటర్ల ఎత్తు, 320 టన్నుల బరువు కలిగిన ఈ రాకెట్ 550 కిలోల బరువు ఉన్న ప్రోబా-3లోని రెండు స్పేస్ క్రాఫ్ట్‌లను మోసుకెళ్లింది. ప్రయోగం విజయవంతం కావడం పట్ల శాస్త్రవేత్తలను ఇస్రో చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారమే ఈ రాకెట్‌ను ప్రయోగించాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో వాయిదాపడింది.

ప్రశాంతంగా టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్


ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి


ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ గురువారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. 92.62 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌హన్ సగిలి తెలిపారు. ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు పోటీల్లో ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని 16,737 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిని పర్యవేక్షించేందుకు కాకినాడ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులను కాకినాడ జెఎన్‌టియులో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. కాకినాడ జిల్లా పిఠాపురం, శంఖవరం మండలాల పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు కె.హర్షవర్ధన్ పరిశీలించారు. డిసెంబర్ తొమ్మిదిన ఓట్ల లెక్కింపు జరుగుతుందని అధికారులు తెలిపారు.

కేంద్రం గొడ్డలి పోటేస్తున్నా
డివిడెండ్ల పంట
ప్రతికూల పరిస్థితుల్లోనూ భారీ ఆదాయాన్ని సమకూర్చిన పిఎస్‌యులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ

కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించే ఎత్తులతో గొడ్డలి పోటేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వానికి ఆ సంస్థలు పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తున్నాయి. తాజాగా విడుదలైన గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 42,713 కోట్ల రూపాయలను డివిడెండ్ల రూపంలో ఆ సంస్థలు కేంద్రానికి అందించాయి. ఇది వార్షిక లక్ష్యంలో 76 శాతం కావడం గమనార్హం. దీంతో ఈ ఏడాది కూడా ఈ సంస్థలు లక్ష్యాలు మించి ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. నిజానికి కేంద్ర ప్రభుత్వం ఒకదాని తరువాత ఒకటిగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి ప్రయత్నాలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. విశాఖ ఉక్కు విషయంలో అనుసరిస్తున్న వైఖరే దీనికి నిదర్శనం. ఉక్కు కార్మికులతో పాటు, రాష్ట్ర ప్రజానీకం అంతా ఏళ్లతరబడి వ్యతిరేకిస్తున్నా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. రెండు రోజుల క్రితం కూడా కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్ డి కుమారస్వామి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియ ఆగదని పార్లమెంటు సాక్షిగా ప్రకటించిన విషయం తెలిసిందే. సొంత గనులు, అవసరమైన నిధులు సమకూర్చకుండా విశాఖ ఉక్కును నష్టాల బాట పట్టించడానికి కుట్ర ఒకవైపు జరుగుతుంటే, మరోవైపు కార్మికులు సంఘటితంగా ఎప్పటికప్పుడు కొత్త రికార్డులను సృష్టిస్తూ విశాఖ ఉక్కు ప్రతిష్టను నిలబెడుతున్నారు. మన రాష్ట్రంలోనూ కాదు, దేశమంతా ఇదే పరిస్థితి ఉందనడానికి నిదర్శనమే తాజా గణాంకాలు. ప్రభుత్వ రంగ సంస్థలు ఎప్పటికప్పుడు లాభాలను ఆర్జించి నిధులు సమకూరుస్తుంటే, కేంద్రం మాత్రం బంగారు గుడ్లు పెట్టే బాతును చంపినట్లు వాటిని తెగనమ్మడానికి ప్రయత్నిస్తోంది.






ప్రతికూలతను అధిగమించి...

అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికల పరిస్థితులను అధిగమించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ ఆయిల్, గ్యాస్ సంస్థలు భారీ ఆదాయాన్ని ఆర్జించాయి. ఫలితంగా ప్రభుత్వానికి అత్యధిక డివిడెండ్లను చెల్లించిన పిఎస్‌యులలో ఈ సంస్థలు అగ్ర భాగాన నిలిచాయి. ఈ సంస్థలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 14,387 కోట్లరూపాయల డివిడెండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాయి. ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఒఎన్‌జిసి) 6,297కోట్లు, ఇండియన్ ఆయిల్ 5,091 కోట్ల రూపాయలను చెల్లించగా, భారత పెట్రోలియం మిగతా 2లో

రైతులను ఇబ్బందిపెడితే
కఠినచర్యలు తీసుకుంటాం
ధాన్యం కొనుగోళ్లపై సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులు ఇబ్బందులు పడితే దానికి కారణమైన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. ఉండవల్లిలోని ఆయన నివాసం నుంచి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడా సమస్యలు తలెత్తకుండా కొనుగోలు ప్రకియను పూర్తి చేయాలని చెప్పారు. అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యం, రైస్‌మిల్లర్ల సహాయ నిరాకరణ వల్ల రైతులు ఇబ్బంది పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..గత ప్రభుత్వంలో రైతులు పండించిన పంటలు అమ్ముకోవడానికి ఎన్ని ఇబ్బందులు పడ్డారో చూశామని, అందుకే ఈ సారి ధాన్యం కొనుగోళ్లలో సమూల మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ఈ విధానాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత కింద స్థాయి ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బందిపై ఉందని ఆయన పేర్కొన్నారు. డ్రైయ్యర్లు (ధాన్యం ఆరబెట్టే యంత్రాలు) ఏర్పాటు ద్వారా తేమ విషయంలో తలెత్తుతున్న సమస్యలను అధిగమించవచ్చున్నారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 10.59 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, నేటి వరకు 1.51లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,331 కోట్లు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 5.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ జరిగిందని, ఈ ఏడాది ఇప్పటికే 10.59 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుతో రికార్డు సాధించినట్లు సిఎం తెలిపారు. ధాన్యం అమ్మే రైతులు ఏ మిల్లుకైనా ధాన్యం పంపించవచ్చని, గతంలో ప్రభుత్వం సూచించిన మిల్లులకు మాత్రమే రైతుల ధాన్యం పంపాల్సి ఉండేదన్నారు.

బియ్యం స్మగ్లింగ్‌ను సహించం

రాష్ట్రంలో రేషన్ బియ్యం రీ సైక్లింగ్,స్మగ్లింగ్ అనేది పెద్దమాఫియాగామారిపోయిందని, అటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేదిలేదని సిఎం స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం కోసం అధికారయంత్రాంగం ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్,మంత్రులు నాదెండ్ల మనోహర్, కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

'సెకి'పై తప్పుదారిపట్టిస్తున్న సిఎం ప్రకటన
- అధ్యయనమే తప్ప అడుగు ముందుకు లేదు
- సిపిఎం రాష్ట్ర కమిటీ

3

మహారాష్ట్ర సిఎంగా ఫడ్నవీస్
డిప్యూటీ సిఎంలుగా షిండే, అజిత్ పవార్ ప్రమాణ స్వీకారం

ముంబయి : మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ గురువారం పదవీ స్వీకార ప్రమాణం చేశారు. ఆయనతోబాటే ఉప ముఖ్యమంత్రులుగా శివసేన చీలిక నేత ఏక్‌నాథ్ షిండే, ఎన్‌సిపి చీలిక నేత అజిత్‌పవార్ కూడా ప్రమాణం చేశారు. ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో అట్టహాసంగా జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో వీరి చేత గవర్నర్ సిపి మరాఠీ ప్రమాణం చేయించారు. దీంతో గత రెండు వారాలుగా సిఎం కుర్చీ కోసం మహాయుతి కూటమిలో సాగిన రగడకు ప్రస్తుతానికి తెరపడింది. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌తోపాటు పలువురు కేంద్ర మంత్రులు, బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్‌డియే భాగస్వామ్య పక్ష ముఖ్యమంత్రులు, ఇతర నేతలు, ముఖేష్ అంబానీ, కుమార మంగళం బిర్లా వంటి బడా పారిశ్రామికవేత్తలు, బాలీవుడ్ నుంచి షారూక్ ఖాన్, సల్మాన్ ఖాన్, రణబీర్ కపూర్, మాధురి దీక్షిత్, సంజయ్ దత్, క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తదితరులు హాజరయ్యారు. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడికి చెందిన ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ మాట్లాడుతూ కులగణనకు మద్దతిస్తామని, అయితే అది రాజకీయ ప్రయోజనాల కోసం ఆయుధం కాకూడదని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రయోజనాల కోసం జనాభా గణనను నిర్మాణాత్మకంగా ఉపయోగించాలని అన్నారు. ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. సుస్థిర పాలనను అందిస్తామని, తన పాలనలో ప్రతీకార చర్యలేమీ తీసుకోబోమని అన్నారు. ఈ నెల 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయని, 9న స్పీకర్‌ను ఎన్నుకుంటామని చెప్పారు.


ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న ఫడ్నవీస్

14 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు
- నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



సాగునీటి సంఘాలకు ఈ నెల 14 నుంచి ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ. సాగునీటి సంఘాలకు మూడు అంచెల్లో ఎన్నికలు జగుగుతాయన్నారు. తొలిరోజు సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, రెండో రోజు డిస్ట్రిబ్యూషన్ కమిటీలకు , మూడో రోజు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాధ్యమైనంత మేర ఏకగ్రీవంగా ప్రతినిధులను ఎన్నుకునే విధంగా చూడాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఈ సంఘాల విలువను గుర్తించకుండా రద్దు చేసిందని విమర్శించారు. ఫలితంగా గుండ్లకమ్మ, పులిచింత, అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయన్నారు.

పేదల భూములు, ఇళ్లకు పట్టాల పంపిణీ
- రెవెన్యూ సదస్సుల్లో వాటికే అధిక ప్రాధాన్యతనివ్వాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

రాష్ట్రంలోని పేదల భూములకు, ఇళ్లకు పట్టాలు పంపిణీ చేయాలని, ప్రభుత్వం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల్లో వీటికే అధిక ప్రాధాన్యతనివ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం పాడేరు కాఫీ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేనటువంటి రైతులు రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్నారని, అలాగే గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ ఇళ్ల పట్టాలు లేని వారు లక్షల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం తెచ్చిన భూ దురాక్రమణ చట్టం దుర్మార్గమైనదని, పేదవారిని భూముల నుంచి ఖాళీ చేయించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే దురుద్దేశం దీనిలో ఉందని విమర్శించారు. రెండున్నర ఎకరాల మాగాణి, ఐదు ఎకరాలలోపు మెట్ట భూమికి ఈ చట్టం నుంచి మినహాయింపునివ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఉండే రెవెన్యూ భూముల వివాదాలను గ్రామ సభల్లో పరిష్కరించాలని కోరారు. చుక్క భూముల పేరుతో రైతుల భూములకు పట్టాలు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నటువంటి ఘటనలపై సుమారు 12 లక్షల మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పివిటిజిల పట్ల వివక్ష

అల్లూరి జిల్లాలోని 1600 గ్రామాల్లో జీవిస్తున్న ఆదిమ గిరిజన (పివిటిజి) తెగల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వారిని నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. 2006లో వచ్చిన అటవీ హక్కు చట్టం కింద పూర్తిస్థాయిలో పట్టాలు నేటికీ పంపిణీ కాలేదని తెలిపారు. టైగర్ జోన్, ఎన్విరాన్‌మెంట్ పేరుతో గిరిజనులను పోడు భూముల నుంచి ఖాళీ చేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, పక్కన కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, అప్పలనర్స

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అటవీ భూముల హక్కు పత్రాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పిఎం జన్‌మన్ పథకం కింద పివిటిజిల గృహ నిర్మాణానికి రూ.రెండు లక్షలు ఇస్తే సరిపోదని రూ.ఐదు లక్షలు కేటాయించాలని కోరారు.

అదానీ నుంచి పోర్టులకు విముక్తి కల్పించాలి

అదానీ పేరు ఎత్తడానికి రాష్ట్ర ప్రభుత్వం వణికిపోతోందని శ్రీనివాసరావు అన్నారు. అదానీ కంపెనీ పోర్టులు, విద్యుత్, హైవేలు పేరుతో రాష్ట్రాన్ని కబ్జా చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దాలని టిడిపి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదానీ చేతుల్లోంచి పోర్టులకు విముక్తి కల్పించి ప్రభుత్వమే వాటిని నిర్వహించాలన్నారు. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు చేసుకున్న ఒప్పందాల్ని రద్దు చేయాల న్నారు.

'ఉక్కు'పై సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలి : లోకనాథం

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ.. శుక్రవారం విశాఖకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉక్కు పరిరక్షణ విషయమై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన డిఎస్‌సి, జిఒ నెంబర్ 3 పునరుద్ధరణపై గతంలో ఇచ్చిన హామీల అమలుపై సిఎం స్పష్టతనివాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పాల్గొన్నారు.

జెపిసి వేయాల్సిందే!
- అదానీ వ్యవహారంపై పట్టుబట్టిన ప్రతిపక్షాలు
- 'మోడీ-అదానీ ఏక్ హై' టీ షర్ట్‌లతో నిరసన
- దూబే వ్యాఖ్యలపై సభ్యుల ఆగ్రహం



పార్లమెంటు ఆవరణలో ఆందోళన చేస్తున్న ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ ముడుపుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)ని వేయాల్సిందేనని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. గురువారం ఉదయం ఉభయ సభలు సమావేశం కావడానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఎంపీలు వినూత్న నిరసన తెలిపారు. 'మోడీ - అదానీ ఏక్ హై, అదానీ సేఫ్ హై' అన్న నినాదంతో కూడిన ప్రింటెడ్ టీ షర్ట్‌లను ధరించి ఆందోళనకు దిగారు. 'మోడీ - అదానీ భాయి భాయి ' అని గట్టిగా నినదిస్తూ పాత పార్లమెంట్ భవన్ ఎదుట బైఠాయించారు. ఆ తరువాత పార్లమెంట్ పాత భవనం నుంచి కొత్త భవనం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 'అదానీ ముడుపులతో ఎవరికి లాభం దక్కింది మోడీ' అని రాసి ఉన్న ప్లకార్డులతో పార్లమెంట్ ముఖ ద్వారం (మకర ద్వార్) వద్ద నిలబడి ఆందోళనకాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆర్‌జెడి, ఎన్‌సిపి, డిఎంకె, ఆప్, ఐయుఎంఎల్, కేరళ కాంగ్రెస్, ఎండిఎంకె తదితర పార్టీల నేతలు ప్లకార్డులు పట్టుకుని మోడీ సర్కార్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ అదానీ అవినీతిపై విచారణ మోడీ తనపైన వేసుకునే విచారణ గానే ఉంటుందని పలువురు వ్యాఖ్యానించారు. మకర ద్వార్ వద్ద ప్రతిపక్షాల ఆందోళనపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ, సభకు వెళ్లే ఇతర ఎంపీలకు దారివ్వాలని కోరారు. రూల్ 349 ప్రకారం.. సభకు హాజరయ్యే సభ్యులు ల్యాపెల్ పిన్ లేదా బ్యాడ్జ్ రూపంలో జాతీయ జెండా తప్ప మరెలాంటి బ్యాడ్జులు మిగతా 2లో



లక్ష డాలర్లకు బిట్ కాయిన్ విలువ

వాషింగ్టన్ : క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్ విలువ దూసుకుపోతోంది. రికార్డ్ స్థాయిలో లక్ష డాలర్లకు చేరింది. దీంతో భారత కరెన్సీలో ఒక్క బిట్ కాయిన్ విలువ రూ.84 లక్షల పైమాటే. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత క్రిప్టో కరెన్సీ విలువ పెరుగుతోంది. ఈ ఒక్క ఏడాదిలోనే బిట్ కాయిన్ విలువ రెండింతలయ్యింది. గడిచిన నాలుగు వారాల్లో ఆ కరెన్సీ విలువ 45 శాతం ఎగిసింది. అమెరికా ఎన్నికల్లో విజయం సాధించిన పార్టీ నేతల్లో క్రిప్టో కరెన్సీ అనుకూల వ్యక్తులు ఉండటమే ఇందుకు కారణం.

మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్ట్
పది గంటల తర్వాత హరీశ్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. పోలీసు అధికారులను కలిసేందుకు బుధవారం బంజారాహిల్స్ పిఎస్‌కు కౌశిక్‌రెడ్డి వెళ్లారు. ఆ సందర్భంలో సిఐతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో విధులకు ఆటంకం కలిగించారంటూ సిఐ రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు కౌశిక్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులు 20 మందిపై కేసు నమోదైంది. గురువారం ఉదయం కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు భారీగా చేరుకున్న పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా బిఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రతిఘటించారు. కాసేపటికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున బిఆర్‌ఎస్ కార్యకర్తలు కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆయన ఇంట్లోకి వెళ్లేందుకు హరీశ్‌రావు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇంటి గేట్లు దూకి వెళ్లేందుకు కార్యకర్తలు యత్నించారు. ఈ క్రమంలో హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. హరీశ్‌ను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకునేందుకు కార్యకర్తలు యత్నించారు. ఆ తర్వాత కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకు దిగిన బిఆర్‌ఎస్ నేతలను అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కౌశిక్‌రెడ్డిపై బంజారాహిల్స్ పోలీసులు బిఎన్‌ఎస్ 57, 126(2), 127(2), 132, 224, 333, 451(3), 191(2), రెడ్‌విత్ 190, రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా, ఉదయం 11 గంటల సమయంలో అదుపులోకి తీసుకొని గచ్చిబౌలి పిఎస్‌లో హరీశ్ రావును నిర్బంధించిన పోలీసులు రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో వదిలిపెట్టారు. పోలీస్ స్టేషన్‌లో కౌశిక్ రెడ్డిని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ కవిత, పలువురు బిఆర్‌ఎస్ నేతలు కలిశారు. కౌశిక్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. మెజిస్ట్రేట్ ముందు కౌశిక్‌రెడ్డిని హాజరుపర్చే అవకాశం ఉంది.

ప్రొ.చెంగయ్యపై దాడికి కెవిపిఎస్ ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ చెంగయ్యపై మత ప్రచారం నెపంతో దాడి చేయడాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటి ఖండించింది. మతోన్మాద, సంఘ వ్యతిరేక శక్తులు విశ్వవిద్యాలయంలో చెంగయ్య ఛాంబర్‌లోకి ప్రవేశించి దుర్భాషలాడి, భౌతికదాడికి పాల్పడినట్లు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఒ.నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. చెంగయ్య వాహనాన్ని కూడా దుండగులు ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- వైవి సుబ్బారెడ్డి కొడుకు పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

బెదిరించి కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్‌ల్లో తన వాటాల్ని లాక్కున్నారంటూ కర్నాటి వెంకటేశ్వరరావు (కెవి రావు) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మంగళగిరి పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ టిటిడి మాజీ చైర్మన్, ఎంపి, వైవి సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. వాటాల బదలాయింపు వ్యవహారంలో తన పాత్ర లేదని, తన తండ్రి రాజకీయ ప్రతిష్ఠను దిగజార్చేందుకు అధికార పార్టీ ప్రోద్బలంతో నాలుగున్నరేళ్ల తరువాత తప్పుడు కేసు పెట్టారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వానికి రూ.1000కోట్లు ఎగ్గొట్టారంటూ తనను ఇరికించారని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్‌లో హైకోర్టును కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పెళ్లిలో ఉంటే దాడిలో ఎలా ఉంటారు?

- టిడిపి ఆఫీస్‌పై దాడి కేసులో హైకోర్టు
- సిఐడి డిఎస్‌పి హాజరుకావాలని ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి ఆఫీసుపై దాడి జరిగినప్పుడు తాను నరసరావుపేటలో తన మేనల్లుడి పెళ్లిలో ఉన్నానని వైసిపి నేత, గుంటూరు కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి పలు ఆధారాలను హైకోర్టుకు నివేదించారు దాడి ఘటన సమయంలో అక్కడ ఉన్నారంటూ సిఐడి కౌంటర్ దాఖలు చేసింది. సుబ్బారెడ్డి టిడిపి ఆఫీసు వద్ద ఉన్నట్లు సిసి కెమెరాల్లో రికార్డ్ అయిందని కూడా చెప్పింది. సుబ్బారెడ్డి నర్సరావుపేటలో తన మేనల్లుడి పెళ్లిలో ఉంటే, దాడిలో ఎలా ఉంటారని హైకోర్టు పోలీసులను నిలదీసింది. ఈ నెల 12న మధ్యాహ్నం 2.15 గంటలకు స్వయంగా తమ ఎదుట హాజరుకావాలని దర్యాప్తు అధికారి డిఎస్‌పిని ఆదేశిస్తూ జస్టిస్ కె శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021, అక్టోబర్ 19న మంగళగిరి వద్ద టిడిపి మెయిన్ ఆఫీస్‌పై దాడి జరిగింది.

డివిడెండ్ల పంట

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేషన్ 2,413 కోట్ల రూపాయలను చెల్లించాయి. పెట్రోలియం సంస్థల తరువాత స్థానంలో మైనింగ్ రంగానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయి. ఈ రంగం నుండి దాదాపుగా 12,114 కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జమఅయ్యాయి. కోల్ ఇండియా నుండి అత్యధికంగా 8,073 కోట్ల రూపాయలు డివిడెండ్‌గా ప్రభుత్వానికి చేరాయి. అత్యధిక మొత్తంలో డివిడెండ్‌ను చెల్లించిన ప్రభుత్వ సంస్థగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కోల్ ఇండియా నిలిచింది. 29.54శాతం ప్రభుత్వ వాటా ఉన్న హిందుస్థాన్ జింక్ సంస్థ ఒక్కటే 3,619కోట్ల రూపాయల డివిడెండ్‌ను ప్రభుత్వానికి అందచేసింది. టెలికమ్యూనికేషన్స్‌కు చెందిన టిసిసిఐ నుండి 3,443 కోట్ల రూపాయలు కేంద్రానికి అందాయి.

60 వేల కోట్లు దాటుతాయా...?

గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థల నుండి 50 వేల కోట్ల రూపాయల డివిడెండ్ వస్తుందని అంచనా వేయగా, 63,749 కోట్ల రూపాయలు కేంద్ర ఖజానాకు చేరాయి. ఇది ఇప్పటి వరకు డివిడెండ్ల రూపంలో చేరిన అత్యధిక మొత్తం. దీనిని ఒక రికార్డుగా ఆర్థికశాఖ పేర్కొంది. తాజా గణాంకాల ప్రకారం ఈ ఏడాది కూడా 60వేల కోట్ల రూపాయల దాటి డివిడెండ్లు వస్తాయని, గత సంవత్సరపు రికార్డును బద్దలు కొట్టే అవకాశం కూడా ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది 56,260 కోట్ల రూపాయలు ఈ సంస్థల నుండి కేంద్రానికి చేరతాయని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వానికి భారంగా మారుతున్న ద్రవ్యలోటును అదుపులో ఉంచడానికి కూడా ప్రభుత్వ రంగ సంస్థల నుండి వస్తున్న నిధులు ఉపయోగపడుతున్నాయి.

ఆదివాసీలకు బాసటగా పోరాటాలు

- బిజెపి మతోన్మాదాన్ని వ్యతిరేకించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ముగిసిన అల్లూరి జిల్లా ప్రథమ మహాసభ

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)



మహాసభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

అల్లూరి జిల్లాలో ఆదివాసీలకు బాసటగా ఉధృత పోరాటాలు నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పాడేరులోని కాఫీ హౌస్ (సీతారాం ఏచూరి నగర్)లో రెండు రోజులుగా జరుగుతున్న పార్టీ అల్లూరి జిల్లా ప్రథమ మహాసభ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పర్యటించి, సదస్సులు నిర్వహించి, గిరిజనుల సమస్యలను గుర్తించి సమర శంఖాన్ని పూరించాలని పిలుపునిచ్చారు. ప్రజలపై రుద్దుతున్న బిజెపి మతోన్మాదాన్ని వ్యతిరేకించాలన్నారు. గిరిజన సమస్యల అధ్యయనానికి వర్క్‌షాప్ నిర్వహించాలని సూచించారు. వారపు సంతలను పోరాట కేంద్రాలుగా మార్చుకోవాలని, దళారుల మోసాలను అరికట్టేందుకు పోరాటాలు జరపాలని, ఆదివాసీలతో సంబంధాలను పెంపొందించుకోవాలని కోరారు. కొత్త రూపంలో కొత్త ప్రణాళికలతో పోరాటాలను రూపొందించుకోవాలన్నారు. గ్రామాల్లో కాఫీ రైతుల ఇబ్బందులు, సమస్యలపై జోక్యం చేసుకొని పోరాటాల ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గిరిజన యువత గంజాయికి బానిస కాకుండా కాపాడుకోవాలని సూచించారు.

ఉద్యమాలతోనే ఆదివాసీలకు మనుగడ : కె.లోకనాథం

ఉద్యమాలతోనే ఆదివాసీలకు మనుగడ అని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. పార్టీ మహాసభ రెండో రోజు ప్రారంభోపన్యాసం ఆయన చేశారు. సుదీర్ఘ కాలంగా ప్రజా ఉద్యమాల ద్వారా జిల్లాలోని ఆదివాసీలకు సిపిఎం అండగా నిలిచిందన్నారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ఆర్థిక విధానాలు గిరిజన ప్రాంతాల మనుగడపై ప్రభావం చూపిస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో గిరిజన హక్కులను, చట్టాలను పరిరక్షించుకొని ఆదివాసీ సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు రూపకల్పన చేసుకోవాలని సూచించారు. మహాసభ వేదికపై పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, తదితరులు ఉన్నారు. మహాసభలో 20 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

అల్లూరి జిల్లా కార్యదర్శిగా అప్పలనర్స



19 మందితో జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా పి.అప్పలనర్స తిరిగి ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కిల్లో సురేంద్ర, వి.ఉమామహేశ్వరరావు, డి.గంగరాజు, బి.చిన్నయ్య పడాల్, కె.త్రినాథ్, ఎస్‌బి.పోతురాజుతో పాటు 12 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఉన్నత విద్యామండలికి చైర్మన్‌ను నియమించాలి

- మంత్రి లోకేష్‌కు ఎస్‌ఎఫ్‌ఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్యామండలికి వెంటనే చైర్మన్‌ను నియమించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్న కుమార్, ఎ అశోక్ గురువారం లేఖ రాశారు. ఉన్నత విద్యను పర్యవేక్షించడంలో కీలకమైన ఉన్నత విద్యా మండలి అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో 17 విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ల నియామకానికి ప్రకటన విడుదల చేసి రెండు నెలలు కావస్తోందని, ఆ ప్రక్రియ నేటికీ ముందుకు సాగడం లేదన్నారు. విసి పోస్టుకు దరఖాస్తు చేసుకోవడంతో నియామకాల ప్రక్రియ నుంచి తనను తొలగించాలని ఇన్‌చార్జ్ చైర్మన్‌గా కొనసాగుతున్న రామ్మోహన్‌రావు ప్రభుత్వానికి లేఖ రాశారని పేర్కొన్నారు. వర్సిటీలో నామినీల ఎంపిక కోసం పాలకవర్గ సమావేశం తేది ప్రకటించి ఆ తర్వాత వాయిదా వేశారని గుర్తు చేశారు. పదేళ్లుగా అధ్యాపక పోస్టులు భర్తీ చేయలేదని పేర్కొన్నారు. పూర్తిస్థాయి విసి లేకపోతే నియామకాల భర్తీ సాధ్యం కాదని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్షణమే ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌ను నియమించి విసి నియామకాలు, ఇతర పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు.

యువతకు నైపుణ్య శిక్షణ కోసం
గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం

- మంత్రి లోకేష్ సమక్షంలో సంతకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్య, నైపుణ్యాభివృద్ధి, విద్యార్థులు, డెవలపర్లకు ఎఐ ఆధారిత నైపుణ్యాల కోసం 10 వేల మందికి ఎసెన్షియల్ పేరుతో గూగుల్ నైపుణ్య కోర్సు అందించనుంది. ఈ అంశంపై గూగుల్‌తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో సచివాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. గూగుల్ క్లౌడ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ బిక్రమ్ సింగ్ బేడీ, ప్రభుత్వం నుంచి రియల్ టైం గవర్నెన్స్ శాఖ కార్యదర్శి సురేష్‌కుమార్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. అంతర్జాతీయంగా ఎఐ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో గూగుల్ సంస్థ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఈ సందర్భంగా ప్రభుత్వం తెలిపింది. యువతకు ఎఐ ఆధారిత భవిష్యత్ అవకాశాలను కల్పించేందుకు గూగుల్ సంస్థ రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందని మంత్రి లోకేష్ అన్నారు. ఎఐ రంగంలో రాష్ట్రం దూసుకుపోవడంతో పాటు యువతకు అంతర్జాతీయస్థాయి నైపుణ్య శిక్షణ లభిస్తుందని, తద్వారా అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. పరిపాలన వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించడం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనా విధానానికి అనుగుణంగా ఈ ఒప్పందం చేసుకుంటున్నామని గూగుల్ మ్యాప్స్ జనరల్ మేనేజర్ లలితా రమణి తెలిపారు. సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇడిబి సిఇవో సాయికాంత్ వర్మ, ఆర్‌టిజిఎస్ సిఇవో దినేష్‌కుమార్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పెట్టుబడుల విభాగం ఉన్నతాధికారి యువరాజ్ పాల్గొన్నారు.

నాడు కేసులు వరకూ వెళ్లి..
నేడు నోరు మెదపరేం !

- సెకితో ఒప్పందాలపై టిడిపిని నిలదీసిన షర్మిల
- విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలపై ఎసిబికి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



విజయవాడ ఎసిబి కార్యాలంలో సెకీ విద్యుత్ ఒప్పందాలపై మాట్లాడుతున్న షర్మిల

సౌర విద్యుత్ ఒప్పందాల విషయంలో వైసిపి ప్రభుత్వం తప్పుచేస్తోందంటూ నాడు కేసులు కూడా దాఖలు చేసిన టిడిపి, ఇప్పుడు అధికారంలోకి వచ్చి కూడా మౌనంగా ఉండటాన్ని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) చీఫ్ వైఎస్ షర్మిల ప్రశ్నించారు. అధిక ధరలకు సోలార్ విద్యుత్ కొనడం వల్ల ఒప్పందం చేసుకున్న మాజీ సిఎం జగన్‌కు నష్టం లేదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న చంద్రబాబుకు నష్టం లేదని, రాష్ట్ర ప్రజలు మాత్రం 25 ఏళ్లలో రూ.లక్షన్నర కోట్లు నష్టపోవాల్సి వస్తుందని ఆమె అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కోర్టు కేసులు వేసిన టిడిపి నాయకులు ఇప్పుడు అధికారంలో ఉన్నా మౌనంగా ఉన్నారని తప్పుబట్టారు. సెకీతో విద్యుత్ ఒప్పందాలపై విజయవాడలోని ఎసిబి రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఇనుప పంజరాన్ని ప్రదర్శిస్తూ ప్రభుత్వం ఎసిబిని పంజరంలో బందీని చేసిందన్నారు. అదానీపై అమెరికాలో దర్యాప్తు జరుగుతుందని, సోలార్ పవర్ డీల్‌లో జగన్‌కి రూ.1750 కోట్లు ముడుపులు ఇచ్చారని అక్కడి దర్యాప్తు సంస్థ ఎఫ్‌బిఐ వెల్లడించిందన్నారు. ఇక్కడి దర్యాప్తు సంస్థలు మొద్దు నిద్రలో ఉన్నాయన్నారు. ఇంత అవినీతి జరిగితే అటు సిబిఐ, ఇటు ఎసిబి ఎందుకు బయటపెట్టలేకపోయాయని ప్రశ్నించారు. ప్రభుత్వం అదానీపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్నారు. ఆయన పేరు ఉచ్చరించడానికి సైతం భయపడతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎసిబిని పంజరంలో చిలుక మాదిరిగా బందీ చేసిందని చెప్పారు. ఈ దర్యాప్తు సంస్థను పంజరం నుంచి విడుదల చేయాలని కోరారు. లంచాల వ్యవహారంపై ఎసిబి దర్యాప్తు చేసి నిజాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. జగన్, చంద్రబాబు ఇద్దరూ ఒక్కటేనన్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు గ్రహిస్తున్నారని తెలిపారు. ఎసిబికి ఫిర్యాదు చేసిన వారిలో ఎపిసిసి నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, కొలనుకొండ శివాజీ, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి తదితరులు ఉన్నారు.

సినీ హీరో అల్లు అర్జున్‌పై కేసు

- థియేటర్ యాజమాన్యంపైనా..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్ సంధ్య థియేటర్ ఘటనలో హీరోఅల్లు అర్జున్‌పై చిక్కడపల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పుష్ప సినిమా ప్రీమియర్ షో సందర్భంగా అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు వస్తున్న సందర్భంలో భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు సంధ్య థియేటర్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. అల్లు అర్జున్ వస్తున్న సమాచారాన్ని పోలీసులకు సరైన సమయంలో చెప్పకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అల్లు అర్జున్ టీమ్‌పై కూడా సెక్షన్ 105, 118 బిఎన్‌ఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్టు సెంట్రల్ జోన్ డిసిపి అక్షాంశ్ యాదవ్ తెలిపారు. "బుధవారం రాత్రి 9.40 గంటలకు పుష్ప-2 ప్రీమియర్ షోను సంధ్య థియేటర్‌లో ఏర్పాటు చేశారు. దీనికి అధిక సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. అభిమానులతో పాటు సినిమాలో నటించిన కీలక నటులు థియేటర్‌కు వస్తారనే సమాచారం పోలీసులకు లేదు. కనీసం థియేటర్ యాజమాన్యం కూడా సమాచారం ఇవ్వలేదు. యాజమాన్యం కూడా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదు. పబ్లిక్‌ను అదుపుచేసేందుకు థియేటర్ ఎంట్రీ, ఎగ్జిట్‌లో ఎలాంటి ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటు చేయలేదు. రాత్రి 9.40 గంటలకు వ్యక్తిగత భద్రతా సిబ్బందితో సంధ్య థియేటర్ వద్దకు అల్లు అర్జున్ వచ్చారు. ఆ సమయంలో భద్రతా సిబ్బంది ప్రేక్షకులను అదుపుచేసే క్రమంలో నెట్టేయడం ప్రారంభించారు. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి కుటుంబం ఈ తొక్కిసలాటలో కిందపడిపోయారు. అధిక సంఖ్యలో అభిమానులు ఉండటంతో వారికి ఊపిరాడలేదు. వారిని గమనించిన పోలీసు సిబ్బంది వెంటనే బయటకు లాగారు. రేవతి కుమారుడు 13 ఏళ్ల శ్రీతేజకు సిపిఆర్ చేసి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రేవతి మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. శ్రీతేజను కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని డిసిపి యాదవ్ తెలిపారు.

కర్నూలులో యురేనియం తవ్వకాలకు అనుమతి లేదు

- అనుమతి కోసం ఎఎండి వేచి చూస్తోంది
- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కర్నూలులో యురేనియం నిల్వలను కనిపెట్టేం దుకు అటామిక్ మినరల్ డైరెక్టరేట్ (ఎఎండి) ఎటు వంటి అనుమతి ఇవ్వలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. గురువారం రాజ్యసభలో వైసిపి ఎంపి వైవి సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. యురేనియం నిల్వలను కనిపెట్టేందుకు కర్నూలు జిల్లాలోని 15 గ్రామాల్లో 68 బోర్లు తవ్వేందుకు అటామిక్ మినరల్ డైరెక్టరేట్ (ఎఎండి) అనుమతినిచ్చిన విషయం వాస్తవమేనా? అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఎటువంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. 2017-18లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (అటవీ శాఖ) అనుమతి పొందిన తరువాత కేంద్ర ప్రభుత్వ ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఎఎండి), డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డిఎఇ) కర్నూల్ డివిజన్‌లోని ఆదోని రేంజ్‌లో కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో 20 బోర్ల డ్రిల్లింగ్ నిర్వహించినట్లు చెప్పారు. భూగర్భంలో తక్కువ గ్రేడ్ యురేనియం ఖనిజం ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలను డ్రిల్లింగ్ సూచించిందని అన్నారు. యురేనియం ఖనిజం ఉండే అవకాశాన్ని తనిఖీ చేయడానికి డ్రిల్లింగ్ కోసం విజయవాడలో ఉన్న అటవీ, పర్యావరణ శాఖను అనుమతి కోసం ఎఎండి అభ్యర్థించిందని తెలిపారు.

జెపిసి వేయాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

ప్రదర్శించడం కానీ, ధరించడం కానీ చేయరాదని అన్నారు. 'మోడీ - అదానీ ఏక్ హై, అదానీ సేఫ్ హై' ప్రింటెడ్ టీ షర్ట్‌లను ధరించి ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు.

బిజెపి ఎంపి వ్యాఖ్యలపై సభలో గందరగోళం

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకొని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె చేసిన వ్యాఖ్యలు గురువారం లోక్‌సభలో గందరగోళాన్ని సృష్టించాయి. సభ సమావేశం కాగానే ప్రతిపక్షాలు సంభాల్ ఘటన, అదానీ వ్యవహారంపై చర్చకు పట్టుబట్టాయి. దూబే మాట్లాడటం పూర్తికాగానే, సంభాల్ అల్లర్లపై ప్రతిపక్షాలు మాట్లాడేందుకు అనుమతిస్తానని స్పీకర్ చెప్పారు. దూబే మాట్లాడుతూ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని అన్నారు. కాంగ్రెస్, రాహుల్, ప్రియాంక వాద్రాలకు ప్రశ్నిస్తూ... 10 అంశాలను లేవనెత్తారు. రాహుల్ గాంధీ దేశ ద్రోహి అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. అమెరికాకు చెందిన బిలియనీర్ జార్జ్ సోరోస్‌తో రాహుల్ గాంధీకి సంబంధాలు ఉన్నాయని దూబె ఆరోపించారు. రాహుల్, సోరోస్, ఒసిసిఆర్‌పి మధ్య ట్రై యాంగిల్ బంధం ఉందన్నారు. వీరిలో ఒకరు బాధ పడ్డా... మిగిలిన వారు కలత చెందుతారని వ్యంగ్యంగా అన్నారు. . సోరోస్‌కు సాయం చేయాలని రాహుల్ చూస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిషికాంత్ దూబే క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు స్పీకర్ తొలుత వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా సభలో గందరగోళం నెలకొనడంతో మధ్యాహ్నం 3 గంటలకు మళ్లీ వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రైల్వే సవరణ బిల్లుపై మాట్లాడేందుకు యత్నించగా ప్రతిపక్షాలు అభ్యంతరం తెలిపాయి. దీంతో సభలో తీవ్ర గందరగళం నెలకొంది. వెంటనే జగదాంబిక పాల్ సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఐక్య పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామచంద్రరావు, గోపి అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1394వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలుపుదల చేసి, కర్మాగారానికి తగిన ముడిసరుకు అందజేయాలని, కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను నడపాల్సిన కేంద్ర సర్కారే వాటిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నడం దారుణమన్నారు. కార్మికుల శక్తిని తక్కువ అంచనా వేయొద్దని, విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు కార్మికులు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.


కృష్ణాజిల్లా వల్లూరుపాలెం వద్ద కృష్ణా కరకట్టపై ఆందోళనకు దిగిన రైతులు

రోడ్డెక్కిన రైతులు

- దళారులు, మిల్లర్లు దోచుకుంటున్నారని రాస్తారోకో
- కృష్ణా కరకట్టపై స్తంభించిన వాహనాలు
- కలెక్టర్ హామీతో విరమణ

ప్రజాశక్తి - తోట్లవల్లూరు (కృష్ణా జిల్లా), అమరావతి బ్యూరో

కృష్ణా జిల్లాలో ధాన్యం రైతులు రోడ్డెక్కారు. 1264 ఎంటియు రకం ధాన్యాన్ని కొనుగోలు చేయడంలేదంటూ తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం రొయ్యూరు, బొడ్డపాడు, చిన్న పులిపాక గ్రామాల రైతులు గురువారం ఆందోళనకు దిగారు. వల్లూరుపాలెం వద్ద కృష్ణానది కరకట్టపై ధర్నా, రాస్తారోకో చేశారు. దీంతో కరకట్టపై రాకపోకలు స్తంభించాయి. ఆరుగాలం కష్టించి పంట పండించిన తమను దళారులు, అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై దోచుకుంటున్నారంటూ నిరసన వ్యక్తం చేశారు. 1262 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొన్న ధాన్యానికి సకాలంలో డబ్బులు జమ వేయాలని, మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న కృష్ణా జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ వల్లూరుపాలెం వచ్చి రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 15 రోజుల క్రితం కోసిన పంటను కూడా కొనుగోలు చేయడంలేదని, తేమ శాతం 16 నుంచి 17 వరకు ఉన్నా కొనుగోలు చేయడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. 1262 రకం ధాన్యాన్ని కొనడం లేదని, రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కె) అధికారులకు చెబితే నేరుగా మిల్లర్ల వద్దకెళ్లి మాట్లాడి అమ్ముకోవాలని అంటున్నారని వివరించారు. కొండవీటి ఆంజనేయులు, ఆచంట నాగ సతీష్, మోర్ల శివయ్య అనే ముగ్గురు రైతులు కలిపి పండించిన ధాన్యం 339 టిక్కీలు దావులూరు బాలాజీ రైస్ మిల్లులో రూ.1600 చొప్పున అమ్ముకోవాలని మండల వ్యవసాయ అధికారి చెప్పారని, ప్రభుత్వ మద్దతు ధర రూ.1740 ఉండగా వ్యవసాయాధికారి మిల్లరుతో రేటు మాట్లాడారని, తప్పనిపరిస్థితుల్లో అమ్ముకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని, తేమ శాతం 16 నుంచి 17వరకు ఉంచగలిగితే మద్దతు ధరకే కొంటామని రైతులకు హామీ ఇచ్చారు. అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని, రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రైతుల ధాన్యం విషయంలో అవకతవకలకు పాల్పడిన రొయ్యూరు ఆర్‌ఎస్‌కె టిఎ అశోక చక్రవర్తిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ హామీతో రైతులు ఆందోళన విరమించారు.

కలెక్టర్ వివరణ కోరిన సిఎం

రైతులు ఆందోళన చేసిన ఘటనపై కృష్ణా జిల్లా కలెక్టర్ బికె బాలాజీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వివరణ కోరారు. రైతుల ఆందోళనకు అధికారుల నిర్లక్ష్యమే కారణమైతే విచారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాలను పక్కాగా అమలు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.

ప్రజలకు భారం లేకుండా విద్యుత్ కొనుగోళ్లు

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలకు భారం లేకుండా విద్యుత్ కొనుగోళ్లు ఉండాలని విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లపాటు చేసిన చారిత్రాత్మక తప్పిదాలు ఇప్పుడు రాష్ట్రప్రజలకు గుదిబండగా మారాయని విమర్శించారు. రానున్న 6 నెలలకు సంబంధించిన విద్యుత్ డిమాండ్, సరఫరాల అంచనాలపై సంబంధిత అధికారులతో సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ రంగానికి ఎటువంటి సమస్యలూ ఎదురుకాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని డిమాండ్ మేరకు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పెరుగుతున్న విద్యుత్ డిమండ్‌కు తగ్గట్లుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ఎస్సి,ఎస్టి వినియోగదారులకు అందించే ఉచిత విద్యుత్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో ఇంధన శాఖప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జెన్‌కో ఎండి కెవిఎన్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జెఎండి కీర్తి చేకూరి, డిస్కంల సిఎండిలు ఐ పృధ్వీతేజ్, రవి పటాన్ సుభాష్, కె సంతోషరావు పాల్గొన్నారు.

ముడి సరుకు సరిపోకే నష్టాలు

- వైజాగ్ స్టీల్‌ప్లాంట్ స్టాండింగ్ కమిటీ నివేదిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన ఉక్కు ఉత్పత్తిదారు రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌ఐఎన్‌ఎల్)కు ముడిసరుకు సరిపడినంత లేకపోవడం వల్లే నష్టాలు వస్తున్నాయని స్టాండింగ్ కమిటీ నివేదిక స్పష్టం చేసింది. పార్లమెంటు ఉభయ సభల్లో కమిటీ గురువారం తన రిపోర్ట్‌ను ప్రవేశపెట్టింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ 2022-23, 2023-24 మధ్య కాలంలో రూ.7,707 కోట్ల నష్టాలను చవిచూసిందని కమిటీకి మంత్రిత్వ శాఖ తెలిపిందని పేర్కొంది. 2021-22లో రూ.913 కోట్ల నికర లాభం ఆర్జించిందని కమిటీకి వివరించిందని తెలిపింది. దిగువ స్ట్రీమ్, అప్‌స్ట్రీమ్ సామర్థ్యాలలో అసమతుల్యత, వర్కింగ్ క్యాపిటల్ రుణాల పెరుగుదల కారణంగా లిక్విడిటీ సంక్షోభం, ముడి సరుకు సరిపోకపోవడం కారణంగా సబ్ ఆప్టిమల్ కార్యకలాపాలు, కోర్టు అటాచ్‌మెంట్‌లు, దివాలా, ఇతర చెల్లింపుల ప్రక్రియ మొదలైన వాటి కారణంగా ఈ నష్టాలు వస్తున్నాయని పేర్కొంది. ప్లాంట్ పని కొనసాగడానికి, నాన్ పెర్ఫార్మింగ్ అసెట్ (ఎన్‌పిఎ)గా వర్గీకరించకుండా ఉండటానికి ముందస్తుగా అత్యవసర నిధులను ప్రభుత్వం పొడిగించిందని తెలిపింది. సంబంధిత మంత్రిత్వ శాఖలతో సంప్రదింపులు జరిపి ఆర్‌ఐఎన్‌ఎల్ ముందుకు వెళ్లేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు కమిటీకి ప్రభుత్వం తెలియజేసిందని పేర్కొంది.

జనాభా ప్రాతిపదికన 15వ ఆర్థిక సంఘం నిధులు

- జాస్తి వీరాంజనేయులు డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన పెంచాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం నాడిక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. భారత రాజ్యాంగంలోని 73, 74 రాజ్యాంగ సవరణలు ప్రకారం 29 అంశాలను రాష్ట్ర ప్రభుత్వాలు, గ్రామ పంచాయతీలకు బదిలీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులను జనాభా ప్రాతిపదికన పెంచాలని, ప్రస్తుతం ఇచ్చే నిధులు సరిపోవటం లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేంద్రం ఇచ్చే నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తోందని తెలిపారు.

విద్యార్థి బ్యాగులో బుల్లెట్లు !

- గన్నవరం విమానాశ్రయంలో కలకలం

ప్రజాశక్తి-గన్నవరం

కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయంలో బుల్లెట్లు కలకలం రేపాయి. భద్రతా సిబ్బంది తనిఖీల్లో ఓ ప్రయాణికుడి వద్ద బుల్లెట్లు ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గన్నవరం సిఐ బివి శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రయివేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఆర్య అనే విద్యార్థి విజయవాడ నుంచి ఢిల్లీకి వెళ్లేందుకు గురువారం విమానాశ్రయానికి చేరుకున్నారు. భద్రతా సిబ్బంది తనిఖీల్లో విద్యార్థి బ్యాగ్‌లో రెండు బుల్లెట్లు ఉండటాన్ని గుర్తించారు. బుల్లెట్లను స్వాధీనం చేసుకొని గన్నవరం పోలీసులకు అప్పగించారు. యువకుడిది హర్యానాలోని పానిపట్టు ప్రాంతమని సిఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నేటి నుంచి కుప్పంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ఈ నెల 6నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు గ్రామ వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 6,7 తేదీల్లో గుడిపల్లి, 9,10 తేదీల్లో కుప్పం, 11, 12 తేదీల్లో కుప్పం(యు), 16,17 తేదీల్లో రామకుప్పం, 18,19 తేదీల్లో శాంతిపురంలో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొంది.

యురేనియం తవ్వకాలు నిలిపివేయాలి

- సిఎంకు సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోని యురేనియం తవ్వకాలు నిలిపివేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు గురువారం లేఖ రాశారు. యురేనియం తవ్వకాల వల్ల ప్రజలు అనారోగ్య సమస్యల పాలయ్యే అవకాశం ఉందని, ఉపాధిని కోల్పోతారని, పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని లేఖలో పేర్కొన్నారు. గతంలో కర్నూలు జిల్లా కపట్రాళ్లలో 1,100 ఎకరాల విస్తీర్ణంలో 68 చోట్ల బోర్లు వేసేందుకు కేంద్రం అనుమతి ఇవ్వడంతో పనులు ప్రారంభించగా స్థానికులు ఆందోళనలతో తవ్వకాలు నిలిపివేసినట్లు చెప్పారు. ఈ విషయంపై కేంద్రంతో చర్చించి తవ్వకాలు నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని సిఎంను కోరారు.

'సెకి'పై తప్పుదారి పట్టిస్తున్న సిఎం ప్రకటన

- అధ్యయనమే తప్ప అడుగు ముందుకు లేదు
- సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అదాని విద్యుత్ ఒప్పందాల రద్దుపై ముఖ్యమంత్రి ప్రజలను తప్పుదారి పట్టించేలా ప్రకటన చేశారని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటును, దేశాన్ని కుదిపేస్తున్న అదాని మహాకుంభకోణం రాష్ట్రం చుట్టూ తిరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఆ ఒప్పందాలను రద్దు చేయకుండా దొడ్డిదారిలో కొనసాగించులనుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. 'సెకి ఒప్పందాన్ని అధ్యయనం చేస్తున్నాం.. రద్దు చేసుకుంటే ఫైన్ కట్టాల్సి వస్తుంది' అంటూ ముఖ్యమంత్రి మీడియాతో చెప్పటం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 10 రోజుల నుంచి అధ్యయనం చేస్తూనే ఉన్నామని చెప్పున్నారే తప్ప అందులో ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒప్పందం రద్దు చేసుకునే అవకాశం ఉందని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ నేరుగా ఉత్తరం రాసినా ముఖ్యమంత్రి దీనిపై స్పందించలేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి సరఫరా చేస్తామన్న విద్యుత్‌ను అదాని ఇప్పటివరకు సరఫరా చేయలేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించిందని తెలిపారు. దీనికి ఆ కంపెనీపై ఎలాంటి సూట్ వేయటంగానీ, అపరాధ రుసుం వసూలు చేయడం గానీ చేయలేదని పేర్కొన్నారు. ఒప్పందాన్ని ఉల్లంఘించిన అదాని కంపెనీపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మనం ఫైన్ కట్టాలని చెప్పడం ప్రజల్ని తప్పుదారి పట్టించటమేనని విమర్శించారు. అవినీతి కేసులో అమెరికాలో కుతికల్లోతులో దిగబడి ఉన్న అదాని నాటి రాష్ట్ర ప్రభుత్వానికి లంచం ఇచ్చి అధిక ధరలకు ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. తగ్గించే అవకాశం ఉన్నా పాతికేళ్ల పాటు అదే ధరను కొనసాగించారని తెలిపారు. దీనివల్ల రూ.లక్షల కోట్ల మేర ప్రజలపై భారం పడుతుందని గుర్తుచేశారు. అయినా ముఖ్యమంత్రి దీనిపై మౌనం వహించటం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎలాంటి సంకోచం లేకుండా ఒప్పందాలు అన్నింటినీ రద్దు చేసి తక్కువ ధరకు ప్రజలకు విద్యుత్ సరఫరా చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

త్వరలో మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు

- సహకార సంఘాల ఎన్నికలకు కసరత్తు : మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలను త్వరలో నియమిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గుంటూరులోని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే రెండు దఫాలుగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామని, త్వరలో మార్కెట్ కమిటీల నియామకాన్ని కూడా చేపడతామని వెల్లడించారు. రాష్ట్రంలో ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సహకార సంఘాలకు కూడా త్వరలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. సహకార సంఘాలకు, రైతులకు సంబంధించిన వారు ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలని అన్నారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. గుంటూరు మిర్చి యార్డులో రూ.350 కోట్ల వరకు నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయని విజిలెన్స్ విభాగం అధికారులు ఇటీవల నివేదిక ఇచ్చారని ఈ మేరకు బాధ్యులపై త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. గుంటూరు మిర్చి యార్డు విస్తరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం 50 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న యార్డు ప్రాంగణాన్ని 200 ఎకరాల్లో స్థల సేకరణ చేసి విస్తరింపచేస్తామని వివరించారు.

ప్రజాశక్తి సబ్ ఎడిటర్ ఆర్‌కె.నాయుడుకు పితృవియోగం

ప్రజాశక్తి - కె.కోటపాడు (అనకాపల్లి)



రామునాయుడు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి విశాఖపట్నం డెస్క్ సబ్ ఎడిటర్ ఆర్‌కె.నాయుడు తండ్రి, కొరువాడ మాజీ సర్పంచ్ రెడ్డి రామునాయుడు (79) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. రామునాయుడు కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే విశాఖలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. అంత్యక్రియలు తమ స్వగ్రామమైన అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం కొరువాడ గ్రామంలో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

రామునాయుడుకు భార్య దేవుడమ్మ, కుమారుడు ఆర్‌కె.నాయుడు, కుమార్తె రవణమ్మ ఉన్నారు. రామునాయుడు కొరువాడ గ్రామ సర్పంచ్‌గా 1988 నుంచి 1995 వరకు పని చేశారు. 1995 నుంచి 2010 వరకు విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. ఆ సమయంలో రామునాయుడు తన సొంత స్థలాన్ని పాల సంఘం భవనానికి విరాళంగా ఇచ్చి డెయిరీ నిధులతో పాలకేంద్ర భవనాన్ని నిర్మించారు. ఇలా బహుముఖ సేవలతో గ్రామ ప్రజల మన్ననలు పొందారు. రామునాయుడు మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ఫోన్‌లో ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు, విశాఖ జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు గండి నాయినిబాబు, రొంగలి ముత్యాల నాయుడు, వనము సూర్యనారాయణ, ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ ఎర్ర దేముడు తదితరులు సంతాపం ప్రకటించారు.

మేల్ హెల్త్ అసిస్టెంట్లకు ఉద్యోగభద్రత కల్పించాలి

- యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న మేల్ హెల్త్ అసిస్టెంట్ల (పురుష ఆరోగ్య కార్యకర్తలు)ను తొలగించకుండా, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులు కె జగన్‌మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2001, 2002లో జీఓ నెంబరు 273, జీఓ నెంబరు 459 ద్వారా వివిధ సందర్భాల్లో జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా మేల్ హెల్త్ అసిస్టెంట్లను నియమించారని తెలిపారు. ఈ విధంగా నియామకమైన వారు సుమారు 1500 మంది వరకు ఉంటారని, 20 సంవత్సరాల నుంచి ఉద్యోగ బాధ్యతల్లో ఉన్నారన్నారు. ఏదో ఒక రోజు రెగ్యులర్ అవుతామనే ఆశతో అరకొర వేతనాలతో ఉద్యోగాలు చేశారన్నారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు పురుష ఆరోగ్య కార్యకర్తలును తొలగించాలని ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 20 ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వారందరూ రోడ్డున పడతారని తెలిపారు. ప్రభుత్వం మానవీయకోణంలో ఆలోచించి వారిని తొలగించకుండా, ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



కియా కారును పరిశీలిస్తున్న మంత్రులు వాసంశెట్టి సుభాష్, సవిత తదితరులు

కియాకు మరింత ప్రోత్సాహం

- వైసిపి హయాంలో పరిశ్రమల్లో భద్రత కరువు
- 34 మంది కార్మికులు మృతి : మంత్రులు వాసంశెట్టి, సవిత

ప్రజాశక్తి - పెనుకొండ

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో ఏర్పాటు చేసిన కియా పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మరింత ప్రోత్సాహాన్ని అందిస్తామని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖలు, బిసి సంక్షేమ శాఖ మంత్రులు వాసంశెట్టి సుభాష్, సవిత అన్నారు. పెనుకొండ సమీపంలోని యర్రమంచి గ్రామం వద్ద ఉన్న కియా కార్ల పరిశ్రమను మంత్రి సవితతో కలిసి సుభాష్ పరిశీలించారు. కియా సిఇఒ కబ్ డాంగ్లీ, హెచ్‌ఒడిలు హాన్, మా, శాంగ్ జే, పాటిల్, సోమశేఖర్ రెడ్డి తదితరులు కియా సంస్థ గురించి మంత్రులకు తెలియజేశారు. కియా పిఆర్‌ఒ రాజశేఖర్ ఆధ్వర్యంలో పరిశ్రమ ద్వారా చేపట్టిన అభివృద్ధి, సిఎస్‌ఆర్ పనుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులకు తెలియజేశారు. అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. కియా, ఆ పరిశ్రమ అనుబంధ సంస్థల్లో సుమారు 20 వేలమంది ఉపాధి పొందడం హర్షణీయమన్నారు. గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పలు పరిశ్రమల్లో భద్రత లోపాల కారణంగా 34 మంది కార్మికులు మరణించారని తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో వసుధ మిశ్రా కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. కియాలో వసుధ మిశ్రా కమిటీ సందర్శించేలా చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి వేగవంతమైందన్నారు. ఈ కార్యక్రమంలో కియా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం సేకరించిన 48 గంటల్లో నగదు చెల్లింపు : నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రైతుల నుంచి ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే నగదు చెల్లింపులు చేస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆ శాఖ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆయన గురువారం విశాఖపట్నం వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో మంత్రి నాదెండ్ల విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 1.51 లక్షల మంది రైతుల నుంచి 10.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతులకు డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. నేటికి రూ.2,331 కోట్లును రైతులకు చెల్లించామని తెలిపారు. కేవలం పది రోజుల్లో 6.63 లక్షల మెట్రిక్ టన్నులు కొన్నామన్నారు.



రేషన్ మాఫియాపై ఉక్కుపాదం

పేదలకు అందాల్సిన బియ్యాన్ని విదేశాలకు తరలిస్తున్న మాఫియాపై తమ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని నాదెండ్ల తెలిపారు. రేషన్ బియ్యం తరలింపుపై చేసిన దాడులకు సంబంధించి 1,066 కేసులు నమోదు చేసి 729 మందిని అరెస్టు చేశామని, 102 వాహనాలను సీజ్ చేశామని వెల్లడించారు. అవసరమైతే పీడీ యాక్ట్‌ను ప్రయోగిస్తామని హెచ్చరించారు. అక్రమంగా తరలిస్తున్న 62 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామని, మార్కెట్ విలువ సుమారు రూ.240 కోట్లు ఉంటుందని తెలిపారు. రేషన్ మాఫియా చేసే అక్రమాల తీవ్రతను గుర్తించి సిబిసిఐడి విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు. మూడేళ్లలో 1.31 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కాకినాడ పోర్టు నుంచి ఎగుమతయ్యాయని, అక్కడి ప్రాంతాన్ని స్మగ్లింగ్ డెన్‌గా తయారు చేసుకొని రాష్ట్రానికి, ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ వీరపాండ్యన్, ఎమ్‌డి మంజిల్ జిలానీ పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమలకు గడ్డుకాలమే..!

- జిఎస్‌టి పెంచితే భారీగా మూత
- లక్ష ఉద్యోగాలు ఊడొచ్చు
- సిఎంఎఐ ఆందోళన



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ చర్యలు వస్త్ర పరిశ్రమను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోన్నాయి. రెడిమేడ్ గార్మెంట్స్‌పై పన్ను రేట్లను పెంచాలని ఇటీవల జిఎస్‌టికి సంబంధించిన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జిఒఎం)లో కీలక ప్రతిపాదన చేశారు. అదే జరిగితే ముఖ్యంగా ఈ రంగంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ) గడ్డుకాలాన్ని ఎదుర్కోవాల్సి రావొచ్చని ది క్లాతింగ్ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిఎంఎఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జిఒఎం నూతన ప్రతిపాదనల్లో రూ.1500 లోపు వస్త్రాలపై 5 శాతం జిఎస్‌టి అమల్లో ఉంటుంది. అయితే రూ.1500 నుంచి రూ.10000 వస్త్రాలపై 18 శాతం జిఎస్‌టి, రూ.10వేల పైబడిన దుస్తులపై 28 శాతం పన్నులను వసూలు చేయాలని ప్రతిపాదించింది.

ఈ అధిక పన్ను రేట్ల విధానం తమ పరిశ్రమను దెబ్బతీయనుందని సిఎంఎఐ ఆందోళన వ్యక్తం చేసింది. అధిక ధరలు తయారీ, డిమాండ్‌ను దెబ్బతీయనున్నాయని తెలిపింది. పన్ను రేట్ల పెంపునతో సంఘటిత రిటైల్ రంగానికి ప్రమాదమేనని పేర్కొంది. ఈ మార్పు అక్రమ వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చనుందని హెచ్చరించింది. "ఇప్పటికే టెక్స్‌టైల్ పరిశ్రమ ఒత్తిడిని ఎదుర్కొంటుంది. నూతన పన్ను ప్రతిపాదన ఒక లక్ష ఉద్యోగాలను కోల్పోయేలా చేయనుంది. స్పిన్నింగ్, నేత, వస్త్రాల తయారీ, ఎస్ఎంఇ సంస్థల ఆదాయాలు మరింత హరించనున్నాయి. దీంతో లాభదాయకతపై ప్రభావం పడనుంది. పన్నుల పెంపు ముఖ్యంగా జీవనోపాధికి ముప్పు కలిగించనుంది." అని సిఎంఎఐ తన ప్రకటనలో పేర్కొంది.

"ఈ రంగం ప్రస్తుతం 20 లక్షల మంది నేత కార్మికులకు ఉపాధిని కల్పిస్తుంది. భారత సాంస్కృతిక వారసత్వంలో చేనేత రంగం పాత్ర కీలకంగా ఉంది. సంఘటిత రంగంలో 12 లక్షల మంది, సంబంధిత రంగంలో 20 లక్షల మంది పని చేస్తున్నారు. ఈ వర్గాల ఉపాధిపై ప్రతికూల ప్రభావం పడనుంది. పన్ను రేట్ల పెంపు అధిక ద్రవ్యోల్బణానికి దారి తీయనుంది. హెచ్చు ధరలతో వినియోగం మందగించడం ద్వారా.. వచ్చే పండగ సీజన్‌లో అమ్మకాలు పడిపోనున్నాయి. ఇది ఆర్థిక వ్యవస్థకూ మంచిది కాదు." అని సిఎంఎఐ పేర్కొంది. "జిఒఎం ప్రతిపాదిత జిఎస్‌టి రేట్ల సవరణలు మొత్తం దుస్తుల పరిశ్రమకు భారీ ముప్పును కలిగించనున్నాయి. ఈ రంగం ఇప్పటికే వినియోగదారుల డిమాండ్ తగ్గుదలను, లాభాల క్షీణత, వర్కింగ్ క్యాపిటల్ సమస్యల వంటి సవాళ్లను ఎదుర్కొంటోంది. రూ.1000 నుంచి రూ.1500 మధ్య కొనుగోళ్లు చేసే బలహీన వర్గాలు, మధ్యతరగతి ప్రజలకు 5 శాతం పన్ను రేటు మద్దతుగా ఉంది. హెచ్చు పన్ను రేట్లు మిగితా వర్గాల వినిమయాన్ని దెబ్బతీయనుంది. ఇది తమ రంగంలోని ఎంఎస్ఎంఇ మూతకు దారి తీయనుంది. ఉపాధి, ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోశిస్తున్న పరిశ్రమను అస్థిరపర్చనుంది. వస్త్ర పరిశ్రమపై ప్రస్తుతం అమలు చేస్తున్న ఒకే పన్ను రేటు 5 శాతం ఆచరణాత్మక పరిష్కారం." అని సిఎంఎఐ ప్రెసిడెంట్ సంతోష్ కటారియా పేర్కొన్నారు. పన్ను పెంపు ప్రతిపాదనలు, తదుపరి నిర్ణయాలపై పరిశ్రమ వర్గాలతో చర్చించాలని సిఎంఎఐ చీఫ్ మెంటర్ రాహుల్ మెహత కోరారు.

నేడు విశాఖలో 'డీప్ టెక్ మీట్-2024'

ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని నోవాటెల్‌లో ఈ నెల 6న జరిగే 'డీప్ టెక్ సమ్మిట్'-2024'కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గురువారం రాత్రి 9.30 గంటలకు ఆయన విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుండి ఎన్‌టిఆర్ భవన్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేశారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నోవాటల్‌లో జరుగనున్న డీప్‌టెక్ సమ్మిట్‌లో పాల్గొంటారు. డీప్ టెక్ సమ్మిట్ లక్ష్యం 2047 నాటికి రాష్ట్రం అన్ని రంగాల్లో గ్రోత్ జాబ్స్ సాధనకు బాటలు వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. తొలుత ఐదేళ్ల రోడ్ మ్యాప్‌ను ఇక్కడ సమ్మిట్‌లో రూపొందించనుంది. వికసిత్ భారత్ -2047 లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణం చేస్తోందని, ఈ సమ్మిట్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసిన బ్రోచర్‌లో వెల్లడించింది. భారతదేశం గ్లోబల్ డీప్ టెక్నాలజీ ఎఐ, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీలకు హబ్‌గా మారుతున్న తరుణంలో ఎపిలో డీప్‌టెక్ రివల్యూషన్ తీసుకొచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఐటి రంగంలో ఇన్నోవేషన్స్, పాలసీ మేకర్‌లు, ఇండస్ట్రీ లీడర్లు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, వైస్ చైర్మన్ అండ్ డైరెక్టర్ ఎస్‌పి టక్కర్ (గ్లోబల్ ఫోరమ్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫార్మేషన్ (జిఎఫ్ఎస్‌టి), డైరెక్టర్ చేకూరి కుటుంబరావు, సిఇఒ సంజయ్ గుప్తా తదితరులు పాల్గొననున్నారు.

ఆధునాతన టెక్నాలజీ దగ్గర చేయడమే లక్ష్యం...

ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలు రోజువారీ పనుల్లో వినియోగించే టెక్నాలజీకి ఆవిష్కరణలను తోడు చేయడమే 'డీప్ టెక్ సమ్మిట్' లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం దిశా నిర్దేశం చేయనుంది. పౌరులకు అవసరమైన సేవలను అందించడానికి, పాలనలో పారదర్శకత వంటి విషయాల్లో గతంలో చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌ను ఆసియాలోనే గొప్ప స్థానంలో ఐటి రంగంలో నిలబెట్టారన్న వీడియో కూడా ఈ సందర్భంగా నోవాటల్‌లో ప్రదర్శించ నున్నారు. హెల్త్ రంగం, ఎంఎస్ఎంఇల గ్రోత్‌కి ఈ సమ్మిట్ దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది.

విద్యుదాఘాతంతో ఇద్దరు వ్యవసాయ కార్మికులు మృతి

ప్రజాశక్తి-కొనకనమిట్ల (ప్రకాశం జిల్లా)

నిమ్మతోటలో విద్యుత్ తీగలు లాగుతుండగా విద్యుదాఘాతానికి గురై ఇద్దరు వ్యవసాయ కార్మికులు మృతిచెందిన ఘటన ప్రకాశం జిల్లా, కొనకనమిట్ల మండలం, చిన్నారికట్ల గ్రామంలో గురువారం జరిగింది. కొనకనమిట్ల మండలంలోని సిద్ధవరం-చినారికట్ల జాతీయ రహదారి సమీపంలో మార్కాపురం ప్రాంతానికి చెందిన మారెళ్ళ చెన్నారెడ్డి అనే రైతుకు చెందిన నిమ్మ తోటలో కరెంటు పని నిమిత్తం పెద్దారవీడు గ్రామానికి చెందిన కాశివలి, నాగూర్ మీరా, మస్తాన్, రంగారావు (30), నాగరాజు (31) వచ్చారు. స్తంభాల మీదుగా కరెంటు తీగలు లాగుతుండుగా... మరో మోటారుకు ఉన్న విద్యుత్ తీగలు తగిలి రంగారావు, నాగారాజు అక్కడికక్కడే మరణించారు.



ట్రూజోన్ సోలార్ ప్రచారకర్తగా మహేష్‌బాబు

- కొత్త బ్రాండ్‌తో భారీ విస్తరణ
- సన్టెక్ ఎనర్జీ సిస్టమ్స్ ఎమ్‌డి భవాని సురేష్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

పునరుత్పాదక ఇంధన రంగంలో 10 ఏళ్లుగా వ్యాపారాలు కలిగిన సన్టెక్ ఎనర్జీ సిస్టమ్స్ ప్రయివేటు లిమిటెడ్ కొత్తగా ట్రూజోన్ సోలార్ బ్రాండ్‌ను ఆవిష్కరించింది. దీనికి హీరో మహేష్‌బాబును బ్రాండ్ అంబాసీడర్‌గా నియమించుకున్నట్లు సన్టెక్ ఎనర్జీ సిస్టమ్స్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ భవాని సురేష్ తెలిపారు. గురువారం ఈ కొత్త బ్రాండ్‌ను హైదరాబాద్‌లో ఐఆర్‌సిఎస్ తెలంగాణ చైర్మన్ అజయ్ మిశ్రాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భవని సురేష్ మాట్లాడుతూ.. ట్రూజోన్ సోలర్ బ్రాండ్‌తో సోలార్ రంగంలో భారీగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం ఏడు రాష్ట్రాల్లో కార్యకలాపాలు కలిగి ఉన్నామన్నారు. మరిన్ని రాష్ట్రాలకు విస్తరించనున్నామని చెప్పారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 36 డీలర్‌షిప్‌లను కలిగి ఉన్నామన్నారు. మూడు నెలల్లో తెలంగాణలో 60కి, ఆంధ్రప్రదేశ్‌లో 100 డీలర్‌షిప్‌లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ రంగంలోని విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవాలని లక్ష్యంగా చేసుకున్నామన్నారు. 2025 నాటికి దేశంలో అగ్రశ్రేణీ సోలార్ కంపెనీల్లో ఒక్కటిగా నిలువాలని నిర్దేశించుకున్నామన్నారు.

ఉత్తమ పని ప్రదేశంగా ఎస్ఇఐఎల్ ఎనర్జీ

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎస్ఇఐఎల్ ఎనర్జీ తమకు అత్యంత ప్రతిష్టాత్మకమైన 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' గుర్తింపు లభించినట్లు తెలిపింది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ అనేది పని ప్రదేశంలో సంస్కృతిని గుర్తించే గ్లోబల్ అథారిటీ. "పని చేయడానికి మా సంస్థను గొప్ప ప్రదేశంగా గుర్తించబడినందుకు మేము సంతోషిస్తున్నాము. ఈ విజయం మా బృందం అంకితభావం, కృషి, పని ప్రదేశం అభిరుచికి ప్రత్యక్ష నిదర్శనం. మా ఉద్యోగులే మాకు గొప్ప ఆస్తి అని నమ్ముతున్నాము." అని ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సిఇఒ రాఘవ్ త్రివేది తెలిపారు.

మతిస్థిమితం లేని బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

మతిస్థిమితం లేని బాలికపై ఇద్దరు దుండగులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన విశాఖ వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖ వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో నివాసముంటున్న వాడమధుల శ్రీను తన పక్క ఇంట్లో నివాసముంటున్న మతిస్థిమితం లేని బాలికపై మరోవ్యక్తితో కలిసి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

'కాకినాడ' పోర్టులో షేర్లను కొట్టేసిన వైసిపి

- ఆనం వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాకినాడ సి పోర్టులో రూ.2689 కోట్ల విలువలైన షేర్లను రూ.494 కోట్లకే వైసిపి దోపిడీ ముఠా కొట్టేసిందని ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ ఆథారిటీ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి ఆరోపించారు. వీరి వెనుక ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేసి విచారించి వాస్తవాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాకినాడ డీప్ షిపోర్టును కైవసం చేసుకోవడానికి శ్రీకాంత్ రెడ్డిని, శరత్ రెడ్డిని జగన్ రంగంలోకి దింపారని తెలిపారు. పికెఎఫ్ శ్రీధరన్ సంతానం, క్రోల్ ఇండియా ఆడిట్ సంస్థలతో అక్రమ ఆడిట్ చేయించి ప్రభుత్వానికి రూ.1000కోట్లను చెల్లించాలని, లేదంటే కేసులు పెడతామని కెవి రావును బెదిరించారని తెలిపారు. చివరకు కెవిరావు గొంతుపై కత్తిపెట్టి 41శాతం వాటాను కొట్టేశారని విమర్శించారు. షేర్లు వైసిపి నాయకులకు బదిలీ అయిన వెంటనే ప్రభుత్వానికి కట్టాలని చెప్పిన రూ.1000 కోట్లు కాస్త రూ.8 కోట్లకు తగ్గిపోయిందని పేర్కొన్నారు. వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి దింపిన సంస్థతోనే ఈ మోసాలకు తెరరతీశారని విమర్శించారు. షేర్ల బదిలీ చట్టవిరుద్ధమని యాక్సిస్ బ్యాంక్ ఇచ్చిన నోటీస్‌ను కూడా లెక్క చేయలేదని తెలిపారు. డిజిపి, సిఐడి దీనిని గుర్తించి జగన్‌ను ఏ1గా నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

వినతులు స్వీకరించిన హోంమంత్రి

హోంమంత్రి వంగలపూడి అనిత టిడిపి కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్‌లతో కలిసి గురువారం గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులపై ఫోన్లలో అధికారులతో మాట్లాడి వెంటనే అర్జీలను పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు.

ఆరేళ్లలో 3.12 కోట్ల గృహాలు అవసరం

- నైట్‌ఫ్రాంక్, క్రెడాయ్ అంచనా

న్యూఢిల్లీ : వచ్చే 2030 నాటికి దేశంలో మరో 3.12 కోట్ల అందుబాటు ధరలోని గృహాలు అవసరమవుతాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్‌ఫ్రాంక్, క్రెడాయ్ సంయుక్తంగా ఓ రిపోర్ట్‌లో తెలిపాయి. ఇవి రూ.67 లక్షల కోట్ల వ్యాపార అవకాశాలను సృష్టించనుందని అంచనా వేశాయి. ఇప్పటికే 1.01 కోట్ల అందుబాటు గృహాలకు కొరత ఉందని పేర్కొన్నాయి. ఇదే క్రమంలో రుణ సంస్థలకు కూడా విశేష అపార అవకాశాలను కల్పిస్తోందని తెలిపింది.

ఇళ్ల కొనుగోలుదార్లలో 77 శాతం మంది వరకు రుణాలపై ఆధారపడొచ్చనే అంచనా. ప్రస్తుత విలువతో పోల్చితే మూడు రెట్లు పెరిగి రూ.45 లక్షల కోట్ల గృహ రుణాల అవకాశాలు రానున్నాయని విశ్లేషించింది.


సంపాదకీయం

నియంతృత్వానికి చెంపపెట్టు!

ప్రజావ్యతిరేకత పెల్లుబికినప్పుడు పాలకులు దాని మూలాలను వీక్షించి, సమస్యలను పరిష్కరించటంపై దృష్టి పెట్టటం ప్రజాస్వామికం. అందుకు భిన్నంగా అసహనం పెంచుకొని, నియంతృత్వ ధోరణులకు కోరలు తొడగటం అప్రజాస్వామికం. దాదాపు రెండేళ్లుగా గొంతెత్తుతున్న ప్రజా నిరసనలను, ప్రతిపక్షాల ఘోషను పట్టించుకోని దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యేల్ అహంకారపూరిత వైఖరి ... ఇప్పుడు అతడి పదవికే ఎసరు పెడుతోంది. మంగళవారం సాయంత్రం అతడు ఆకస్మికంగా తీసుకున్న సైనిక పాలన నిర్ణయంపై దేశ ప్రజలు దిగ్భ్రాంతికి గురై, లక్షలాదిగా వీధుల్లోకి వచ్చారు. తక్షణం ఆ నిరంకుశ ప్రకటనను ఉపసంహరించుకోవాలని గళమెత్తారు. సైనిక దళాల అవరోధాలను అధిగమించి, పార్లమెంటు సభ్యులు రాత్రంతా సభలో చర్చించి, ఆ నియంతృత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటేశారు. ప్రధాన ప్రతిపక్షం డెమోక్రటిక్ పార్టీ, ఇంకో నాలుగు చిన్న పక్షాలతో పాటు అధికారిక పార్టీకి చెందిన 18 మంది సభ్యులూ అధ్యక్షుడి ప్రకటనకు వ్యతిరేకించారు. దీంతో, కేవలం ఆరు గంటల వ్యవధిలోనే దక్షిణ కొరియా సైనిక పాలన కోరల నుంచి బయటపడింది.

1953 నుంచి అమెరికా చెప్పుచేతల్లో నడుస్తున్న దక్షిణ కొరియా ఆర్థిక వ్యవస్థ అంతకంతకూ శుష్కించుకుపోతోంది. పెరిగిన ధరవరలకు తగ్గట్టుగా వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. పరస్పర రక్షణ ఒప్పందం పేరుతో అమెరికా సైనిక దళాలు 70 ఏళ్ల నుంచి దక్షిణ కొరియాలో తిష్ట వేసుక్కూర్చొన్నాయి. దాంతోపాటు అమెరికా ఆర్థిక విధానాలకు అనుగుణంగానే దక్షిణ కొరియా నడుస్తోంది. అమెరికా సైన్యంతోనూ, సహకారంతోనూ తమ దేశం గొప్పగా రాణిస్తున్నట్టు దక్షిణ కొరియా పాలక పక్షాలు గొప్పలు చెప్పుకుంటున్నాయి. దీనికి భిన్నంగా దేశ ఆర్థిక పరిస్థితి దిగజారుతూ వస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు యూన్ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు మరింత క్షీణించాయి. 2022లో 0.8 శాతం ఓట్ల స్వల్ప తేడాతో అధ్యక్షుడిగా ఎన్నికైన యూన్ రెండేళ్లు తిరక్కముందే ప్రజామోదాన్ని కోల్పోయాడు. 2024 ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అతడి పీపుల్స్ పవర్ పార్టీ 300 స్థానాలకు గానూ 114 స్థానాలను మాత్రమే పొందింది. ప్రధాన ప్రతిపక్షం డెమోక్రటిక్ పార్టీ 156 స్థానాలు సాధించింది. అప్పటినుంచి పార్లమెంటులో అధ్యక్షుడి వైఫల్యాలపై నిలదీయడం పెరిగింది. పార్లమెంటు బయటా ఉద్యోగ, కార్మిక ఉద్యమాలు ఊపందుకున్నాయి. వైద్య రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా జూనియర్ డాక్టర్లు గత ఫిబ్రవరిలో సమ్మె బాట పట్టారు. తక్షణం సమ్మె విరమించి విధుల్లో చేరకపోతే– 18 వేల పౌన్ల జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష విధిస్తామంటూ ప్రభుత్వం హుకుం జారీ చేసింది. ప్రజాసమస్యలపై అధ్యక్షుడి స్పందనకు ఇదొక ఉదాహరణ మాత్రమే! అన్ని రంగాల ఆందోళనలూ, అభ్యర్థనల పట్లా ఇదే నిరంకుశ వైఖరి కొనసాగింది. నిత్యావసరాల ధరలు నాలుగైదు రెట్లు పెరిగినా ఎలాంటి ఉపశమన చర్యలూ చేపట్టలేదు. ఉల్లి ధరలు భారీగా పెరిగి, ఏప్రిల్ ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఒక ప్రచారాస్త్రంగా మారింది. అధిక ధరలు, నిరుద్యోగం వంటి సమస్యలతో ప్రజలు అల్లాడుతుంటే– యూన్ అమెరికాను సంతృప్తపరచటానికి 30 వేల కోట్ల డాలర్ల వ్యయంతో కూడిన అంతరిక్ష సైనికీకరణ ప్రాజెక్టును చేపట్టాడు. దీనిపై ప్రజల్లో, కార్మికుల్లో నిరసనలు వ్యక్తమయ్యాయి.

ఈ నేపథ్యంలో పార్లమెంటులో ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. సంక్షేమ రంగానికి భారీగా నిధుల కోత పెట్టిన ఈ పద్దును ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించేది లేదని స్పష్టం చేశాయి. దీంతో, అధ్యక్షుడు నిరాధారమైన నిందలు మోపాడు. ప్రతిపక్షాలు ఉత్తర కొరియాతో జత కట్టి, దేశద్రోహానికి పాల్పడుతున్నాయంటూ ఎదురుదాడికి దిగాడు. సైనిక పాలన విధించి, ప్రజాస్వామ్యం పీక నులమాలని చూశాడు. ప్రజలూ, ప్రజాప్రతినిధులూ వెంటనే స్పందించి, ఆ నియంతృత్వాన్ని తిప్పికొట్టారు. ఎలాంటి నిబంధనలూ పాటించకుండా ఏకపక్షంగా సైనిక పాలన అస్త్రాన్ని ప్రయోగించిన అధ్యక్షుడు యూన్‌పై ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాయి. మరోవైపు యూన్ వెంటనే రాజీనామా చేయాలని, లేకుంటే దేశవ్యాప్త సమ్మె చేపడతామని కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ప్రజాభీష్టాన్ని పట్టించుకోకుండా నియంతృత్వ పోకడలకు పోతే– ఎలాంటి గతి పడుతుందో యూన్ ఒక ఉదాహరణగా నిలవబోతున్నాడు!




మాట్లాడాల్సిన చోట
మౌనంగా వుండడం...
మౌనంగా వుండాల్సిన చోట
మాట్లాడడం...
రెండూ తప్పే.

- డా॥ బి.ఆర్. అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.

నాడు బాబ్రీ - నేడు సంభాల్

సందర్భం



మన రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షుడు బాబాసాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ డిసెంబర్ 6 నే మరణించారు. సరిగ్గా అదే తేదీన రాజ్యాంగంలోని లౌకిక విలువలను మంటగలుపుతూ బిజెపి అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చేసింది. మసీదు కూల్చివేతకు ముందు పి.వి ప్రభుత్వం జరిపిన జాతీయ సమగ్రతా మండలి (నేషనల్ ఇంటిగ్రేషన్ కౌన్సిల్-ఎన్ఐసి) సమావేశంలో బిజెపి నాయకులు అటల్ బిహారి వాజ్‌పేయి, లాల్‌కృష్ణ అద్వానీ, తాము బాబ్రీ మసీదును కూల్చబోమని దేశానికి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను కూడా వమ్ముచేశారు. బయటికి కన్పించే ఏనుగు దంతాలు వేరు, ఆహారం నమిలే దంతాలు వేరు (హాథీ కా దాంత్ దిఖానే కా అలగ్, ఖానేకా అలగ్) అన్నట్లు బిజెపికి కడుపులో ఒక ఉద్దేశం ఉంటుంది. బయటికి మరొకటి చెప్తుంది. బిజెపికి దాని మూల విరాట్ ఆర్ఎస్ఎస్‌కు అది వెన్నతో పెట్టిన విద్య. చిత్తశుద్ధిగల రాజకీయ పరిశీలకులెవరూ బిజెపి మాటలను నమ్మలేరు. ఎన్ఐసి సమావేశాన్ని ఏర్పాటు చేసిన పి.వి నరసింహారావు చిత్తశుద్ధి కూడా ఏ పాటిదో అనంతర పరిణామాలు తేటతెల్లం చేశాయి.

నేడు బ్లాక్ ఫ్రైడే. 1992 డిసెంబర్ 6 బిజెపి ప్రేరేపిత కరసేవకులు బాబ్రీ మసీదును కూల్చివేసిన రోజు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అదొక చీకటిరోజు. అందుకే దాన్ని బ్లాక్ ఫ్రైడే అన్నారు. ఆ దురంతాన్ని ప్రజల దృష్టి నుండి తొలగించడానికా అన్నట్టు ఇప్పుడు అనేక బ్లాక్ ఫ్రైడేలు పుట్టుకొచ్చాయి. తాను రాజకీయంగా ఎదగడానికి నాడు బాబ్రీ మసీదును కేంద్రంగా చేసుకొని విద్వేష ప్రచారం చేసింది. మసీదును కూల్చింది. ఆ హింసాకాండను సోపానంగా చేసుకొని బిజెపి కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికారం దక్కించుకొంది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో అధికార బిజెపికి ఎదురుగాలి వీచింది. దాంతో రానున్న శాసన సభ ఎన్నికల్లో గెలవడానికి ఆ పార్టీ మళ్లీ మత విద్వేష పూరిత వాతావరణం సృష్టించడానికి పూనుకొంది. ఆ ప్రయత్నంలో భాగంగా సంభాల్ పట్టణంలోని మసీదుపై వివాదం లేవనెత్తింది. మొఘల్ పాలనలో 16వ శతాబ్దిలో సంభాల్ పట్టణంలోని కల్కి భగవాన్ గుడిని తొలగించి మసీదును కట్టారంటూ కొందరు స్థానిక కోర్టులో పిటిషన్ వేశారు.

ఆ మసీదును సర్వే చేయాల్సిందిగా కోర్టు ఒక అడ్వకేట్‌ను కమిషనర్‌గా నియమించింది. ఆ అడ్వకేట్ నవంబర్ 19న మొదటి సారి సర్వే కోసం అక్కడికి వెళ్లారు. రెండవసారి నవంబర్ 24 అక్కడికి వెళ్లినప్పుడు ముస్లింలు అభ్యంతరం చెప్పారు. ఆ సందర్భంగా జరిగిన గొడవ పోలీసుల కాల్పుల వరకు వెళ్లింది. కాల్పుల్లో నల్గురు చనిపోయారు. 19 మంది గాయపడ్డారు. ఆ ఘటనపై సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది.



ఎస్. వినయకుమార్

అవతలి పక్షం వాదన వినకుండా కింది కోర్టు ఏకపక్ష నిర్ణయం చేసినట్లు సుప్రీం కోర్టు గమనించింది. మసీదు కమిటీ తాను చెప్పదల్చుకొన్న విషయాలను అలహాబాదు హైకోర్టు ముందు చెప్పుకోవాలని, ఆలోగా ఎలాంటి తదుపరి చర్యకు పూనుకోరాదని ప్రధాన న్యాయమూర్తితో కూడిన ఇద్దరు న్యాయమూర్తుల బెంచి ట్రయల్ కోర్టును ఆదేశించింది. కేసును తదుపరి విచారణ కోసం 1925 జనవరి 6కు వాయిదా వేసింది.

సంభాల్ లోని బాధితులను కలుసుకోవడానికి లోక్‌సభ లోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, లోక్‌సభ సభ్యురాలు ప్రియాంక గాంధీ ఢిల్లీ నుండి బయల్దేరగా వారిని యుపి పోలీసులు మధ్యలోనే ఆపేశారు. శాంతి భద్రతలకు భంగం వాటిల్లుతుంది కనుక వారిని అనుమతించడం లేదని చెప్పారు. కొన్నేళ్ల క్రితం హత్రాస్‌లో దళిత యువతిపై జరిగిన హత్యాచారం సందర్భంగా కూడా యుపి పోలీసులు అదే పని చేశారు. ఉనా ఉదంతం కూడా అలాంటిదే. యోగి ప్రభుత్వానికి ఇదో అలవాటుగా మారింది.

మన రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షుడు బాబాసాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ డిసెంబర్ 6 నే మరణించారు. సరిగ్గా అదే తేదీన రాజ్యాంగంలోని లౌకిక విలువలను మంటగలుపుతూ బిజెపి అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చేసింది. మసీదు కూల్చివేతకు ముందు పి.వి ప్రభుత్వం జరిపిన జాతీయ సమగ్రతా మండలి (నేషనల్ ఇంటిగ్రేషన్ కౌన్సిల్–ఎన్ఐసి) సమావేశంలో బిజెపి నాయకులు అటల్ బిహారి వాజ్‌పేయి, లాల్‌కృష్ణ అద్వానీ, తాము బాబ్రీ మసీదును కూల్చబోమని దేశానికి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను కూడా వమ్ముచేశారు. బయటికి కన్పించే ఏనుగు దంతాలు వేరు, ఆహారం నమిలే దంతాలు వేరు (హాథీ కా దాంత్ దిఖానే కా అలగ్, ఖానేకా అలగ్) అన్నట్లు బిజెపికి కడుపులో ఒక ఉద్దేశం ఉంటుంది. బయటికి మరొకటి చెప్తుంది. బిజెపికి దాని మూల విరాట్ ఆర్ఎస్ఎస్‌కు అది వెన్నతో పెట్టిన విద్య. చిత్తశుద్ధిగల రాజకీయ పరిశీలకులెవరూ బిజెపి మాటలను నమ్మలేరు. ఎన్ఐసి సమావేశాన్ని ఏర్పాటు చేసిన పివి నరసింహారావు చిత్తశుద్ధి కూడా ఏ పాటిదో అనంతర పరిణామాలు తేటతెల్లం చేశాయి. పి.వి కాంగ్రెస్ నాయకుడిగా ప్రధాని పీఠాన్ని అధిష్టించినా ఆయన మత రాజకీయాలకు ఊతమిచ్చారు. పివి దగ్గర కార్యదర్శిగా పనిచేసిన ఐఎఎస్ అధికారి పివిఆర్ కె.ప్రసాద్ తన ఆత్మకథలో ఆ నాటి సంగతులను నెమరేస్తూ పి.వి ఆనాడు బాబ్రీ స్థలంలో రాముని గుడి రావాలి. ఆ కీర్తి కాంగ్రెస్‌కే దక్కాలి అన్న భావనతో ఉండేవారని చెప్పారు. పి.వి అపర చాణక్యం మత శక్తులకే ఊతమిచ్చింది. బాబ్రీ మసీదు కూల్చివేత తదనంతరం దేశంలో ప్రజ్వరిల్లిన హింసాకాండను ప్రాణ, ఆస్తి నష్టాలను కూడా పివి నివారించలేక పోయారు. ఆ సమయంలో దేశమంతటా రెచ్చగొట్టిన మత విద్వేష వాతావరణం వల్ల బిజెపి బలపడింది. కాంగ్రెస్ రెంటికి చెడ్డ రేవడైంది. లౌకిక విలువలపై కాంగ్రెస్‌లో ఒకనాటి చిత్తశుద్ధి లోపమే దానికి ప్రాణాంతకమైంది.

ఈ ఏడాది నవంబర్ 26న భారత రాజ్యాంగ 75వ దినోత్సవం సందర్భంగా బిజెపి నాయకులు చేసిన ప్రసంగాలకు వారి అంతరంగానికి సంబంధమే లేదు. భారత రాజ్యాంగాన్ని, దాని విలువలను వేనోళ్ల పొగిడారు. రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షుడిగా బాబాసాహెబ్ బి.ఆర్ అంబేద్కర్ ప్రవేశ పెట్టిన రాజ్యాంగాన్ని ప్రజల ఎన్నుకొన్న భారత రాజ్యాంగ సభ 1949 నవంబర్ 26 న ఆమోదించింది. కాగా మూడు రోజుల్లోనే అంటే నవంబర్ 30న తన అధికార పత్రిక ఆర్గనైజర్ ఆర్ఎస్ఎస్‌లో రాజ్యాంగం పట్ల తీవ్ర అభ్యంతరం చెప్తూ 'మనుస్మృతి' మన రాజ్యాంగం కావాలని నిస్సిగ్గుగా చెప్పింది. ఆ నాటికి రెండేళ్ల ముందే మహద్ చెరువు సత్యాగ్రహం సందర్భంగా అంబేద్కర్ మనుస్మృతిని బహిరంగంగా తగలబెట్టారు. వర్ణాశ్రమ ధర్మాన్ని, స్త్రీల అణిచివేతను సమర్థించే ధర్మ గ్రంథం మనుస్మృతి. అది చట్టం కూడా అందుకే దాన్ని స్మృతి అన్నారు. అశాస్త్రీయ నమ్మకాలకు అది ఆలవాలం. శాస్త్ర విజ్ఞానం వడివడిగా అడుగు ముందుకేస్తున్న దశలోను ఆర్ఎస్ఎస్ మనుస్మృతే మన రాజ్యాంగం కావాలంది. ఒక నేరానికి ఒకే శిక్షను రాజ్యాంగం నిర్ధారించింది. నేరం ఒకటే అయినా వర్ణం ప్రకారం శిక్ష వేయాలని చెప్తుంది మనుస్మృతి. నేరం ఒకటే అయినా బ్రాహ్మణుడికి తక్కువ శిక్ష వేయాలి. శూద్రునికి కఠినమైన శిక్ష వేయమంటుంది. మనుస్మృతి స్త్రీకి స్వాతంత్ర్యం ఉండరాదనీ చాటుతుంది. అలాంటి దుర్మార్గపు మనుస్మృతికి వ్యతిరేకంగా బిజెపి ఆర్ఎస్ఎస్‌లు ఏనాడూ పల్లెత్తు మాట కూడా అనలేదు.

మన రాజ్యాంగం ప్రతిపాదించిన విలువల్లో లౌకికతత్వం, సమానత్వం అతి ముఖ్యమైనవి. వీటి పట్ల బిజెపికి తీవ్ర అభ్యంతరాలున్నాయి. రాజ్యాంగ ప్రవేశికలో సమానత్వం, లౌకికతత్వం అన్న మాటలను ప్రధాని ఇందిరా గాంధీ తన రాజకీయ అవసరాల కోసం చేర్చారు కనుక ఆ మాటలను తొలగించాలని బిజెపి నాయకులు మొదటి నుండి డిమాండ్ చేస్తూనే ఉన్నారు. కొద్ది రోజుల క్రితం భారత సుప్రీం కోర్టు ఆ వివాదంపై బిజెపికి దిమ్మతిరిగే సమాధానమిచ్చింది. రాజ్యాంగ ప్రవేశికలోని "లౌకిక" అన్న పదానికి అర్థం అన్ని మతాలను సమానంగా గౌరవించడం కనుక ఆ పదాన్ని ప్రవేశిక నుండి తొలగించనవసరం లేదని కరాఖండిగా చెప్పేసింది. అలాగే సోషలిస్టు అన్న పదాన్ని కూడా తొలగించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. సోషలిస్టు అన్న పదానికి అర్థం సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లోని అసమానతలను తొలగించడం కనుక ఆ పదాన్ని కూడా ప్రవేశిక నుండి తొలగించవలసిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించలేమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి సంజయ్ కుమార్‌తో కూడిన బెంచ్ తేల్చిచెప్పింది. ఈ రెండు పదాలను తొలగించాలంటూ న్యాయస్థానం ఆదేశించాలని పట్టుబట్టిన వారిలో బిజెపి ప్రముఖ నాయకుడు సుబ్రమణ్య స్వామి కూడా ఉన్నారు. 'సెక్యులర్' 'సోషలిస్టు' అన్న పదాలను రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన 44 ఏళ్ల తర్వాత వాటిని తొలగించాలంటూ కోర్టుకు రావడంలో పిటిషనర్ల ఉద్దేశాలు ఏమిటో అర్థమవుతున్నాయని కూడా బెంచ్ ఘాటుగా వ్యాఖ్యానించింది.

అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం 1998లో రాజ్యాంగాన్ని సమీక్షించేందుకు వెంకట చెల్లయ్య కమిషన్‌ను వేసింది. తీవ్ర వ్యతిరేకత రాగా వాజ్‌పేయి తన ప్రయత్నం నుండి వెనకంజ వేయక తప్పలేదు. ఆర్ఎస్ఎస్ ప్రకారం భారత రాజ్యాంగం పాశ్చాత్య విలువలపై ఆధారపడి రూపొందింది. బ్రిటిష్ ప్రభుత్వం 1935లో చేసిన చట్టంపై ఆధారపడి మన రాజ్యాంగాన్ని రాశారని, అందులో భారతీయ విలువలు లేవని ఆర్ఎస్ఎస్ చెప్తుంది. మూడేళ్ల సుదీర్ఘ చర్చల అనంతరమే రాజ్యాంగ రచనా సంఘం రాజ్యాంగాన్ని ఆమోదించిన విషయాన్ని ఆర్ఎస్ఎస్, బిజెపిలు గుర్తించవు. రాజ్యాంగ సభలోని సభ్యులంతా ప్రజల నుండి ఎన్నికై వచ్చిన వారే. అందరూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న వారే. ఆ విలువలే రాజ్యాంగంలో ప్రతిబింబించాయి. ఆ విలువల్లో ప్రధానమైంది లౌకికవాదం.

సావర్కర్ సిద్ధాంతాన్ని అనుసరించి భారతదేశం హిందువులది మాత్రమే. ఇక్కడ హైందవేతరులు ఉండాల్సి వస్తే వారు రెండవ తరగతి పౌరులుగా జీవించాలి. లేదా భారతదేశం వదలి వెళ్లాలి. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు కూడా అదే వాదనను తలకెత్తున్నాయి. ఎన్ఆర్‌సి, సిఎఎ మొదలైన చట్టాలు, అస్సాంలో నడిపిన శిబిరాలు కూడా రెండు జాతుల సిద్ధాంతం యొక్క పర్యవసానాలే.

మెజారిటీ ప్రజల శ్రమను దోచుకొని వారిపై పెత్తనం చేయడానికి మనుస్మృతి పనికొచ్చింది. ఇస్లాం, క్రైస్తవం మనుస్మృతికి లోబడి ఉండవు కనుక అవి విదేశీ మతాలన్న సాకుతో ఆర్ఎస్ఎస్, బిజెపిలు ఆ మతాల్లోని ప్రజలందరి పట్ల శత్రు భావంతో వ్యవహరిస్తాయి. బౌద్ధం మన దేశంలో పుట్టిందే అయినా దాన్ని కూడా మనువాదులు వ్యతిరేకిస్తారు. అందుకు కారణం మనుస్మృతి ప్రవచించే వర్ణ వ్యవస్థను, బౌద్ధం నిరాకరిస్తుంది కనుక.

మనుస్మృతి మహిళలను పురుషులతో సమానంగా చూడదు. మహిళలపై అనేక ఆంక్షలు విధించింది. భారత రాజ్యాంగం దానికి భిన్నం. అది స్త్రీ పురుషులకు సమాన హక్కులు కల్పిస్తోంది. స్త్రీలు ఇంటికి పరిమితం కావాలని చెప్పదు. వారికి ఆస్తి హక్కుపై అవకాశం కల్పించింది. పౌరులందరికీ ఒకే విలువగల ఓటు హక్కును, మత స్వేచ్ఛను కల్పించింది. బారత పౌరుడు ఏ మతాన్నయినా ఆచరించవచ్చు. ఏ మతాన్ని ఆచరించకుండా కూడా భారత చట్టాలకు లోబడి స్వేచ్ఛగా బతకొచ్చు. భగత్‌సింగ్ చెప్పిన విశ్వమానవ సౌభ్రాతృత్వ విలువలు బిజెపికి గిట్టవు. దానిది సంకుచిత దృష్టి. ఆ దృష్టితోనే అది బాబ్రీ మసీదును వివాదగ్రస్తం చేసి 1992 డిసెంబర్ 6న కూల్చేసింది. ఇప్పుడు సంభాల్ మసీదును వివాదాస్పదం చేసి రక్తం పారించింది. రేపు జ్ఞానవాపి మసీదు వివాదాన్ని మందుకు తోస్తుంది. ప్రజల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టి దేశాన్ని ఆ కలుషిత వాతావరణంలో అధికార పీఠాలను అధిష్టించడమే దాని లక్ష్యం. ఈ స్థితిలో మత విద్వేషాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతుల ను చేయడానికి పూనుకోవడమే మనం బాబా సాహెబ్‌కు అర్పించగల అసలు నివాళి.

/ వ్యాసకర్త 'ప్రజాశక్తి' పూర్వ సంపాదకులు,
సెల్ : 9989716311/

కవిత్వం

మూలవాసులు మేల్కొంటున్నారు!

నువ్వు దేక్కుంటా దేక్కుంటా వచ్చి
మా భరతమాత కాళ్ళు
విరవటానికి రెడీ అయిపోయావ్
నువ్వు తడుముకుంటా తడుముకుంటా వచ్చి
మా కన్నతల్లి కళ్ళు
పొడవటానికి సిద్ధం అయిపోయావ్
మా కడుపులు కొట్టి
మా ఏడుపులు వినిపించకుండా
ఆమె చెవులు ఇప్పటికే కుట్టేశావ్
మమ్మల్ని ఓదార్చటానిక్కూడా లేకుండా
ఆమె నోరు కూడా కట్టేశావ్.

పదేళ్ళ క్రితం మన్నుదిన్న పాములా
ఉన్నోడివి
కన్నంలో దాక్కున్న ఎలుకలా
కిక్కురు మెక్కురు మనకుండా గడిపినోడివి
ఇంతలోనే ఈ కొద్దికాలంలోనే
నీ సావాసగాడి అండ చూసుకొని
కొండల్ని మింగేసే అనకొండలా
బలిసిపోయావ్!

ఎన్నెన్ని కళలు...
ఎన్నెన్ని లయలు... హొయలు....
మా కన్నతల్లికి...!
పచ్చని పావడా లాంటి అడవులు!
పాల పొదుగుల్లాంటి నదులు!
పాపిట సేరు లాంటి సముద్రాలు!
కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు
ఎటు చూసినా విశాలమైన రైలు మార్గాలు
విలాసవంతమైన విమానాశ్రయాలు
వన్నె చిన్నెల ఓడరేవులు!

అన్నన్ని సిరులు గల ఆ తల్లి
సహజ సంపదనంతా అప్పనంగా
నీ బొక్కసంలో కుక్కేసుకొని
ఆఖరికి మా ఆకలి కడుపుకు
అమ్మ కుడిపే చనుబాలు కూడా
మాకు దక్కకుండా
పిండుకు తాగుతున్నావ్!
మా బతుకులు దినదిన గండంగా మార్చి,
చెండుకు తింటున్నావ్!

మీ నేస్తుడి ఆటలు మేం సాగనివ్వక గానీ
లేకుంటే ఆయన దన్నుతో ఈసరికే
మా అమ్మను నడి బజార్లో నిలబెట్టి
వేలం వేసేద్దువు కదా!

అయినా ఇంక తాత్సారం
చెయ్యటానికి లేదు
నీ ఆటలూ నీ జట్టుగాడి ఆటలూ
కట్టించే రోజులు దగ్గరపడ్డాయ్!
ఈ దేశ మూలవాసులు మేల్కొంటున్నారు!
ఈ తల్లి బిడ్డలు
చైతన్యవంతులవుతున్నారు!
నువ్వింక రోజులు లెక్క పెట్టుకోవాల్సిందే!!

- పతివాడ నాస్తిక్,
సెల్ : 9441724167

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరే...

విషజ్వరాలు, ఆహార కల్తీ, పాము కాటు, కుక్క కాటు, ఇతర ఆరోగ్య సమస్యలతో కొన్నేళ్లుగా గిరిజన విద్యార్థులు మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలైన అల్లూరి సీతారామరాజు పాడేరు, పార్వతీపురం మన్యంలో ఎక్కువ. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2023–24 విద్యా సంవత్సరంలో ఈ రెండు జిల్లాల్లో 42 మంది మరణించారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలోని ఆశ్రమ పాఠశాలలో ఓ విద్యార్థి ఆహారం వికటించి మరణించిన విషయం తెలిసిందే. అంతకముందు అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలోని ఓ అనాథాశ్రమంలో ఫుడ్ పాయిజన్ అయి కొందరు గిరిజన విద్యార్థులు మృతి చెందడం అందరినీ కలచివేసింది. రాష్ట్రంలో 545 ఆశ్రమ పాఠశాలలు ఉంటే దానిలో 535 పాఠశాలలో విద్యార్థులకు అత్యవసర వైద్యం అందించేందుకు హెల్త్ వర్కర్లు లేరు. అత్యవసరమైతే ఆసుపత్రికి తీసుకెళ్లే దిక్కు లేక వసతి గృహాల్లోనే ప్రాణాలు వదిలేసే పరిస్థితి. మరోపక్క హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు, వంటకు అవసరమైన హాస్టల్ సిబ్బంది, కమాటీ పోస్టులు 1100 ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా ఆ పోస్టులు భర్తీకి నోచుకోలేదు. హాస్టల్ విద్యార్థులు చనిపోతున్నా వారి తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నా పాలకులకు పట్టడం లేదు. ఎప్పుడైనా విద్యార్థి కుటుంబాల నుంచి, విద్యార్థి సంఘాల నుంచి ఒత్తిడి వస్తే స్పందిస్తున్నారు. ఎంతో కొంత పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. విద్యార్థుల మరణాలపై అధ్యయనం చేసి, సమస్యను పరిష్కరించే ందుకు కృషి చేయాలి. సంక్షేమ హాస్టళ్లలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.

- హర్ష

అభిప్రాయం

ఎపిజిబి తరలింపు - కొన్ని అంశాలు

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి)తో మరో మూడు గ్రామీణ బ్యాంకుల్ని విలీనం చేసి, విలీనానంతర బ్యాంకును అమరావతికి తరలిస్తారన్న వార్తలు వస్తున్నాయి. ప్రతి రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని, విలీనానంతర రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలన్న ఆలోచన ఔచిత్యాన్ని పరిశీలించడం అవసరం. దేశంలోని గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి వాటి సంఖ్యను 43 నుంచి 28కి కుదించాలని, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు గ్రామీణ బ్యాంకుల్ని విలీనం చేసి ఒకే రాష్ట్రస్థాయి బ్యాంకును ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అలస్యమైనప్పటికీ, ఆ నిర్ణయాన్ని మనం మొదటగా స్వాగతించాలి. ఎందుకంటే, దీనివల్ల ఈ బ్యాంకుల ఓవర్ హెడ్ ఖర్చులు తగ్గుతాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్ట స్థాయిలో వినియోగించుకోవడం సాధ్యమవుతుంది. మూలధనాన్ని విస్తృతపరుచుకోవడం వీలవుతుంది. కార్యకలాపాల పరిధి పెరుగుతుంది. రూరల్ బ్యాంకింగ్‌ను కూడా ఆధునిక అవసరాల వెలుగులో పునర్నిర్వచించుకోవడం సులభం అవుతుంది.

దేశ వ్యాప్తంగా గ్రామీణ బ్యాంకుల సిబ్బంది తమ బ్యాంకులను విలీనం చేసి రాష్ట్రానికి ఒక్క గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేయాలని దీర్ఘకాలంగా కోరుతూ వస్తున్నారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తాజాగా 'వన్ స్టేట్ – వన్ ఆర్.ఆర్.బి' విధానానికి అనుగుణంగా దీనికి అంగీకరించింది. ఇందులో భాగంగా నూతన ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు గ్రామీణ బ్యాంకులు కలిసి రాష్ట్ర స్థాయిలో ఒకే బ్యాంకుగా మారబోతున్నాయి. ఇప్పటివరకు ఈ నాలుగు బ్యాంకుల్లో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కడపలో, సప్తగిరి గ్రామీణ బ్యాంకు చిత్తూరులో, చైతన్య గ్రామీణ బ్యాంకు గుంటూరులో, ఉత్తరాంధ్రలోని గ్రామీణ బ్యాంకులు వరంగల్ ప్రధాన కార్యాలయాలుగా పనిచేస్తున్నాయి.

ఇప్పుడు ఎ.పి లోని 26 జిల్లాల్లోని గ్రామీణ బ్యాంకుల విలీనానంతర రాష్ట్రస్థాయి బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉండాలన్నది ప్రశ్న. ఈ విషయంలో సంప్రదాయాలు, మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నా ఈ ప్రధాన కార్యాలయాన్ని కడపలో కాకుండా అమరావతికి తరలించాలన్నది ప్రభుత్వ ఆలోచన.

సంప్రదాయం విషయానికొస్తే, గత నమూనా ఒకటి ఉంది. గతంలో అనంత గ్రామీణ బ్యాంకు, పినాకిని గ్రామీణ బ్యాంకు, రాయలసీమ గ్రామీణ బ్యాంకుతో 2006లో విలీనమయ్యాయి.

అప్పటి కేంద్ర ప్రభుత్వం ఈ బ్యాంకుల సంస్థాగత కార్యకలాపాల సామర్థ్యం పెంచాలని, గ్రామీణ ప్రాంతాలకు రుణ పరపతి పెంచాలనీ ఈ విలీనం చేసింది. విలీనానంతర బ్యాంకుగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేసి, రాయలసీమ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలో ఉంది కాబట్టి దాని ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే ఏర్పాటు చేసింది.

మార్గదర్శకాల ప్రాతిపదికన చూస్తే – తాజాగా, 2024 నవంబర్ 4న కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఆర్.ఆర్.బి సెక్షన్ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు –గ్రామీణ బ్యాంకులు ఏదైనా ఒక పెద్ద గ్రామీణ బ్యాంకులో విలీనమైనప్పుడు, ఆ పెద్ద గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎక్కడుందో, అక్కడే విలీనం తర్వాత ఏర్పడే రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయాలి. ఇతర ఆప్షన్ల కంటే తొలి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అంశం ఇది. సాంప్రదాయమే కాకుండా,



ఇలా చూసినా, ఎ.పి రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలో ఏర్పాటు కావాలి.

ఎపిజిబి నేల విడిచి సాము చేయకుండా ఇక్కడి ప్రజల్లో మమేకమై పోయింది. వారి అవసరాలను గుర్తించింది. ఆ మేరకు తన కార్యకలాపాలని మలుచుకొని ఒక ఆదర్శ ప్రాయమైన రూరల్ బ్యాంకింగ్‌కి నమూనాగా తనను తాను ఆవిష్కరించుకున్నది.

రాష్ట్రంలో ఎపిజిబిలో విలీనం అవుతున్న ఇతర మూడు గ్రామీణ బ్యాంకుల మొత్తం డిపాజిట్లు, అడ్వాన్సుల కంటే ఎపిజిబి డిపాజిట్లు అడ్వాన్సులు, ఎక్కువైనప్పుడు, అది ప్రస్తుతం ఉన్న కడపలో విలీనానంతర రాష్ట్ర స్థాయి ప్రధాన కార్యాలయం కొనసాగించడం కంటే మెరుగైన ఆర్థిక విజ్ఞత ఏమున్నది?

ఇక రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంకుల వ్యాపార ఫలితాల విషయానికొస్తే, ఎపిజిబి తర్వాతే ఏదైనా ! రాష్ట్రంలో గ్రామీణ బ్యాంకుల మొత్తం వ్యాపారంలో 43 శాతం వ్యాపారం ఎపిజిబిదే. నష్టాలు తట్టుకునే సామర్థ్యం (సిఎఆర్), మూలధన అవసరాల్ని తీర్చే శక్తి ఎపిజిబికే ఎక్కువ (25.65 శాతం). కరెంట్ అకౌంట్, సేవింగ్ అకౌంట్లలో కస్టమర్లను బాగా ఆకర్షించే సిఎఎస్ఎ నిష్పత్తిలో ఎపిజిబి దే అగ్రస్థానం. అన్ని బ్యాంకుల మొత్తం కస్టమర్ల కంటే ఎక్కువగా ఎపిజిబి కే 86.75 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు. బ్రాంచ్‌ల సంఖ్య ఏ ఇతర గ్రామీణ బ్యాంకుతో పోల్చుకున్నా కూడా రెట్టింపే. మిగతా అన్ని గ్రామీణ బ్యాంకుల కంటే కూడా ఎక్కువ సంఖ్యలో సిబ్బంది ఉన్నది కూడా ఎపిజిబి లోనే.

ఉమ్మడి రాష్ట్రం విడిపోయి పదేళ్లు అవుతున్నది. ఇప్పటికీ ఆనాటి విభేదాలు అప్పుడప్పుడు పొడచూపుతున్నాయి. విభజన హామీల అమలు విషయంలో న్యాయం జరగలేదని, అభివృద్ధి క్రమంలో తమను భాగస్వామ్యం చేయడం లేదని వెనుకబడిన జిల్లాలు కన్నీళ్లు పెడుతున్నాయి. వచ్చేవి రాకపోగా, విశాల రాయలసీమ నడిబొడ్డున ఉన్న ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కూడా అమరావతికి తరలించాలన్న కృతనిశ్చయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉందని వస్తున్న సంకేతాలు...అనుబంధాలకు అతీతంగా ఇక్కడి ప్రజల మనోభావాల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. అందుకే ఇప్పటికే వామపక్ష సంఘాలు ఆందోళన బాట పట్టాయి. ముఖ్యమంత్రి దృష్టికి, ప్రతిపక్ష నేత దృష్టికి కూడా ఈ అంశం వెళ్ళినప్పుడు దీనిని విశాల దృక్పథంతో చూడాలన్న అభిప్రాయం వారు వ్యక్తం చేశారని వార్తలు వస్తున్నాయి. ఈ విషయమై ఈ ప్రాంతపు ఆశల్ని సజీవంగా ఉంచుతున్నాయివి. ఏది ఏమైనా, ఎపిజిబి విలీనమైన తర్వాత కూడా దాని ప్రధాన కార్యాలయం ఎక్కడ వుండాలన్నది స్థానిక ప్రజలు, బ్యాంకు ఉద్యోగుల మనోభీష్టాన్ని దృష్టిలో వుంచుకొని రాష్ట్ర ప్రభుత్వం, బ్యాంకు యాజమాన్యం నిర్ణయం తీసుకోవాలి!

- ఎ.రఘునాథ రెడ్డి,
సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ, కడప.

ప్రశ్నించే గొంతుకలపై ఎదురు దాడులు

బిజెపి రాజకీయ సందేశాలకు వేదికలుగా చట్టసభలు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ మాట... అధికారం రాగానే మరో మాట. కమల నాథులకు నాలుక మడతపడుతోంది. పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయడం ప్రజాస్వామ్య రూపమేనని ఒకప్పుడు వాదించిన బిజెపి నేతలు ఇప్పుడు అదే పని చేస్తున్న ప్రతిపక్షంపై నోరు పారేసుకుంటున్నారు. ప్రతిపక్షాల నిరసనను పార్లమెంట్ 'హైజాకింగ్'గా ప్రధాని అభివర్ణించారు. అప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన నిరసన ఇప్పుడు పార్లమెంటును హైజాక్ చేయడం ఎలా అవుతుందో కాషాయ నేతలే చెప్పాలి.



న్యూఢిల్లీ : తన సొంత రాజకీయ సందేశాలు ఇవ్వడానికి బిజెపి నాయకులు పార్లమెంటును వేదికగా ఉపయోగించుకుంటున్నారు. బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంపై ప్రతిపక్ష బిజెపి సభ్యులు పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయడాన్ని 2012 సెప్టెంబరులో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తప్పుపట్టారు. దీనిపై బిజెపి సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ స్పందిస్తూ పార్లమెంట్ సమావేశాలను సాగనీయకపోవడం కూడా ప్రజాస్వామ్య రూపమేనని బదులిచ్చారు. యుపిఎ-2 ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు వచ్చాయని, అందుకే సభలో ఆందోళన చేస్తున్నామని ఆమె తెలిపారు.

ఇది జరిగి ఓ సంవత్సరం గడిచింది. పార్లమెంటరీ నిబంధనలను ఉల్లంఘించారంటూ 20 మంది బిజెపి, తెలుగుదేశం సభ్యులను హౌస్ బులెటిన్‌లో ప్రస్తావించినందుకు బిజెపి ఎగువ సభలో నిరసన తెలిపి, ఆ తర్వాత వాకౌట్ చేసింది. దీనిని సీనియర్ నేత అరుణ్ జైట్లీ సమర్ధించుకున్నారు. ఆందోళన చేసిన అధికార పక్ష సభ్యులను వదిలేసి కేవలం ప్రతిపక్ష సభ్యులను మాత్రమే శిక్షించారని ఆయన మండిపడ్డారు.

కుడి ఎడమైతే...

ఈ ఘటనలు జరిగి దశాబ్ద కాలం అయింది. ఇప్పుడు అటు వారు ఇటు, ఇటు వారు అటు అయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆనాటి పార్టీ నేతల మాటలు మరచిపోయారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్షాల నిరసన 'హైజాకింగ్'కు ఓ రూపమని వ్యాఖ్యానించారు. 'ప్రజలు తిరస్కరించిన కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం విచ్ఛిన్నకర ఎత్తుగడల ద్వారా పార్లమెంటుపై నియంత్రణకు నిరంతరం ప్రయత్నిస్తున్నారు' అని విమర్శించారు. అప్పటి నుండి ఆయన మద్దతుదారులు, ఇతర బిజెపి నేతలు ఆయన మాటలను తరచూ వల్లె వేస్తూ పార్లమెంట్ కార్యకలాపాలను స్తంభింపజేయడానికి ఏ రూపంలో ప్రయత్నించినప్పటికీ అది దేశాభివృద్ధిని అడ్డుకోవడానికి జరిపే కుట్రగానే భావించాలంటూ వితండవాదం మొదలు పెట్టారు.

ప్రతిపక్షాలకు దారేది?

ఇక కార్పొరేట్ మీడియా కూడా ప్రధాని వ్యాఖ్యలను వెనకేసుకొచ్చింది. కొన్ని అంశాలపై చర్చ జరగాలన్న ప్రతిపక్ష సభ్యుల డిమాండ్ నుండి ప్రజల దృష్టిని మరలించేందుకు అది ప్రయత్నిస్తోంది కూడా. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యుల మధ్య నెలకొన్న వివాదానికి అదానీ కేంద్ర బిందువయ్యారు. ఆయనపై మోసం, ముడుపుల ఆరోపణలు మోపుతూ న్యూయార్క్ కోర్టులో ఛార్జిషీటు దాఖలైంది. కేంద్ర ప్రభుత్వానికి, అదానీ గ్రూపునకు మధ్య ఉన్న సంబంధాలపై కాంగ్రెస్‌తో పాటు అనేక ఇతర ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై చట్టసభలో చర్చించాలని ఆ పార్టీలు కోరుతుంటే ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఘర్షణలతో అట్టుడికిపోతున్న మణిపూర్‌పై కూడా చర్చించాల్సి ఉన్నదని ప్రతిపక్షాలు అడుగుతుంటే అందుకు కూడా ప్రభుత్వం అంగీకరించడం లేదు. దీంతో సభ నుండి వాకౌట్ చేయడమో లేదా సభను బహిష్కరించడమో తప్ప ప్రతిపక్షాలకు వేరే మార్గం లేకుండా పోతోంది.

చర్చకు ససేమిరా

రూల్ 267 కింద ప్రతిపక్షాలు అసాధారణ రీతిలో నోటీసులు అందించారు. లిస్టింగ్ అయిన సభా కార్యక్రమాలను ఆపేసి, అత్యవసర అంశాలపై చర్చకు పట్టుపట్టడానికి ఈ రూల్‌ను ప్రతిపక్షాలు వాడుకుంటాయి. సభా కార్యకలాపాలు నిలిచిపోవడానికి ప్రతిపక్షాలే బాధ్యత వహించాలని కార్పొరేట్ మీడియా నిందిస్తోంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే ముగిసిపోతాయేమోనని అది ఆందోళన వ్యక్తం చేస్తోంది. రూల్ 267 కింద చర్చకు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ నిరాకరించారు. మణిపూర్ హింస, వరదల బారినపడి నష్టపోయిన వాయనాడ్‌కు ప్రత్యేక సాయం, బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై జరుగుతున్న హింసపై కూడా చర్చ జరగాలని ప్రతిపక్షాలు కోరగా ప్రభుత్వం విముఖత చూపుతోంది.

నాడు అలా...నేడు ఇలా

2012లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష బిజెపి డిమాండ్ మేరకు బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంపై చర్చించేందుకు అంగీకరించారు. నిర్భయ సామూహిక అత్యాచార ఘటనపై కూడా రోజుల తరబడి చర్చ సాగింది. ఈ చర్చల కారణంగానే లైంగిక దాడి విషయంలో కొత్త చట్టం వచ్చింది. అయితే ఇప్పుడు కాషాయ పార్టీ మాత్రం పార్లమెంటును తన రాజకీయ సందేశాల కోసం వాడుకుంటోంది. సభలో చర్చల సమయంలో హిందీని ప్రధాన భాషగా రుద్దేందుకు ఆ పార్టీ ప్రయత్నించింది. ఇరువురు సభాపతులు తటస్థ పరిశీలకుల మాదిరిగా కాకుండా బిజెపి ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసే ప్రతిపక్ష నేతల మైక్రోఫోన్లను కట్ చేస్తున్నారు. గత దశాబ్ద కాలంగా సభా కార్యకలాపాలు ఏకపక్షంగానే సాగుతున్నాయి. ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటే వారిని సభ నుండి బహిష్కరిస్తున్న ఉదంతాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి.

ఇదీ ప్రభుత్వ తీరు

హిందూత్వ ప్రచార చిత్రం 'ది సబర్మతి రిపోర్ట్'ను వీక్షించేందుకు మోడీ, ఆయన క్యాబినెట్ సహచరులు ఇటీవల పార్లమెంట్ గ్రంథాలయాన్ని వేదికగా మార్చేశారు. గడచిన రెండు ప్రభుత్వాల పాలనలోనూ ప్రధాని మోడీ పార్లమెంటుకు వచ్చిన సందర్భాలు చాలా అరుదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో జరిగిన చర్చకు ఇచ్చిన సమాధానాన్ని కూడా ఆయన ఎన్నికల ప్రచారంగా మార్చేశారు. పార్లమెంటులో ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలపై ప్రభుత్వ వైఖరిని ఆయన స్పష్టం చేయలేదు. ఒకవేళ ప్రభుత్వం వైపు నుండి సమాధానాలు వచ్చినా అవి సాదాసీదాగా, దాటవేసే రీతిలో ఉంటున్నాయి. సభలో చర్చ జరపకుండానే అనేక బిల్లులను ప్రభుత్వం ఆమోదింపజేసుకుంది. బిల్లుల ప్రతులు తమకు అందలేదని, ముసాయిదాల అధ్యయనానికి తమకు తగిన సమయం ఇవ్వలేదని ప్రతిపక్షం తరచూ ఫిర్యాదు చేసింది.

ప్రజలు తిరస్కరించింది వారినే

ప్రతిపక్ష ఎంపీలను ప్రజలు తిరస్కరించారంటూ మోడీ చేసిన ప్రకటన వారి పాత్రను తక్కువ చేసి చూపడమే అవుతుంది. వాస్తవానికి ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించింది ప్రతిపక్షాలను కాదు... బిజెపినే. భారత ప్రజాస్వామ్యంపై వ్యక్తమవుతున్న ఆందోళనకు పార్లమెంట్ 'హైజాకింగే' నిజమైన కారణమైతే అందుకు ఎవరిని నిందించాలో అందరికీ తెలిసిందే.

ఎంపీ మిథున్‌రెడ్డికి తాత్కాలిక ఊరట

ప్రజాశక్తి-అమరావతి

పుంగనూరు టౌన్ పోలీసులు పెట్టిన కేసులో వైసిపి నేత ఎంపి మిథున్‌రెడ్డికి గతంలో జారీ చేసిన ముందస్తు బెయిల్ ఉత్తర్వుల షరతులను హైకోర్టు సవరించింది. ఛార్జిషీట్ దాఖలు లేదా మూడు నెలల పాటు ప్రతి నెల 1వతేదీ, 15వతేదీలలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట మధ్య దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలన్న షరతును తాత్కాలికంగా సడలించింది. డిసెంబర్ 29 వరకు దర్యాప్తు అధికారి ముందు హాజరీ నుంచి మినహాయింపు ఇస్తూ జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నేతిగుట్లపల్లె, ఆవులపల్లి రిజర్వాయర్ల కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లింపు వెళ్లినప్పుడు మిథున్‌రెడ్డి తమపై దాడి చేశారంటూ దాఖలైన కేసులో హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. పార్లమెంట్ సమావేశాల దృష్ట్యా ఆ షరతులను ఇప్పుడు సడలించింది.

ఖుర్దా డివిజన్‌లో పలు రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఖుర్దా రోడ్ డివిజన్‌లో 3వ లైన్‌ను ప్రారంభించేందుకు సంబంధించి భద్రక్ స్టేషన్‌లో ప్రీ నాన్-ఇంటర్‌లాకింగ్, నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 8వ తేదీన 12867 హౌరా-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్, 10వ తేదీన 22853 షాలిమార్ - విశాఖపట్నం, 12664 తిరుచ్చిరాపల్లి-హౌరా, 22807 సంత్రాగచ్చి- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 22825 షాలిమార్- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 11వ తేదీన 22854 విశాఖపట్నం- షాలిమార్, 12868 పుదుచ్చేరి-హౌరా, 22826 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్- షాలిమార్, 12వ తేదీన 22874 విశాఖపట్నం-దిఘా, 12663 హౌరా-తిరుచ్చిరాపల్లి, 22808 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి, 13వ తేదీన 22873 దిఘా-విశాఖపట్నం, 12664 తిరుచ్చిరాపల్లి-హౌరా, 22807 సంత్రాగచ్చి-ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 14వ తేదీన 20889 హౌరా-తిరుపతి హంసఫర్, 12666 కన్యాకుమారి- హౌరా సూపర్ ఫాస్ట్, 15వ తేదీన 20890 తిరుపతి-హౌరా, 12663 హౌరా-తిరుచ్చిరాపల్లి, 22808 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి, 12867 హౌరా-పుదుచ్చేరి, 22855 సంత్రాగచ్చి-తిరుపతి, 16వ తేదీన 12665 హౌరా-కన్యాకుమారి, 22856 తిరుపతి-సంత్రగచ్చి, 17వ తేదీన 22853 షాలిమార్ - విశాఖపట్నం, 12664 తిరుచ్చిరాపల్లి-హౌరా, 22807 సంత్రాగచ్చి- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 22825 షాలిమార్- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 18వ తేదీన 12868 పుదుచ్చేరి-హౌరా, 22826 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్- షాలిమార్, 19వ తేదీన 22854 విశాఖపట్నం- షాలిమార్, 12663 హౌరా-తిరుచ్చిరాపల్లి, 22808 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ లను రద్దు చేశారు.

6 నుంచి గీతంలో చదరంగం పోటీలు

ప్రజాశక్తి -మధురవాడ (విశాఖ)

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆతిథ్యంలో భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం (ఎఐయు) ఆధ్వర్యాన ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు దక్షిణ మండల (సౌత్‌జోన్) పరిధిలోని 5 రాష్ట్రాలకు చెందిన అంతర్ విశ్వవిద్యాలయాల మధ్య మహిళల చదరంగం పోటీలను నిర్వహిస్తున్నట్లు గీతం క్రీడా విభాగం డైరక్టర్ డాక్టర్ యు.విజయకుమార్ తెలిపారు. గీతం విశ్వవిద్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పోటీల వివరాలను వెల్లడిరచారు. ఈ పోటీలకు దక్షిణ భారత దేశంలోని 65 విశ్వవిద్యాలయాల నుంచి దాదాపు 300 మంది చదరంగ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 72 మంది, తెలంగాణా నుంచి 48, తమిళనాడు నుంచి 90, కర్ణాటక నుంచి 48, కేరళ నుంచి 36 మంది మహిళా క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. గీతం వైద్య కళాశాలలోని ఎల్లాప్రగడ సుబ్బారావు ఆడిటోరియంలో ఈ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోటీలకు ఆర్బిట్రేటర్‌గా వ్యవహరిస్తున్న జాతీయ స్థాయి సీనియర్ చదరంగం కోచ్ ఎమ్‌వి‌ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ, ఈ పోటీలను స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో విజేతలు త్వరలో జరగనున్న జాతీయ స్థాయి మహిళల చదరంగం పోటీలకు అర్హత సాధిస్తారని వివరించారు.

బెనిఫిట్ షోలు రద్దు చేయాలి

- ఆర్‌టిసి క్రాస్‌రోడ్డులో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో భారీ సినిమాల బెనిఫిట్ షోలను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి, కార్యదర్శి టి.నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. అల్లు అర్జున్ రావడంతోనే సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ చనిపోయారని, ఆమె కుమారుడు తీవ్రగాయాలపాలయ్యాడని చెప్పారు. బెనిఫిట్ షోలపేరుతో సెలబ్రిటీలు అభిమానుల్లోకి రావడానికి పోలీసులు అనుమతి ఇవ్వొద్దని కోరారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల సాయం చేయాలనీ, గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. ఇవే డిమాండ్లతో గురువారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్డులో గల సంధ్య థియేటర్ వద్ద ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. 'అభిమానుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు..చనిపోయిన మహిళ కుటుంబానికి న్యాయం చేయాలి...నిర్మాతలు, ప్రభుత్వం కలిసి రూ.కోటి ఆర్థిక సహాయం ప్రకటించాలి... బెనిఫిట్ షోలు రద్దు చేయాలి...టికెట్ల రేట్లను అన్నింటికీ ఒకేలా ఉంచాలి' అని నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది.

భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో ఆ సంఘాల నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి అక్కడ నుంచి కాంచన్‌బాగ్ పిఎస్‌కు తరలించారు. ధర్నా సందర్భంగా మూర్తి, నాగరాజు, వెంకటేశ్ మాట్లాడుతూ..బెనిఫిట్‌షోకు అల్లు అర్జున్ రావడంతో అభిమానులంతా ఒక్కసారిగా నెట్టుకోవడంతో తొక్కిసలాట జరిగిందనీ, ఆ ఘటనలో మహిళ చనిపోవడంతో పాటు పలువురికి గాయాలయ్యాయని వాపోయారు. చిన్నచిన్న ధర్నాలు, కార్యక్రమాలకే లా అండ్ ఆర్డర్ అని తిరస్కరించే పోలీసులు ఇరుకైన ప్రాంతంలో అల్లు అర్జున్ పర్యటనకు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు.

నేడు పారాబోలా-9 స్టార్టప్ సెంటర్ ప్రారంభం

నూజివీడు టౌన్ :నూజివీడు ఆర్‌జియుకెటి క్యాంపస్‌లో స్టార్టప్ సెంటర్‌ను స్థాపించాలనే ఉద్దేశంతో 2024 అక్టోబర్‌లో యుఎస్ఎ - ఆధారిత సంస్థ అయిన పారాబోలా-9తో అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ సంస్థ నూజివీడు క్యాంపస్‌ని సందర్శించి, హ్యాకథాన్‌ను నిర్వహించింది. ఇ 4 నుంచి 15 మంది ఫుల్ టైం ఇంటర్న్‌లను నియమించింది. అలాగే ఇ 2, ఇ 3 నుంచి ఎనిమిది మంది పార్ట్‌టైమ్ ఇంటర్న్‌లు సాయంత్రం రెండు గంటలపాటు సహాయ సహకారాలు అందిస్తారు. నూజివీడు ఆర్‌జియుకెటి క్యాంపస్ నిర్దేశకులు ఆచార్య ఎస్.అమరేంద్రకుమార్ ఆదేశాల మేరకు నూజివీడు క్యాంపస్ పరిపాలన విభాగం ఈ కేంద్రాన్ని స్థాపించడానికి కావాల్సిన స్థలాన్ని కేటాయించి తమ మద్దతును అందించారు. పారాబోలా-9 తమ కేంద్రాన్ని ఐ - 3 భవనంలోని మొదటి అంతస్తులో విజయవంతంగా ఏర్పాటు చేసింది. ఈ కేంద్రా న్ని ఈ నెల ఆరో తేదీ శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి హాజరు కానున్నారు.

18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):
శేషాచలం అటవీ పరిధి ప్రకాశం జిల్లా గిద్దలూరు అటవీ ప్రాంతంలో 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాలతో కడప సబ్ కంట్రోల్ పోలీసులు కూంబింగ్ నిమిత్తం కొమరోలుకు వెళ్లి అక్కడి నుంచి గిద్దలూరు డివిజన్ చింతలపల్లి వైపుగా కూంబింగ్ కొనసాగించారు.కనుమబావి రస్తా వద్ద కొంతమంది వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా వారిని సమీపించే సరికి కొందరు పారిపోయారు. వారిలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. సమీపంలో పరిశీలించగా 18 ఎర్రచందనం దుంగలు కనిపించాయని, పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులు ప్రకాశం జిల్లా వాసులుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను, కూతురిని చంపిన కిరాతకుడు

- నిందితుని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హొళగుంద
భార్యను, మూడేళ్ల కూతురిని ఓ కిరాతకుడు చంపిన సంఘటన కర్నూలు జిల్లా హొళగుంద మండలం హెబ్బటం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మృతురాలి తల్లి, బంధువుల వివరాల మేరకు... ఎమ్మిగనూరు తాలూకా బాపురం, కంబధహాలు గ్రామానికి చెందిన పింజరి సక్రప్పతో హొళగుంద మండలం ఇంగలదహాల్ గ్రామానికి చెందిన సలీమా (21)కు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. రెండేళ్ల క్రితం హొళగుంద మండలం హెబ్బటం గ్రామానికి జీవనోపాధి కోసం వచ్చారు. వీరికి సమీరా(3) అనే కుమార్తె ఉంది. గ్రామంలో పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. గురువారం మధ్యాహ్నం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. మృతురాలి సలీమా తల్లి మాబీకి అల్లుడు సక్రప్ప ఫోన్ చేసి 'నీ కూతురు గొడవ గురించి ఏమైనా ఫోన్ చేసి చెప్పిందా' అని ఆరా తీసినట్లు తెలిపారు. అనంతరం పక్కింటి వాళ్లు మాబీకి ఫోన్ చేసి 'నీ కూతురు, మనవరాలు చనిపోయారు' అని సమాచారం ఇచ్చారు. మాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ బాల నరసింహులు తెలిపారు.

రూ.500 కోసం ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆదోని
అడగగానే రూ.500 ఇవ్వలేదని క్షణికావేశానికి లోనై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కర్నూలు జిల్లా ఆదోనిలో చోటు చేసుకుంది. ఆదోని రైల్వే ఎస్ఐ గోపాల్ వివరాల మేరకు... పట్టణంలోని కిల్చిన్ పేటకు చెందిన రాఘవేంద్ర కుమారుడు సాగరే ఆకాష్ (20)గా గుర్తించామన్నా రు. తల్లిదండ్రుల వివరాల మేరకు... మోటార్ సైకిల్ ఖర్చు నిమిత్తం ఆకాష్ రూ.500 అడిగాడు. తల్లిదండ్రులు ఇవ్వకపోవ డంతో క్షణకావేశానికి లోనై రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదోని, ఇస్వి మధ్యలో డౌన్ రైల్వే లైన్ ట్రాక్ మధ్యలో మృతదేహం పడి ఉన్న విషయాన్ని రైల్వే పైలట్ ఇచ్చిన సమాచారం మేరకు ఇక్కడికి వచ్చి పరిశీలించామని రైల్వే ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పెద్దదర్గాను సందర్శించిన నటి మీనాక్షిచౌదరి

ప్రజాశక్తి-కడప అర్బన్
కడప పెద్ద దర్గాను సందర్శించడం సంతో షంగా ఉందని హీరోయిన్ మీనాక్షి చౌదరి అన్నారు. గురువారం అమీన్ పీర్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా దర్గా నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికారు. దర్గా విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ.. లక్కీభాస్కర్ చిత్రాన్ని ఆదరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. త్వరలోనే ఒక పెద్ద ప్రాజెక్టు చేస్తున్నానని, వివరాలు ప్రకటిస్తానని చెప్పారు.

నూతన ఆవిష్కరణపై అవగాహన అవసరం

- ఎయు ఉపకులపతి ఆచార్య శశిభూషణరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం : పరిశోధనా రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై ఎప్పటికప్పుడు అవగాహన పొందాలని ఎయు ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. గురువారం ఎయు కెమిస్ట్రీ విభాగంలో నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ, కెటాలసిస్ అండ్ ఎన్విరాన్మెంట్ (ఎన్ఎంఇసిఇ-2024) జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ శశిభూషణరావు మాట్లాడుతూ, ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రపంచవ్యాప్తంగా విస్తతంగా పరిశోధనలు జరుగుతున్న నానో మెటీరియల్స్‌పై సదస్సును నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎంవిఆర్ రాజు మాట్లాడుతూ, వర్తమాన అంశాలను పరిశోధకులకు పరిచయం చేయడానికి, విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ సదస్సు దోహదపడుతుందని చెప్పారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ ఆచార్యులు డాక్టర్ జి.రఘు రామారావు నానో మెడిసిన్స్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నానో మెడిసిన్స్ ప్రభావవంతంగా పనిచేస్తున్న విధానాన్ని తెలియజేశారు. విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల మాట్లాడుతూ, పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశాన్ని అనుసంధానం చేస్తూ మూడు రోజుల జాతీయ సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల సదస్సులో భాగంగా ఏయూ కెమిస్ట్రీ విభాగంలో చదువుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరినీ భాగం చేస్తూ వారినే వక్తలుగా ఆహ్వానించి ప్రత్యేక ప్రసంగాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడిటెక్ గ్లోబల్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ హెచ్.పురుషోత్తం, సదస్సు కన్వీనర్ ఆచార్య టి.శివరావు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆచార్య వి.సిద్దయ్య, ఆచార్య కె.బసవయ్య, ఆచార్య శైలజ తదితరులు ప్రసంగించారు. సదస్సులో దేశం నలుమూలల నుంచి ఆచార్యులు పరిశోధకులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్లుగా పెండింగ్..!

- మధ్యలోనే ఆగిన ఎన్‌హెచ్ 67
- రాకపోకలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
ఎనిమిదేళ్లుగా ఆ రహదారి నిర్మాణం జరుగుతూనే ఉంది. ఎప్పటికి పూర్తవుతుందో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. ఎన్‌హెచ్-67 అనంతపురం జిల్లాలో 57 కిలోమీటర్ల మేర ఉంది. ఈ రహదారి నిర్మాణాన్ని 2016 చేపట్టారు. మూడొంతులు నిర్మాణం జరిగి మధ్యలోనే ఆగింది. కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.



కర్ణాటక రాష్ట్రం రాంనగర్ నుంచి కృష్ణపట్నం వరకు 778 కిలోమీటర్ల మేరకు ఎన్‌హెచ్ 67 ఉంది. ఈ రహదారి కర్ణాటకలోని బళ్లారి జిల్లా నుంచి అంటే గుంతకల్లు నుంచి గుత్తి మీదుగా భోగసముద్రం వరకు ఈ ఎన్‌హెచ్ 67 పోతుంది. నాలుగు వరుసల రహదారి కోసం రూ.539.99 కోట్లతో డాట్, ఎస్ఆర్‌కె జాయింట్ వెంచర్‌గా కాంట్రాక్టును దక్కించుకుంది. 2016లో ఈ పనులను ఆ సంస్థకు అప్పగించారు. 2022 సంవత్సరం నాటికి ఈ పనులను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటిరకు 86 శాతం పనులను పూర్తి చేశారు. దీంతో గుంతకల్లు-గుత్తి మధ్యలో అనేక చోట్ల రహదారిలో అడ్డంకులున్నాయి. ఈ అడ్డంకుల క్రమంలో రెండేళ్ల క్రితం ఒక కారు గుంతలో పడి వ్యక్తి చనిపోయారు. ఇప్పటికీ ఈ రహదారులు పనులు మాత్రం అర్థాంతరంగా ఆగిపోయాయి. పనులు చేయడం లేదని అధికారులు పాత కాంట్రాక్టును రద్దుచేశారు. మిగిలిన పనులను ఎప్పటికి చేపడతారన్నది ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది.

జాతీయ రహదారి 42 నుంచి ఎస్‌కెయును కలిపేందుకు నిర్మించిన బైపాస్ రహదారి నిర్మాణంలో భాగంగా మధ్యలో రైల్వే గేటు ఉంది. దీని వద్ద బ్రిడ్జి నిర్మాణపు పనులు 2018 నుంచి జరుగుతూనే ఉన్నాయి. తవం కన్‌స్ట్రక్షన్స్‌కు ఈ పనుల బాధ్యతను అప్పగించారు. రూ.55.55 కోట్లతో ఈ పనులను అప్పగించారు. ఈ బ్రిడ్జి పనులను 2022 లోపు పూర్తి చేయాల్సి ఉంది. రూ.37.91 కోట్లు వ్యయం పనులను పూర్తి చేశారు. ఆ తరువాత ఈ సంస్థ పనులను ఆపేసింది. ఈ నిర్మాణం పూర్తికాకపోవడంతో అనంతపురం నగరం నుంచి రాప్తాడు వెళ్లే సమయంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. ప్రస్తుతం ఈ పనులనూ రద్దు చేశారు. ఇవి కూడా తిరిగి టెండర్లు పిలిచి కొత్త వారికి పనులు అప్పగించాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఏన్నేళ్లకు పూర్తవుతుందోనని వాహదారులు వాపోతున్నారు. వీటిని త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతి

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం జిల్లా)
శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలోని నీలావతిలో కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు గురువారం మృతి చెందాయి. మాకన్నపల్లికి చెందిన గొర్రెల కాపరులు చిన్న నీలావతిలో ఉన్న తోటల్లో మందలు వేస్తున్నారు. వారనుయ్య అని పిలిచే ప్రాంతంలో గొర్రెల మందతో కొన్ని రాత్రులుగా బస వేసి ఉన్నారు. మాకన్నపల్లికి చెందిన దాసరి ఆదినారాయణ, మద్దిల లచ్చయ్య, సాలిన కామయ్య, మందస మండలం లింబుగాంకు చెందిన కె.గోపాల్‌కు చెందిన గొర్రెల పిల్లలను రక్షణ వలలో ఉంచారు. మిగిలిన పెద్ద గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లారు. రక్షణ వలను చించి లోపలకు వెళ్లిన కుక్కలు ఒక్కసారిగా వాటిపై దాడి చేశాయి. చిన్న నీలావతికి చెందిన ఒక మహిళ తన ఆవులు, దూడను మేతకు తీసుకువెళ్లగా దూడ కనిపించకపోవడంతో వెతుకుతుండగా, గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేయడాన్ని చూసింది. గొర్రెల కాపరులకు సమాచారం అందించగా, వారు వచ్చేసరికి పిల్లలు మృతి చెందాయి. సుమారు రూ.70 వేలు నష్టం వాటిల్లినట్లు కాపరులు చెప్తున్నారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.



9న నన్నయలో బిఇడి స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-రాజానగరం
ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఈ నెల 9న బిఇడి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని విసి ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. బిఇడి రెండేళ్ల కోర్సుకు బిఏ, బి.కామ్, బి.ఎస్‌సి, బి.టెక్ డిగ్రీ పూర్తి చేసి ఎడ్-సెట్ 2024 పరీక్ష రాసిన వారు అర్హులని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులు 40 శాతం, ఒసి విద్యార్థులు 50 శాతం మార్కులు డిగ్రీలో పొంది ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 9న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో ప్రభుత్వం నిర్ణయించిన రూ.16,500 ప్రవేశ రుసుంతో అడ్మిషన్ పొందవచ్చునని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్, లేదా 7093008473 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పోరాడి ఓడిన ఆంధ్ర

- ఆరు వికెట్ల తేడాతో ముంబయి గెలుపు
- రెండు రికార్డులు నమోదు చేసిన అభిషేక్
- సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ

హైదరాబాద్: సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు వరుసగా ఐదు మ్యాచుల్లో గెలుపు అనంతరం తొలిమ్యాచ్‌లో ఓటమిపాలైంది. ఎలైట్ గ్రూప్-ఇలో భాగంగా రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్ ముంబయి చేతిలో ఆంధ్రప్రదేశ్ జట్టు నాలుగు వికెట్ల ఓటమిపాలైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 229పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. శ్రీకర్ భరత్(93నాటౌట్; 53బంతుల్లో 8ఫోర్లు, 4సిక్సర్లు), అశ్విన్ హెబ్బర్(52; 29బంతుల్లో 7ఫోర్లు, 2సిక్సర్లు), కెప్టెన్ రికీ బుయ్(68; 31బంతుల్లో 7ఫోర్లు, 4సిక్సర్లు) సత్తా చాటారు. టాపార్డర్ తొలి ముగ్గురు బ్యాటర్లు అర్ధసెంచరీలతో రాణించారు. ముంబయి జట్టులో అజింక్యా రహానే(95; 54బంతుల్లో 9ఫోర్లు, 4సిక్సర్లు), శ్రేయస్ అయ్యర్(25), పృథ్వీ షా (34) బ్యాటింగ్‌లో రాణించారు. చివర్లో శివమ్ దూబే(34; 18బంతుల్లో 3ఫోర్లు, 2సిక్సర్లు), సూర్యాంశ్(30; 8బంతుల్లో 2ఫోర్లు, 3సిక్సర్లు) మ్యచ్‌ను ముగించారు. దీంతో ముంబయి జట్టు మరో మూడు బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అజింక్యా రహానేకు దక్కింది. ఈ మ్యాచ్‌లో ఓడినా ఆంధ్ర జట్టు 20 పాయింట్లతో (+2.52) మెరుగైన రన్‌రేట్‌తో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

28బంతుల్లోనే అభిషేక్ సెంచరీ..

మేఘాలయతో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ రెండు రికార్డులను బద్దలు కొట్టాడు. టి20ల్లో కేవలం 28బంతుల్లోనే సెంచరీతోపాటు 11 సిక్సర్లు కొట్టి క్యాలండర్ ఇయర్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగానిగా ఈ ఫీట్‌లను సాధించాడు. మేఘాలయపై అభిషేక్ కేవలం 28 బంతుల్లోనే సెంచరీ కొట్టి గతంలో ఉర్విల్ పటేల్ (గుజరాత్) పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు. ఉర్విల్ కూడా ఇదే సీజన్ ఫాసెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. తొలుత మేఘాలయ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. అనంతరం పంజాబ్ తరఫున అభిషేక్ సుడిగాలి శతకంతో విరుచుకుపడటంతో 9.3 ఓవర్లలోనే విజయతీరాలకు చేరింది. అభిషేక్(106నాటౌట్; 29బంతుల్లో 8ఫోర్లు, 11సిక్సర్లు) విధ్వంస ఇన్నింగ్స్ ఆడాడు. అలాగే క్యాలెండర్ ఇయర్‌లో టి20ల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. గతంలో ఈ రికార్డు సూర్యకుమార్ యాదవ్ పేరిట ఉండేది. 2022లో సూర్యకుమార్ 41 ఇన్నింగ్స్‌ల్లో 85 సిక్సర్లు కొట్టగా.. తాజాగా అభిషేక్ ఈ ఏడాది కేవలం 38 ఇన్నింగ్స్‌ల్లోనే 87 సిక్సర్లు కొట్టాడు. టీ20ల్లో ఓ క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన భారత ఆటగాళ్ల జాబితాలో అభిషేక్ అగ్రస్థానంలో ఉండగా.. సూర్యకుమార్ వరుసగా రెండో స్థానంలో ఉన్నాడు.

భళా బరోడా..
టి20ల్లో అత్యధిక పరుగులతో రికార్డు..!

సయ్యద్ ముస్తాక్ అలీ టి20 ట్రోఫీలో బరోడా జట్టు అత్యధిక స్కోర్ సాధించి చరిత్ర సృష్టించింది. ఇండోర్‌లో సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో భాను పానియా అజేయ సెంచరీతో బరోడా 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. ఈ టోర్నీ చరిత్రలో ఇదే అత్యధిక స్కోరు. ఈ ఏడాది గాంబియాపై నాలుగు వికెట్లకు 344 పరుగులు చేసిన జింబాబ్వే రికార్డును బరోడా బ్రేక్ చేసింది. సిక్కిం నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్లకు 86 పరుగులు మాత్రమే చేసి 263 పరుగుల భారీ ఓటమి పాలైంది. బరోడా ఓపెనర్లు శశ్వత్ రావత్ (43), అభిమన్యు సింగ్ (53) తొలి వికెట్‌కు 92 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు శుభారంభం అందించారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన భాను పానియా బ్యాట్‌తో వీర విహారం చేశాడు. కేవలం 51 బంతుల్లోనే ఐదు ఫోర్లు, 15 సిక్సర్ల సహాయంతో అజేంగా 134 పరుగులు చేశాడు. భాను పానియా తుఫాన్ ఇన్నింగ్స్‌తో బరోడా టీ20 ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసి రికార్డును నెలకొల్పింది. నేటితో గ్రూప్ లీగ్ మ్యాచ్‌లు ముగిసాయి. ఎలైట్ గ్రూప్ క్వార్టర్‌ఫైనల్స్ డిసెంబర్ 9న జరగ నున్నాయి.



అభిషేక్(106నాటౌట్; 29బంతుల్లో 8ఫోర్లు, 11సిక్సర్లు)

వయనాడ్ బాధితుల పట్ల కేంద్రం వివక్ష

- సాయానికై అభ్యర్థిస్తున్నా పట్టించుకోని వైనం



కేంద్రం వివక్షపై లెఫ్ట్ ఫ్రంట్ భారీ నిరసన

తిరువనంతపురం : వయనాడ్ బాధితుల పునరావాసానికి తగినంత సాయాన్ని అందజేయాలని పదే పదే అభ్యర్థిస్తున్నా కేంద్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శించడంపై కేరళ ప్రజలు తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. తిరువనంతపురంలోని రాజ్‌భవన్ వద్ద, వివిధ జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. రాజ్‌భవన్ వద్ద ఆందోళనలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కలపట్టాలో కూడా బాధితులు తమ నిరసనను తెలిపారు.

కొండచరియలు కూలి పెను విషాదం సంభవించిన నేపథ్యంలో కేంద్రం సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పదే పదే కోరుతునే వుంది. పైగా, ఆనాటి సహాయక చర్యల్లో పాలు పంచుకున్న విమానాలకు అయిన బిల్లు రూ.153,47 కోట్లను ఎస్‌డిఆర్ఎఫ్ నుండి కేంద్ర ప్రభుత్వం లాక్కుంది. కేంద్ర ప్రభుత్వం తీరు పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజ్‌భవన్ మార్చ్‌ను ప్రారంభిస్తూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ ప్రసంగించారు. రాజ్యాంగపరమైన బాధ్యతలను నిర్వర్తించాల్సిందిగా పదే పదే కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కొండచరియలు విరిగిపడిన విపత్తుల్లో దేశంలోనే ఇది చాలా పెద్దదని అన్నారు. ఈ విషాదం చోటు చేసుకుని నాలుగు నెలలు గడిచిపోయినా బాధితులకు ఆర్థిక సాయం అందించడానికి కేంద్రప్రభుత్వం సంసిద్ధంగా లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తీవ్ర స్థాయిలో విధ్వంసం చోటుచేసుకుంటే ఏవో కొన్ని వార్డులు కొట్టుకుపోయాయంటూ ఈ విపత్తునే అపహాస్యం చేసేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ విషాదం నుండి బతికి బయటపడిన రెండు వేల కుటుంబాలకు పునరావాసం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందన్నారు.

వారికి మెరుగైన భవితవ్యం కల్పించేలా సమగ్ర పునరావాస ప్రణాళిక రూపొందు తోందన్నారు. ఇందుకోసం రూ.2వేల కోట్లు సాయం అందించాలని రాష్ట్రం కోరుతోందని, ఇందుకు సంబంధించి సవివరంగా మెమోరాండం అందజేశామని చెప్పారు. కేంద్రం తాను చేయాల్సిన సాయాన్ని అందచేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం తాననుకున్న ప్రణాళికతో ముందుకెళుతుందని గోవిందన్ చెప్పారు. పాలక్కాడ్, కొల్లామ్‌ల్లో నిరసన ప్రదర్శనలను వరుసగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్, ఎల్‌డిఎఫ్ కన్వీనర్ టి.పి.రామకృష్ణన్‌లు ప్రారంభిం చారు. కన్నూర్ అలప్పూజ, కొజికోడ్‌ల్లో కేంద్ర కమిటీ సభ్యులు ఎం.వి.జయరాజన్, పి.కె.శ్రీమతి, ఎలామరమ్ కరీమ్‌లు ప్రారంభించారు. జెడిఎస్ నేత మాథ్యూ టి.థామస్ (పతనంతిట్ట), కేరళ కాంగ్రెస్-ఎం నేత ప్రొఫెసర్ ఎన్.జయరాజ్ (కొట్టాయం), సిపిఐ నేత ప్రకాష్ బాబు (ఇడుక్కి), ఎన్‌సిపి నేత పి.సి.చాకో (ఎర్నాకులం), సిపిఐ నేత కె.పి.రాజేంద్రన్(త్రిస్సూర్), ఐఎన్ఎల్ నేత అహ్మద్ దేవర్‌కోయిల్ (కల్పట్ట, వాయనాడ్), సిపిఐ నేత, ఇ.చంద్రశేఖరన్(కాసరగోడ్)లు నిరసన ప్రదర్శనలను ప్రారంభించారు.

కేంద్ర హోం మంత్రికి విజ్ఞప్తి

ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్ణయించిన మేరకు ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌లకు చెందిన ఎంపీలు సంయుక్తంగా హోం మంత్రి అమిత్‌షాను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతినిధి బృందానికి బిజెపి ఎంపీలు దూరంగా వున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు ఎఎ రహీం, ప్రియాంకగాంధీ తదితరులు పాల్గొన్నారు.

అంతా హిందీమయం చేయొద్దు!

- ప్రజలపై బలవంతంగా రుద్దొద్దు
- రాజ్యసభలో బిల్లులకు హిందీ శీర్షికలపై ప్రతిపక్షాల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేవలం హిందీ పదాలతోనే కొత్త బిల్లులు తీసుకురావడం ద్వారా కేంద్ర ప్రభుత్వం, హిందీని బలవంతంగా ప్రజలపై రుద్దుతోందని రాజ్యసభలో ప్రతిపక్షాలు గురువారం ఆందోళన వ్యక్తం చేశాయి. భారతీయ వాయుయాన్ విధేయక్, 2024 బిల్లును కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ప్రవేశపెట్టారు. 90ఏళ్ల నాటి విమానాల చట్టాన్ని రద్దు చేసి ఆ స్థానంలో ఈ బిల్లును తీసుకు వచ్చారు. వాణిజ్యం చేసుకోవడాన్ని మరింత సులభతరం చేయడం, పౌర విమానయాన రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు తీసుకోవడం ఈ బిల్లు ముఖ్యోద్దేశంగా వుంది. వెంటనే ఈ బిల్లు పేరును మార్చాలని డిఎంకె ఎంపి కనిమొళి కోరారు. హిందీ మాట్లాడని ప్రజలపై హిందీ బలవంతంగా రుద్దాలని చూడవద్దని అన్నారు. హిందీ, సంస్కృతంల్లో బిల్లులకు పేర్లు పెట్టవద్దని కేంద్రానికి సూచించారు. టిఎంసి ఎంపి సాగరిక ఘోష్ మాట్లాడుతూ ఇన్ని చట్టాలకు హిందీ పేర్లు ఎందుకు పెడుతున్నారు? ఇది హిందీని బలవంతంగా రుద్దడమే. వైవిధ్యత, సమాఖ్య సూత్రాలను గౌరవించడం కోసం ప్రజలు తీర్పు నిచ్చారని, కానీ ప్రభుత్వం మాత్రం చట్టాలను హిందీమయం చేయడానికి పాల్పడుతోందని విమర్శించారు.

బిల్లు పేరు విషయంలో పునరాలోచన చేయాలని వైఎస్‌ఆర్‌సిపి సభ్యుడు ఎస్.నిరంజన్‌రెడ్డి సూచించారు. బిల్లును ఇంగ్లీషులో తీసుకువస్తూ, శీర్షిక హిందీలో వుండరాదన్నారు. ఇది ఆర్టికల్ 348(1బి) కింద రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. దేశంలో 56శాతం జనాభాకు హిందీ మాతృభాష కాదని అన్నారు. వారి తరపున తాను మాట్లాడుతున్నానని చెప్పారు. సిపిఐ సభ్యులు పి.సంతోష్ కుమార్ కూడా బిల్లు టైటిల్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. ఇది రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని విమర్శించారు. బిల్లు సమగ్రంగా లేదని, బిల్లు శీర్షికను సవరించాలని డిమాండ్ చేశారు. బిజెపి సభ్యుడు ఘనశ్యామ తివారీ మాట్లాడుతూ ఈ బిల్లును తెలుగు వారైన మంత్రి ప్రవేశపెట్టిన బిల్లేనని చెప్పింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారమే ఈ చర్య తీసుకున్నామన్నారు. ఏ భాషలోనైనా పేరు వచ్చిందంటే ఆ భాషను రుద్దే ప్రయత్నం కాదన్నారు.

రాజ్యసభ ఆమోదం

రాజ్యసభలో భారతీయ వాయుయాన్ విధేయక్ బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లుపై చర్చ అనంతరం రాజ్యసభ ఈ బిల్లును మూజువాణీ ఓటుతో ఆమోదించింది. ఆగస్టు 9న ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది.

జార్ఖండ్‌లో మంత్రివర్గ విస్తరణ

- మరో 11 మంది మంత్రుల ప్రమాణ స్వీకారం

రాంచీ : జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ గురువారం 11 మంది మంత్రులతో తన మంత్రివర్గ విస్తరణ చేపట్టారు. రాజ్‌భవన్‌లో జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ వారితో ప్రమాణం చేయించారు. పాలక పార్టీ జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) నుండి ఆరుగురు, కాంగ్రెస్ నుండి నలుగురు, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) నుండి ఒకరిని కేబినెట్‌లోకి తీసుకున్నారు. శాఖల కేటాయింపు జరగాల్సి వుంది.

జెఎంఎం నుండి చైబాసా ఎమ్మెల్యే దీపక్ బిరువా, ఘట్‌సిల ఎమ్మెల్యే రాందాస్ సోరెన్,. గిరిదిహ్ ఎమ్మెల్యే సుదివ్య కుమార్, బిష్ణుపూర్ ఎమ్మెల్యే చమ్రలిండా, గోమియా ఎమ్మెల్యే యోగేంద్ర ప్రసాద్, మధుపూర్ ఎమ్మెల్యే హాఫీజుల్ హసన్‌లు మంత్రులుగా ప్రమాణం చేశారు. కాంగ్రెస్ నుండి దీపికా పాండే సింగ్, ఇర్ఫాన్ అన్సారీ, రాధాకృష్ణ కిషోర్, శిల్పి నేహా టిర్కీలను కేబినెట్‌లోకి తీసుకున్నారు. తాము మంత్రి వర్గంలో భాగం కాదని సిపిఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ఇప్పటికే ప్రకటించారు. ఆర్‌జెడి ఎమ్మెల్యే సంజయ్ ప్రసాద్ యాదవ్ మంత్రిగా ప్రమాణం చేశారు. 81 అసెంబ్లీ స్థానాలకుగానూ జెఎంఎం నేతృత్వంలోని ఇండియా వేదిక 56 సీట్లు గెలుచుకుంది.

ముగ్గురు చేతుల్లోనే విమానయాన రంగం

- టిక్కెట్ ధరలు సామాన్యులకు అందుబాట్లోకి తేగలరా?
- ప్రైవేట్ కంపెనీలు విమానాలు కొంటే ప్రభుత్వం విజయమా?
- రాజ్యసభలో నిలదీసిన సిపిఎం ఎంపి ఎఎ రహీం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో విమానయాన రంగం అదానీ, టాటా, ఇండిగో ముగ్గురు చేతుల్లోనే ఉందని సిపిఎం ఎంపి ఎఎ రహీం విమర్శించారు. గురువారం రాజ్యసభలో భారతీయ వాయుయన్ విధేయక్ బిల్లుపై జరిగిన చర్చలో సిపిఎం ఎంపి రహీం ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ బిల్లు పేరునే తాను వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. భారతదేశం భాషా ప్రయుక్త రాష్ట్రాలతో కూడినదని మరిచిపోవద్దని హితవు పలికారు. ఈ బిల్లును ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ బిల్లుగా మార్చాలని తాను కోరుతున్నానన్నారు. ఈ బిల్లును మనం ఎందుకు చర్చిస్తున్నాం? ఎందుకంటే భారత పౌర విమానయాన రంగ సంరక్షకులు ఎవరు? మంత్రా? లేక మంత్రిత్వ శాఖా? అని ప్రశ్నించారు. కానీ మంత్రి, మంత్రిత్వ శాఖ సంరక్షకులు కాదని అన్నారు. భారత పౌర విమానయాన రంగంపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ ఏమీ లేదని అన్నారు. టాటా, ఇండిగో, అదానీ సంస్థలే మొత్తం విమానయాన రంగాన్ని నియంత్రిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలోని దాదాపు మేజర్ ఎయిర్‌పోర్టులన్నీ అదానీ చేతుల్లో ఉన్నాయని, ఆకాశంలో టాటా, ఇండిగోదే పైచేయి అని అన్నారు. కేంద్ర మంత్రి ఏమో మోడీ ప్రభుత్వ హయాంలోనే విమాన ప్రయాణికులు రెట్టింపయ్యారని గొప్పగా చెప్పుకుంటున్నారని చెప్పారు. కానీ విమాన ఛార్జీలు నియంత్రణ లేకుండా పెరుగుదలను మరిచారని అన్నారు. మంత్రి గారు మీరేమైనా విమాన టిక్కెట్టు ధరలను నియంత్రించగలరా? అని ప్రశ్నించారు.

కంపెనీలు టిక్కెట్టు ధర ఎంత చెబితే అంతేనని అన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ 356 రిపోర్టు విమాన టిక్కెట్ల ధరలు నియంత్రించాలని, సామాన్యులకు అనుగుణంగా టిక్కెట్లు ధరలు ఉండాలని స్పష్టం చేసిందన్నారు. దేశంలో ఈ డిమాండ్ చాలా సుదీర్ఘ కాలంగా ఉందని గుర్తుచేశారు. యువ మంత్రిగా విమాన ఛార్జీలు రెగ్యులేట్ చేసేందుకు ఒక యంత్రాంగాన్ని తీసుకురాగలరా? అని ప్రశ్నించారు. 'మీరు తీసుకురాలేరు. ఎందుకంటే డిరెగ్యులేట్ అనేది నయా ఉదారవాద విధానాల ప్రాథమిక మంత్రమని' విమర్శించారు. ఇండిగో, టాటా కొత్త విమానాలు కొనుగోలు చేస్తే, దాన్ని ప్రభుత్వం సాధించిన విజయంగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆ రెండు సంస్థలు విమానాలు కొనుగోలు చేస్తే, ప్రభుత్వం బిల్లు ఎందుకు తీసుకొస్తుందని ప్రశ్నించారు.

ద్వైవార్షిక ప్రవేశాలకు స్పందన నామమాత్రమే

- ఆరు వర్సిటీల్లోనే యుజిసి పథకం అమలు

న్యూఢిల్లీ : ఉన్నత విద్యాసంస్థల్లో ద్వైవార్షిక ప్రవేశాలకు సంబంధించి యుజిసి ప్రవేశపెట్టిన పథకానికి స్పందన నామమాత్రంగానే ఉంటోంది. దేశంలో మొత్తం 48 సెంట్రల్ యూనివర్సిటీలు ఉండగా వాటిలో కేవలం ఆరు మాత్రమే ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. సాంకేతిక-యేతర కోర్సులను అందిస్తున్న యూనివర్సిటీలు, కళాశాలలు ఏడాదికి రెండుసార్లు...తొలుత జూలై-ఆగస్ట్, పిదప జనవరి-ఫిబ్రవరిలో విద్యార్థులను చేర్చుకునేందుకు అనుమతించే ప్రతిపాదనకు యూజీసీ మేలో ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేటును (జిఇఆర్) పెంచడానికి ఈ పథకాన్ని ఉద్దేశించారు. అమెరికా, బ్రిటన్ దేశాల్లోని అనేక విశ్వవిద్యాలయాలు సంవత్సరానికి రెండుసార్లు విద్యార్థులను చేర్చుకుంటున్నాయి.

ద్వైవార్షిక ప్రవేశాలు ప్రారంభించడానికి ముందు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బందిని దృష్టిలో ఉంచుకొని సరైన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఉన్నత విద్యాసంస్థలకు యూజీసీ సూచించింది. కాగా ద్వైవార్షిక ప్రవేశాల పథకాన్ని ఎన్ని కేంద్రీయ యూనివర్సిటీలు, విద్యా సంస్థలు అమలు చేస్తున్నాయని ఎండీఎంకే సభ్యుడు వైగో బుధవారం రాజ్యసభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై విద్యా శాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ స్పందిస్తూ సంవత్సరానికి రెండుసార్లు విద్యార్థులను చేర్చుకునే విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది ఉన్నత విద్యా సంస్థలేనని తెలిపారు. పథకాన్ని అమలు చేసేందుకు ఈ ఏడాది ఆరు యూనివర్సిటీలు ముందుకు వచ్చాయని ఆయన చెప్పారు.

ఖాళీలు భర్తీ చేయండి

- రెండు వారాల్లో నివేదికలివ్వండి
- సమాచార కమిషన్లపై కేంద్ర రాష్ట్రాలకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్రాల సమాచార కమిషన్లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. గత నెల 11న అందజేసిన నివేదిక ప్రకారం కేంద్ర సమాచార కమిషన్‌లో ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రస్తుతం కేవలం ముగ్గురు సమాచార కమిషనర్లు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ తెలిపింది. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో నివేదిక అందజేయాలని అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ ఛహార్‌ను న్యాయస్థానం ఆదేశించింది. కేంద్ర సమాచార కమిషన్, పలు రాష్ట్ర సమాచార కమిషనర్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై సమాచార హక్కు కార్యకర్త సహా పలువురు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను పురస్కరించుకొని సుప్రీం బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది. మహారాష్ట్రలో ఏడు, కర్నాటకలో ఎనిమిది, ఛత్తీస్‌గఢ్‌లో రెండు, బీహార్‌లో ఒకటి, పశ్చిమ బెంగాల్‌లో నాలుగు, ఒడిషాలో ఐదు, తమిళనాడు సమాచార కమిషన్‌లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని న్యాయస్థానం గుర్తించింది. జార్ఖండ్, తెలంగాణ, త్రిపుర రాష్ట్రాల సమాచార కమిషన్లు గత కొన్ని సంవత్సరాలుగా ఉనికిలోనే లేవని, ఆయా రాష్ట్రాల్లో తాజా నియామకాలు జరగడం లేదని తెలిపింది. గత సంవత్సరం నవంబరులో జారీ చేసిన ఆదేశాల్లో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించానని గుర్తు చేసింది. రాష్ట్రాలు కూడా రెండు వారాల్లో నివేదికలు అందజేయాలని, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కాలపరిమితిని వివరించాలని ఆదేశించింది. 'ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయాన్ని రాష్ట్రాలు కూడా తెలియజేయాల్సి ఉంటుంది. రెండు వారాల్లో దీనిపై నివేదికలు అందజేయాలి' అని న్యాయస్థానం పేర్కొంది. పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సమాచారం అందజేయడంతో న్యాయస్థానం ఈ ఆదేశాలను వెలువరించింది. తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. సమాచార కమిషన్లలో ఖాళీలను భర్తీ చేయకపోవడమంటే సమాచార హక్కు చట్టం ఉద్దేశాన్ని నీరుకార్చడమేనని సుప్రీంకోర్టు గతంలో వ్యాఖ్యానించింది.

జార్జియాలో నిరసనలు

తిబిలిసి: జార్జియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేలాది మంది వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు నిర్వహించారు. యూరోపియన్ యూనియన్‌లో చేరికకు సంబంధించి తిబిలిసిలో జరుగుతున్న చర్చలను ప్రభుత్వం నిలిపివేయడాన్ని వారు నిరసించారు. ఈ సందర్భంగా నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణల్లో 26 మంది గాయపడ్డారు. గత నెల 26న జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో పాలక జార్జియన్ డ్రీమ్ పార్టీ మెజార్టీ సాధించింది.

యూన్‌పై అభిశంసన

- రేపు ఓటింగ్
- రాజీనామాకు పెరుగుతున్న ఒత్తిడి

సియోల్ : దేశంలో సైనిక పాలన విధించేందుకు యత్నించి భంగపడిన అధ్యక్షుడు యూన్ సుక్ యేల్‌పై ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. దీనిపై చర్చ అనంతరం శనివారం ఓటింగ్ జరుగుతుంది. కొరియా రాజ్యాంగ నిబంధనల ప్రకారం అభిశంసన తీర్మానాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 72గంటల్లోగా దానిపై ఓటింగ్ జరఓటింగ్ జరగాలి. లేకుంటే ఆ తీర్మానం రద్దయినట్లు పరిగణి స్తారు. అప్పుడు మళ్లీ తీర్మానం తేవాల్సి వుంటుంది. పాలక కన్జర్వేటివ్ పీపుల్ పవర్ పార్టీ (పిపిపి) నేత హన్ డాంగ్ హూన్ మాత్రం ఈ అభిశంసన ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల రాజకీయ అస్థిరత నెలకొంటుందని వాదిస్తున్నారు. దక్షిణ కొరియాలో ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ అధ్యక్షునిపై అభిశంసన తీర్మాన ప్రక్రియ చేపట్టారు. మరోవైపు అధ్యక్షుడు యూన్ సుక్ యేల్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగు తున్నాయి. ఆయన రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. అధ్యక్షుడు రాజీనామా చేయకుంటే దేశ వ్యాపిత సమ్మెకు వెళ్తామని కొరియన్ కార్మిక సంఘాల సమాఖ్య (కెసిటియు) హెచ్చరించింది. రాజకీయ పార్టీలు, పౌర సమాజం వరుసగా రెండో రోజు కూడా నిరసనలతో హోరెత్తించాయి.

రక్షణ మంత్రి రాజీనామా

దక్షిణ కొరియా రక్షణ మంత్రి రాజీనామాను గురువారం అధ్యక్షుడు యూన్ ఆమోదించారు. ఈ నేపథ్యంలో మంత్రి రాజీనామా వెలువడింది. ప్రతిపక్షాలు ప్రభత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని, కమ్యూనిస్టు ఉత్తర కొరియా పట్ల సానుభూతి చూపిస్తున్నాయన్న సాకుతో అధ్యక్షుడు మంగళవారం రాత్రి దేశంలో సైనిక పాలన విధించారు. అయితే ఈ సైనిక పాలనను ప్రకటించిన కొన్ని గంటల్లోనే వెనక్కి తీసుకున్నారు. అయితే, పార్లమెంట్ దీనికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో సైనిక పాలన రద్దయింది. దీంతో రక్షణ మంత్రి కిమ్ తన పదవికి గురువారం రాజీనామా చేశారు. ఆయన స్థానంలో రిటైర్డ్ ఫోర్ స్టార్ జనరల్ చోయ్ బయాంగ్ హైక్‌ను అధ్యక్షుడు వెంటనే నియమించారు. మార్షల్ లాను ఎత్తివేశామని ప్రకటించినప్పటి నుండి అధ్యక్షుడు బహిరంగంగా కనిపించలేదు.

దెబ్బకు దెబ్బ

- అమెరికాకు హైటెక్ మెటీరియల్స్ ఎగుమతిపై చైనా నిషేధం

బీజింగ్ : అమెరికాకు గాలియం, జెర్మేనియం, యాంటీమోనీ వంటి కీలకమైన హైటెక్ మెటీరియల్స్ ఎగుమతులను చైనా నిషేధించింది. చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. చైనా కంపెనీల కంప్యూటర్ చిప్‌ల తయారీ పరికరాలు, సాఫ్ట్‌వేర్, బ్యాండ్‌విడ్త్ మెమరీ చిప్‌ల ఎగుమతులపై పరిమితులు విధించినట్లు అమెరికా ప్రకటించిన నేపథ్యంలో చైనా ఈ నిర్ణయం తీసుకుంది. 'ఎంటిటి పేరుతో యుఎస్‌లో కొత్తగా జాబితా చేయబడిన 140 కంపెనీలలో దాదాపు అన్నీ చైనాకు చెందినవే. జాబితాలో ఉన్న ఇతర కంపెనీలు జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్‌లో చైనా యాజమాన్యంలో ఉన్నాయి

ఫ్రాన్స్ ప్రధానిపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం

- 1962 తర్వాత ఇదే మొదటిసారి

పారిస్ : ప్రతిపాదిత బడ్జెట్‌పై తలెత్తిన వివాదాల నేపథ్యంలో ప్రధాని మైఖేల్ బార్నియర్‌ను పదవీచ్యుతుడిని చేసేందుకు మితవాద, వామపక్ష పార్లమెంట్ సభ్యులు బుధవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. తీర్మానం గెలుపొందడానికి 288 ఓట్లు అవసరం కాగా, 331 ఓట్లతో పార్లమెంట్ ఆ తీర్మానాన్ని ఆమోదించింది. 1962 తర్వాత ప్రధానిపై అవిశ్వాస తీర్మానం నెగ్గడం ఇదే మొదటిసారి. ఫ్రాన్స్ పార్లమెంట్‌లోని దిగువ సభ అయిన నేషనల్ అసెంబ్లీలో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లేదు. ప్రధానంగా మూడు కూటములు వున్నాయి. అవి అధ్యక్షుడు మాక్రాన్‌కు చెందిన మధ్యేమార్గ పక్షాలు, వామపక్ష భావజాలంతో కూడిన న్యూ పాపులర్ ఫ్రంట్, మితవాద నేషనల్ ర్యాలీ. ప్రజల అవసరాలను తీర్చకుండా పొదుపు చర్యల పేరుతో రుద్దుతున్నారని వారు విమర్శిస్తున్నారు. బార్నియర్‌ను సెప్టెంబరులోనే మాక్రాన్ ప్రధానిగా నియమించారు.

నమీబియా తొలి మహిళా అధ్యక్షురాలిగా నదైత్వా

విండ్‌హక్ : నమీబియాకు తొలిసారిగా ఒక మహిళ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. గత వారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఉపాధ్యక్షురాలిగా వున్న నెతుంబో నంది నదైత్వా విజయం సాధించారని ఎన్నికల అధికారులు ప్రకటించారు. దీంతో ఆమె తొలిసారిగా అధ్యక్ష పీఠం అధిష్టించబోతున్న మహిళ కానున్నారు. సాంకేతిక లోపాలు, ఇతర ఇబ్బందుల వల్ల పోలింగ్‌కు తీవ్ర అంతరాయమేర్పడింది. దీంతో పోలింగ్ వ్యవధిని మూడు రోజులకు పెంచారు. నంది నదైత్వాకు 57శాతం ఓట్లు రాగా, ప్రధాన ప్రతిపక్ష అభ్యర్థికి 25.5శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. సౌత్ వెస్ట్ ఆఫ్రికన్ పీపుల్స్ ఆర్గనైజేషన్ పార్లమెంట్‌లో మెజారిటీని నిలబెట్టుకుంది. స్వల్ప మెజారిటీనే అయినా 34ఏళ్ళుగా కొనసాగిస్తున్న అధికారాన్ని పదిలపరుచుకుంది. 1990లో దక్షిణాఫ్రికా నుండి నమీబియా స్వాతంత్ర్యం పొందింది. ఎన్నికల ఫలితాలపై నంది నద్వైతా మాట్లాడుతూ, శాంతి, సుస్థిరతలు, యువత ఉపాధికోసం ప్రజలు ఈ ఓటు వేశారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో ఏం చెప్పామో అవి అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బంగ్లాదేశ్‌లో త్వరగా ఎన్నికలు నిర్వహించాలి

- ముఖ్య సలహాదారుతో రాజకీయ పార్టీల ప్రతినిధుల చర్చలు

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్‌లో త్వరగా ఎన్నికలు నిర్వహించాలిందిగా పలు రాజకీయ పార్టీలు ముఖ్య సలహాదారు మహ్మద్ యూనస్‌ను కోరాయి. ముఖ్య సలహాదారుతో ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశమై తాజా పరిస్థితిపై చర్చించారు. దేశంపై జరుగుతున్న దురాక్రమణను ఏ రీతిన ఎదుర్కోవాలనే అంశంపై యూనస్ రాజకీయ పార్టీల నుండి సలహాలు, సూచనలు కోరారు. అగర్తలాలో బంగ్లాదేశ్ అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయాన్ని ధ్వంసం చేసిన నేపథ్యంలో బంగ్లాదేశ్-భారత్ సంబంధాల తీరుతెన్నులను నిర్ణయించేందుకు అనుసరించే వ్యూహంపై రాజకీయ పార్టీల నుండి సూచనలు కోరేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు.

అయితే ఈ సమావేశానికి అవామీ లీగ్, దాని మిత్రపక్షాలు హాజరు కాలేదు. ఎన్నికల తేదీని ప్రకటిస్తే ప్రజల్లో ఒక రకమైన ఉత్సాహం తలెత్తుతుందని, ఆ ఉత్సాహం దేశానికి ఉపకరిస్తుందని అందుకే ఈ సమావేశం ప్రధాన ఎజెండా కానప్పటికీ దీనిపై చర్చించామని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) స్థాయి సంఘం సభ్యుడు అమీర్ ఖుస్రూ చౌదరి తెలిపారు. యూనస్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంత విస్తృత స్థాయిలో రాజకీయ సమావేశం జరగడం ఇదే ప్రథమం. ఎన్నికలకు ముందుగా పరిస్థితులు ఒక కొలిక్కి వచ్చేందుకు రాజకీయ పార్టీలతో చర్చలు జరుపుతానని యూనస్ హామీ ఇచ్చారు. అయితే భవిష్యత్ ఎన్నికల్లో అవామీ లీగ్, దాని మిత్రపక్షాలను చేర్చుకుంటారో లేదో స్పష్టత రాలేదు.

మైనారిటీల రక్షణలో యూనస్ ప్రభుత్వం విఫలం : హసీనా

హిందువులు సహా మైనారిటీలకు రక్షణ కల్పించడంలో యూనస్ ప్రభుత్వం విఫలమైందని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పేర్కొన్నారు. ఆగస్టులో ఉవ్వెత్తున ఎగసిపడిన నిరసనలకు భయపడి హసీనా దేశం వీడి భారత్‌కు ప్రత్యేక విమానంలో వచ్చి ఇక్కడ ఆశ్రయం పొందిన సంగతి తెలిసిందే. అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మొదటిసారి వర్చువల్‌గా ఆమె ప్రసంగించారు. 1975లో తమ తండ్రి షేక్ ముజిబుర్ రహ్మాన్‌ను హత్య చేసినట్లే తనను, తన సోదరి షేక్ రెహానాను హత్య చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని హసీనా పేర్కొన్నారు. యూనస్‌ది అధికార వ్యామోహం అని విమర్శించారు. బంగ్లాదేశ్‌లోని ప్రార్థనా స్థలాలపై దాడులను అరికట్టడంలో తాత్కాలిక ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బంగ్లాదేశ్ ప్రధానిగా చివరి రోజు అధికారిక నివాసంలో ఉండగా పెద్దసంఖ్యలో నిరసనకారులు చుట్టుముట్టారని చెప్పారు. ఆ సమయంలో తాను కాల్పులకు భద్రతా సిబ్బందిని ఆదేశించివుంటే చాలామంది మరణించి ఉండేవారని అన్నారు. ప్రాణనష్టం జరగకూడదనే ఉద్దేశంతోనే తాను 25 నుండి 30 నిమిషాల్లో ఢాకా నుండి బయలుదేరి భారత్‌కు వచ్చేశానని హసీనా తెలిపారు.

పాలస్తీనియన్ల ప్రక్షాళనే లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడులు

- ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ విమర్శ
- అమెరికా, మిత్రపక్షాలకూ భాగస్వామ్యం
- పశ్చిమాసియా పరిస్థితులపై నివేదిక విడుదల


ఆకలితో అల్లాడుతున్న చిన్నారులు

కైరో : గాజాలో గత 13 మాసాలుగా ఇజ్రాయిల్ మారణహోమానికి పాల్పడుతోందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ విమర్శించింది. ప్రాణాంతకమైన దాడులకు, విధ్వంసానికి పాల్పడుతూ పాలస్తీనియన్లను ఉద్దేశ్యపూర్వకంగా నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొంది. కీలకమైన మౌలిక వసతులను నాశనం చేస్తూ, ఆహారం, మందులు, ఇతర రకాల సాయాన్ని అందనివ్వకుండా చేస్తోందని పేర్కొంది. ఈ మేరకు పశ్చిమాసియాలో పరిస్థితులపై గురువారం ఒక నివేదికను విడుదల చేసింది. ఈ ఊచకోతలో అమెరికా దాని మిత్రపక్షాలకు కూడా భాగస్వామ్యం వుందని పేర్కొంటూ తక్షణమే వారు ఆయుధ సరఫరాలను నిలిపివేయాలని పిలుపిచ్చింది. ఇది కచ్చితంగా నర మేధమే, వెంటనే దీన్ని ఆపాల్సిందేనని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ ఆగ్నెస్ కేలామర్డ్ ఆ నివేదికలో స్పష్టం చేశారు. పోషకాహార లోపం, వ్యాధులు ఈ రెండూ కలిసి పాలస్తీనియన్లపై నెమ్మదిగా దాడి చేస్తున్నాయని, ఫలితంగా వారు నెమ్మదిగా మృత్యువుకు చేరవవుతున్నారని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. 21వ శతాబ్దంలో మరే ఘర్షణలు, యుద్ధాల్లో చూడని విధంగా గాజాల్లో అత్యంత వేగంగా విధ్వంసం, మరణాలు నమోదయ్యాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఇజ్రాయిల్ తక్షణమే ఈ మానవ సంహారాన్ని ఆపాలంటూ ఇప్పటివరకు పాలస్తీనా మిత్రపక్షాలు, మానవ హక్కుల గ్రూపులు కోరుతున్నాయి. తాజాగా అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా అవే డిమాండ్లతో నివేదిక వెలువరించింది. తన చర్యల ద్వారా ఇజ్రాయిల్ 1951 ఊచకోత ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆ నివేదిక విమర్శించింది. నెమ్మదిగా, ఒక పద్ధతితో పాలస్తీనియన్లు మృత్యువుకు చేరువయ్యేలా ఇజ్రాయిల్ చర్యలు వుంటున్నాయని పేర్కొంది. గాజాపై జరుగుతున్న దాడుల తీరును నివేదిక వివరించింది. ఇజ్రాయిల్ ప్రభుత్వం, మిలటరీ, అధికారులు చేసిన వందకు పైగా ప్రకటనలను సమీక్షించామని, తద్వారా వారి అసలు ఉద్దేశ్యాన్ని నిర్ధారించేందుకు ప్రయత్నిం చామని నివేదికలో పేర్కొన్నారు. ఇళ్ళను, పొలాలను, ఆస్పత్రులను, నీటి సదుపాయాలను ఇలా దైనందిక జీవితంలో అవసరమయ్యే వాటిని ధ్వంసం చేసి కాలక్రమంలో పాలస్తీనియన్ల జీవన ప్రమాణాలను దెబ్బతీయాలని, అంతిమంగా వారిని నిర్మూలించాలన్నది ఇజ్రాయిల్ లక్ష్యంగా వుందని ఆ నివేదిక విమర్శించింది. కాగా, ఇజ్రాయిల్ ఈ ఆరోపణలను తీవ్రంగా తోసిపుచ్చుతోంది. ఇవన్నీ యూదు వ్యతిరేక అపవాదులేనని వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ న్యాయస్థానంలో ఇటువంటి ఆరోపణలను సవాలు చేస్తున్నామని పేర్కొంది. కల్పిత కథనాలతో పూర్తిగా తప్పుడు సమాచారాన్ని ఈ నివేదికలో ఇచ్చారని ఇజ్రాయిల్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో విమర్శించింది.

అస్సాంలో గొడ్డు మాంసంపై నిషేధం

గువహతి : అస్సాంలో గొడ్డు మాంసంపై నిషేధాన్ని మరింతగా విస్తరిస్తూ బిజెపి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. హోటళ్లు, రెస్టారెంట్లు, బహిరంగ ప్రదేశాల్లో, మత పండుగల్లో దీనిపై నిషేధం విధించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ నిబంధనల్ని సంబంధిత చట్టంలో చేర్చాలని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో బీఫ్ వినియోగానికి సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం పటిష్టంగానే ఉన్నప్పటికీ.. అందులో రెస్టారెంట్లు, హోటళ్లతో పాటు మతపరమైన, సామాజిక కార్యక్రమాల సందర్భంగా బీఫ్ వాడకంపై ఇప్పటి వరకూ నిషేధం విధించలేదని ఆయన చెప్పారు. అసోం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆలిండియా డెమోక్రాటిక్ ఫ్రంట్ (ఎఐయుడిఎఫ్) ఖండించింది.

దీనిని పొలిటికల్ జిమ్మిక్కుగా ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ అమినుల్ ఇస్లాం తెలిపారు. ప్రజలు ఏమి తినాలో.. ఏమి ధరించాలో ప్రభుత్వం నిర్ణయించకూడదని అన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలో 40 శాతం మంది జనాభా వ్యక్తిగత అంశం ప్రభావితమవుతుందని అన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. అసోం జనాభాలో 34.22 శాతం మంది ముస్లింలు, 3.74 శాతం మంది క్రైస్తవులు ఉన్నారు.

వాస్తవానికి అసోంలో బీఫ్ తినట నేరం కాదు. 2021లో అసోం ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ప్రకారం హిందువులు, జైనులు, సిక్కులు అధికంగా ఉండే ప్రాంతాలు, ఆలయాలకు ఐదు కిలో మీటర్ల పరిధిలో బీఫ్ అమ్మకాలు నిషేధం. ప్రస్తుతం నిర్ణయంతో ఆ నిషేధం హోటళ్లు, రెస్టారెంట్లు, బహిరంగ, మత కార్యక్రమాలకూ విస్తరించినట్టయ్యింది.



మీకోసం

సేమియా ఉడికించినప్పుడు అంటుకోకుండా విడివిడిగా రావాలంటే అందులో కొంచెం నెయ్యి వేయాలి.

జీవన సౌరభం

పరిస్థితులు ఎంత దారుణంగానైన ఉండని, అవకాశాలను సృష్టించుకోవాలి.

గోటితో పోయేదానికి గొడ్డలి



దీపావళి గ్రామంలో ఉన్నోడు, సరైనోడు, పెద్దోడు, చిన్నోడు అనే నలుగురు స్నేహితులు ఉండేవారు. ఆ నలుగురిలో ఉన్నోడి మెడమీద పులిపిరి కాయ పుట్టింది. అది చూసిన చిన్నోడు 'అలాంటిది నాకూ పుట్టింది. మా నాన్న తలవెంట్రుకతో తీసేసాడు' అని చెప్పి ఒక తలవెంట్రుక తీసి కాయ చుట్టూ గట్టిగా ముడి వేశాడు. నొప్పి భరించలేక గోల గోల చేశాడు ఉన్నోడు. మర్నాటికి పెద్ద పుండు అయిపోయింది. కొడుకుని వైద్యునికి చూపించింది తల్లి. 'ముందుగా నా దగ్గరికి వచ్చి ఉంటే ఒక్క మాత్రతో పులిపిరి కాయ రాలిపోయేది. సొంత వైద్యం చేసారు. ఇది పెద్ద పుండు అయ్యింది. పది రోజులు మందులు వాడాలి. గోటితో పోయేదానికి గొడ్డలి దాకా తెచ్చుకోవడమంటే ఇదే' అని మందులు రాసి ఇచ్చాడు వైద్యుడు.

ఇంటికి వచ్చాక జరిగినదంతా స్నేహితులకు చెప్పాడు ఉన్నోడు. 'ఒరే! పులిపిరి కాయకు గొడ్డలికి సంబంధం ఏంటిరా?' అని సందేహం వ్యక్తం చేశాడు సరైనోడు. 'డాక్టర్ కంటే నీకు తెలుసా? ఏదో ఉండే ఉంటుంది' అన్నాడు పెద్దోడు. వీళ్ళ మాటలు విన్న ఉన్నోడి తల్లి 'నేను చెప్తాను రండి' అని వాళ్ళను పెరట్లోకి తీసుకువెళ్ళి లేతగా ఉన్న చిన్న మొక్కను గోటితో చిక్కింది. లేత మొక్క కాబట్టి విరిగిపోయింది. అదే చెట్టు అయితే గోటితో చిక్కలేము గొడ్డలితోనే నరకాలి' అని ఆ పక్కనే ఉన్న పెద్ద చెట్టుని చూపించింది. 'ఈ చెట్టు వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. చిన్న మొక్కగా ఉన్నప్పుడే గోటితో చిదిమేయవలసింది. అప్పుడు పట్టించుకోలేదు, ఇప్పుడు పెద్దవృక్షమైంది. రాలిన ఆకులతో పెరడంతా చెత్తగా ఉంటోంది. దీనిని ఇప్పుడు గొడ్డలితో నరికించాలి. ఇలాంటప్పుడే గోటితో పోయేదానికి గొడ్డలిదాకా తెచ్చావు' అంటారు' అని చెప్పింది తల్లి. జరిగిన తప్పును తెలుసుకున్నారు పిల్లలు.

సులువుగా పరిష్కారమయ్యే సమస్యని జటిలం చేసుకునే సందర్భంలో 'గోటితో పోయేదానికి గొడ్డలి దాకా తెచ్చుకోవడం' అనే నానుడి అలా వాడుకలోకి వచ్చింది.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

దారి చూపండి



పిల్లలూ, చింటూకి ఐస్‌క్రీమ్ కావాలట. కాస్త తీసుకొని వెళ్లి ఇవ్వరూ!

నేను గీసిన బొమ్మ





ఆర్. విజయ,
10వ తరగతి,
ఎస్‌కెవిటి గవర్నమెంట్ హైస్కూలు,
రాజమహేంద్రవరం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పిల్లలపై వేధింపులను అడ్డుకోవాలి

మీడియాలో వచ్చే సమాచారం తెలుసుకుంటుంటే- గుండె బేజారు అవుతుంది. పిల్లలపై వేధింపులు ఇంత ఘోరంగా జరుగుతున్నాయా అని ఆవేదన కలుగుతోంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థల అధ్యయనం ప్రకారం చూస్తే- మొత్తం పిల్లల్లో సగం మంది ఏదో ఒక సందర్భంలో శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు గురవుతున్నారని తెలుస్తోంది. ఇది ఎంత దారుణమైన విషయం! ఇది పిల్లలకు ఎంత అభద్రమైన సమాజం! వేధింపులకు గురైన పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాలు ఏం కావాలి? వారి భవిష్యత్తు సంగతి ఏమిటి? రోగ పీడితులైన పిల్లలతో ఉన్న సమాజం రోగగ్రస్తం కాదా?

2007లో కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఒక సర్వే నిర్వహించిందట. 13 రాష్ట్రాల్లో ఒక లక్షా 25 వేల మంది పిల్లల్ని కలిసి, మాట్లాడిందట. ఆ సర్వేలో బయటపడ్డ విషయాలు తెలుసుకుంటే మనకు నిద్ర పట్టదు. అంతులో 53 శాతం మంది పిల్లలు వేధింపులకు గురయ్యారట! 56 శాతం మంది పిల్లలు శారీరక వేధింపులకు గురి కాగా, 50 శాతం మంది పిల్లలు మానసిక వేధింపులు ఎదుర్కొన్నారట! ఆడపిల్లలే కాక మగ పిల్లలు కూడా వేధింపులకు గురవుతున్నారట. యునిసెఫ్ 2005–13 మధ్యకాలంలో నిర్వహించిన ఒక సర్వేలో భారతదేశంలోని ఆడపిల్లల్లో నూటికి 42 మంది లైంగిక వేధింపులకు గురవుతున్నారని తేల్చింది. బయటికి బాగా కనిపిస్తున్న మనుషులలో ఏదో జాడ్యం పేట్రేగుతూ ఉంది. గొప్పగా మాట్లాడుకునే సమాజం తీవ్ర లోపభూయిష్టంగా ఉంది. దీనిని మనందరం సరి చేయాలి. పిల్లలకు, మహిళలకు భద్రమైన సమాజాన్ని నిర్మించుకోవాలి. సమాజంలో నెలకొని ఉన్న దుర్భర, దుర్మార్గ పరిస్థితులను, వాటి మూల కారణాలను నిర్మూలించాలి. అది సమాజంలోని పౌరులందరి బాధ్యత.



పిల్లలపై జరిగే దారుణాలకు రకరకాలు కారణాలు ఉంటున్నాయి. తొలుత లైంగిక వేధింపుల గురించి చూద్దాం. అనేక విషయాలను కుటుంబ పరువు మర్యాదలకు, స్త్రీల లైంగికతకు లేదా శీలం, పాతివ్రత్యాలకు ముడిపెట్టి చూడటం మన సమాజంలో బాగా పాతుకు పోయింది. అందువల్ల పరువు పేరుతో చాలా సంఘటనలు బయటికి రావడం లేదు. తెలిసినా నోరు మూసుకోవడం మామూలైంది. ఇంకా చెప్పాలంటే సమాజమే నోరు మూయిస్తోంది. ఇంటిగుట్టు బయట పడకూడదు అని వాస్తవాలను తొక్కిపెట్టే ప్రయత్నం జరుగుతోంది. ఈ ధోరణి కూడా పిల్లల మీద లైంగిక వేధింపులు కొనసాగటానికి ఒక కారణంగా ఉంది. ఇలా వేధింపులకు పాల్పడేవాళ్లు బాగా తెలిసినవాళ్లు, ఇంకా చెప్పాలంటే కుటుంబ సభ్యులూ అయివుంటున్నారు. ఎవరి నుంచి రక్షణ ఉంటుందని, ఉండాలీ అని అందరూ భావిస్తారో అలాంటి వారి నుంచే వేధింపులు ఎదురవ్వడం ఒక అమానుషం. 'లవ్ స్టోరీ' అనే సినిమాలో ఇలాంటి సున్నితమైన విషయాన్ని డైరెక్టర్ శేఖర్ కమ్ముల ఒక పాత్ర ద్వారా చిత్రీకరించారు. సొంత చిన్నాన్న ఆ అమ్మాయి పట్ల వేధింపులకు దిగుతాడు. తాను ఎవరితోనూ చెప్పలేని స్థితిలో తప్పించుకొని పారిపోవాలని చూస్తుంది కొండచిలువ అని పేరు పెడుతుంది. ఈ పరిస్థితి ఆమె మానసిక అనారోగ్యానికీ దారి తీస్తుంది. ధైర్యం చేసి పిల్లల మీద సాగే వేధింపుల అంశాన్ని తన కథనంలో చేర్చిన శేఖర్ కమ్ముల అభినందనీయుడు. జాగ్రత్త పడాలని, జాగ్రత్తగా ఉండాలని సమాజానికి ఇదొక హెచ్చరిక.

పిల్లల ముందు అనేక విషయాలను మనం మాట్లాడం. స్త్రీ పురుష శరీర భాగాల గురించి గానీ, లైంగిక జీవితం గురించి గానీ ఏనాడూ పిల్లల ముందు మాట్లాడం, చెప్పం. ఒకవేళ వాళ్ళు ఏదన్నా తెలిసి తెలియక ప్రశ్నలు అడిగినా, 'నోరు మూసుకో' అని గద్దిస్తాం. అలా అడగటం తప్పుగా భావిస్తాం. "పెద్దవాళ్ళం మేము మాట్లాడుకుంటున్నాం. నువ్వు బయటికి వెళ్ళు" అని కసురుకుంటాం. కానీ, లైంగిక విజ్ఞానం జీవితంలో ఒక భాగం. అది పిల్లలకు చెప్పాలనే జ్ఞానం మనకు ఉండట్లేదు.

వాస్తవ విషయాలను వాళ్ళకి అర్థం అయ్యేటట్టు చెప్పాలి. వాళ్ల శరీరం గురించి వాళ్లకు తెలియాలి. పిల్లలకు చెప్పకపోవడం వల్ల అది కొన్ని రకాల గందరగోళాలకి దారితీస్తుంది. ఈ గందరగోళం పిల్లల్లో కూడా రకరకాల పైత్యాలకు దారి తీస్తుంది.

ఇక పిల్లలపై జరిగే వేధింపుల్లో భౌతికపరమైనవి, మానసికపరమైనవి కూడా ఉంటాయి. దండం దశ గుణం భవేత్ అనే శ్లోకాలు మన పంతులు గార్లు బాగా ఉదహరిస్తారు. పిల్లలను కొట్టి, తిట్టి దారిలోకి తెచ్చుకోవాలని ఉద్బోధిస్తారు. పిల్లలకు మనసు ఉండదా? వాళ్ళ ఆలోచనలకి, మేధాశక్తికి మనం ఎందుకు ప్రాధాన్యత ఇవ్వం? కొట్టటం ద్వారా దారిలో పెడుతున్నాం అనుకోవడం తప్పు. ఈ తరం పిల్లలు మనకన్నా ఎక్కువే తెలుసుకుంటున్నారు. కొట్టి తిట్టి దారిలోకి తెచ్చుకోవాలని అనుకుంటే వాళ్లు మారరు. వారిని అర్థం చేసుకొని, తెలుసుకొని, మాట్లాడడం ద్వారా సరైన పౌరులుగా ఎదుగుతారు. తిట్టటం, కొట్టడం అనేది పరిష్కారం కాదు. అలా చేస్తే పిల్లలు రెబల్‌గా తయారవుతారు. కొట్టిన వాళ్ళ పట్ల మాత్రమే కాదు; సమాజం పట్ల కూడా ద్వేషాన్ని పెంచుకుంటారు. దెబ్బల ప్రభావం మనసు మీద పడితే అది అంత తేలిగ్గా పోదు. వాళ్ళ జీవితాంతం వెన్నాడుతుంది. దెబ్బకు దెబ్బ తీయాలని ద్వేషపూరితమైన మనస్తత్వం కూడా పెరుగుతుంది.

ఈ తరహా అజమాయిషీకి కూడా పితృస్వామ్య భావజాలమే కారణం. ఇంట్లో తండ్రి చెప్పినట్టు అందరూ వినాలి. భర్త చెప్పినట్టు వినాలి లేదా పెద్దన్న చెప్పినట్టు అందరూ వినాలి... అన్న భావజాలంలోంచి ఆధిపత్య భావన గూడు కట్టుకుంటుంది. ఎవరు ఏం చెప్పినా వినకుండా పెత్తనం చెలాయిస్తుంది. ఇది మంచి ఫలితాలను ఇవ్వదు. ఆధిపత్యం అంటేనే అప్రజాస్వామికం. ఇతరుల ఆలోచనలకు, ఇష్టాయిష్టాలకు విలువ ఇవ్వదు. ఈ ధోరణి సమస్యలను మరింత పెంచుతుంది తప్ప పరిష్కారం చూపదు.

జీవితాంతం ఈ బాధ ఉంటుంది

పిల్లల మీద వేధింపుల ప్రభావం వారి జీవితాంతం ఉంటుంది. ఆ ప్రభావం మెదడు, నాడీ మండలం మీద పనిచేస్తుంది. శారీరక ఆరోగ్యం మీద, మేధో శక్తి మీద కూడా ప్రభావం చూపిస్తుంది. నిరంతరం లైంగిక వేధింపులు, శారీరక మానసిక వేధింపులు – ఉన్నప్పుడు వాటి ప్రభావం రకరకాలుగా ఉంటుంది. పిల్లల మానసిక స్థితి, వారి సామాజిక జీవితం, ఆరోగ్యం, శారీరక ఎదుగుదల, లైంగిక జీవితం – వీటన్నిటి మీద వాటి ప్రభావం ఉంటుంది.

ఈ వేధింపుల ప్రభావం పిల్లలతోపాటు పిల్లల తల్లిదండ్రులు, దగ్గర బంధువుల మీద కూడా ఉంటుందని ముంబైలోని భాటియా హాస్పిటల్ మానసిక వైద్యులు డాక్టర్ ఫోరం మెటాలియ చెప్పారు. "పిల్లల మానసిక ఎదుగుదల మీద, భావోద్వేగాల మీద ఈ ప్రభావం దారుణంగా ఉంటుంది. డిప్రెషన్, ఆందోళన, ఏదో తప్పు చేశామని భావన, నేనెందుకూ పనికిరాను అనే ఆత్మన్యూనత, నలుగురిలో కలవలేనితనం వంటివన్నీ చుట్టుముట్టి, పిల్లల వికాసాన్ని దారుణంగా దెబ్బతీస్తాయి.

పెద్దవాళ్లకు ఉన్నట్లే పిల్లలకీ హక్కులుంటాయి. ఇంకా చెప్పాలంటే పెద్దవారి కన్నా ఎక్కువే ఉంటాయి, ఉండాలి కూడా. పెద్దలు ఈ విషయాన్ని గుర్తెరిగి మసలుకోవాలి. పిల్లలకు ఆదేశాలు ఇవ్వటం మానుకుని సంభాషించటం అలవర్చుకోవాలి. వారి ఇష్టాఇష్టాలను, కష్టసుఖాలను తెలుసుకోవాలి. కనీస లైంగిక విజ్ఞానాన్ని తప్పకుండా అందించాలి. పరువు ప్రతిష్ఠ, సంప్రదాయాలు వంటి పేరుతో పిల్లల వ్యక్తిత్వాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని దెబ్బతీసే అన్ని ధోరణులకు స్వస్తి చెప్పాలి.

– ఎస్.పుణ్యవతి
ఐద్వా జాతీయ కోశాధికారి

మాస్ ప్రేక్షకులకు మహా జాతర

'పుష్ప–2' సమీక్ష

మూడేళ్ల క్రితం సూపర్ హిట్టుగా నిలిచిన 'పుష్ప: ది రైజ్'కు సీక్వెల్‌గా వచ్చిన 'పుష్ప: ది రూల్' విడుదలకు ముందే వసూళ్లతో రికార్డు సృష్టించింది. టైటిల్‌కు తగినట్లు పుష్పరాజ్ ఇంటర్నేషనల్ మాఫియా మార్కెట్‌ను శాసించే స్థాయికి ఎదగడమే ఈ సినిమా కథావస్తువు. మొదటి భాగానికి కొనసాగింపుగానే దర్శకుడు సుకుమార్ ఈ సీక్వెల్ చిత్రాన్ని తీర్చిదిద్దాడు.



కథ : కూలీగా మొదలుపెట్టి ఎర్రచందనం సిండికేట్‌కు నాయకుడిగా ఎదిగిన పుష్ప (అల్లు అర్జున్) కథ ఇది. మొదటి పార్ట్‌లో ఎస్పీ భన్వర్ సింగ్ షెకావత్ (ఫాహద్ ఫాజిల్)ను ఘోరంగా అవమానించడంతో– అతడు ప్రతీకారం కోసం ఎదురు చూస్తుంటాడు. ఆ క్రమంలో పుష్పరాజ్‌ను అడ్డుకోవడానికి చూసిన ప్రతిసారీ ఫెయిల్ అవుతాడు. చివరికి షెకావత్ చేతులెత్తేస్తాడా? లేదా అనేది ఈ సినిమా.

మరోవైపు సిఎంను కలవడానికి వెళ్తున్న పుష్పతో అతని భార్య ఓ ఫొటో అడుగుతుంది. అది నెరవేరకపోగా అవమానానికి గురైన పుష్ప రాజ్ ఏం చేశాడనేది మరో ట్విస్ట్. తండ్రి పేరుగానీ ఇంటిపేరు కానీ పెట్టుకోవడానికి ఇష్టపడని అజయ్ తన సోదరుడైన పుష్పరాజ్‌కు చేసిన అవమానాన్ని ఏవిధంగా పాజిటివ్‌గా మలుచుకున్నాడనేది సినిమాలోని ప్రధాన అంశం. ఈ మూడు అంశాలతో సినిమా కొనసాగుతుంది.

ఈ సినిమాలో సెంటిమెంట్ కూడా ప్రధానమే! అన్న కూతురు సెంటిమెంట్‌తో పుష్పరాజ్ పై ఏవిధంగా ప్రభావం చూపింది అనేది సుకుమార్ చాలా బాగా డీల్ చేశాడు. సాధారణ కూలీ ఎర్రచందనం సిండికేట్‌ను తన గుప్పెట్లోకి తీసుకునే డాన్ స్థాయికి ఎదుగుతాడు. ఈ జర్నీలో చాలా కథ ఉంటుంది. ఆ కథలో ఎన్నో మలుపులుంటాయి. అందులో బిజినెస్ చేసేవారంతా విలన్లే. రాజకీయ నాయకులు కూడా విలన్లే. అవసరానికి వారిని ఏవిధంగా వాడుకున్నాడనేది ఇందులో చూపించాడు. అసలు ఎర్రచందనం ఎలా పోలీసులకు కనబడకుండా బోర్డర్ దాటించాలనే దానిపై దర్శకుడు బాగా స్టడీ చేసి తీసినట్లుంది.

అమ్మవారి జాతర ఎపిసోడ్‌లో హీరో చీర ఎందుకు కట్టుకున్నాడనే దానికి దర్శకుడు ఓ లాజిక్ చూపించాడు. అక్కడ జరిగే యాక్షన్ ఎపిసోడ్ హైలైట్. జపాన్ ఎపిసోడ్‌లో సాగే ఫైట్‌లో హాలీవుడ్ సినిమా ఫైట్లను టకటకా చూపించేశాడు. ఇది కథను సాగదీత చేయడానికి తీసినట్లుంది. ఇక చివరిలో అజయ్ కూతురు కోసం పుష్ప పోరాడే సన్నివేశాలు మరో హైలైట్. ఇవన్నీ సినిమాటిక్‌గా వున్నా చూసే మాస్ ప్రేక్షకుడికి కాస్త కనువిందు కలిగిస్తుంది.

పాటల విషయానికొస్తే– అమ్మవారి జాతర పాట మినహా పెద్దగా లేవు. కిస్సింగ్ సాంగ్, ఫీలింగ్ సాంగ్ కూడా కథనాన్ని పొడిగించడానికి అన్నట్టు ఉన్నాయి. కెమెరామెన్ పనితనం, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, సంగీతం తదనుగుణంగా ఉన్నాయి. ఫీలింగ్ రావడం అనే ఎపిసోడ్‌తో పుష్ప, శ్రీవల్లి బెడ్ రూమ్‌కు వెళ్లడం వంటివి నిడివి తగ్గిస్తే బాగుండేది. భార్యపై ఎంతప్రేమ వుందో తెలియజేసే సన్నివేశం, శ్రీవల్లి కాళ్ళను పుష్ప పట్టుకోవడం, ఆమె కాలితోనే తన గడ్డంపై తగ్గేదేలే అన్నట్లుగా చూపించడం సుకుమార్ స్టయిల్‌గా చెప్పొచ్చు.

సంభాషణల పరంగా కొన్ని మాటలు ఆకట్టుకున్నాయి. శ్రీకాంత్ విస్సా, సుకుమార్ తన పెన్‌కు పనిపెట్టారు. పెళ్లాం మాట వింటే ఎలా వుంటుందో చూపిస్తానని పుష్ప అనడం, అవసరం వున్నప్పుడు ఫండ్ ఇస్తే స్మగ్లర్లు ప్రభుత్వాన్ని మార్చే విధంగా సంభాషణలు, డబ్బు అంటే లెక్క లేదు. పెద్దలంటే గౌరవం లేదు. కానీ ఏదో కసి వుందంటూ.. సెంట్రల్ నాయకుడు జగపతిబాబు చేత అనిపించడం కొందరికి కనెక్ట్ అయ్యేలా వుంది.

ఈ సినిమాలో ఎక్కువ భాగం హీరో బిల్డప్ షాట్స్ పైనే సాగింది. సినిమా లాజిక్‌తో స్మగ్లింగ్ విషయంలో ఫ్రీనెస్ దర్శకుడు తీసుకున్నాడు. కొన్ని సీన్లు నిశితంగా గమనిస్తే విక్రమార్కుడు, కొన్ని హిందీ సినిమాల్లోని సన్నివేశాలు గుర్తుకు వస్తాయి. కానీ వాటిని మరిపించేలా సుకుమార్ తీసుకున్న కేర్ ప్రత్యేకం. సినిమాలో నిర్మాణ విలువలు బాగున్నాయి. సాంకేతికంగా అన్ని వనరులు ఉపయోగించుకున్నాడు సుకుమార్. నటనపరంగా అల్లు అర్జున్, రష్మిక హైలైట్ అయితే, షెకావత్ ప్రత్యేకం. మిగిలిన పాత్రలు ఎవరికివారు బాగా చేశారు. దీనికి కొనసాగింపుగా మూడో పార్ట్ ఉందంటూ దర్శకుడు సుకుమార్ ట్విస్ట్ ఇచ్చాడు. అసలోడు వచ్చాడా? అంటూ జగపతిబాబు అనడం, పుష్ప మేరేజ్‌కు ఎటెండ్ కావడం, బాంబ్ బ్లాస్ట్ కావడంతో పుష్ప 3 అంటూ ముగించాడు. ఈ సినిమా సక్సెస్‌ను బట్టి మూడోపార్ట్ వుంటుందనే టాక్ అయితే ఇప్పటికే నడుస్తోంది.



స్కట్ దెబ్బకు

హర్మన్ సేన విల విల

- తొలి వన్డేలో 100 పరుగులకే టీమిండియా ఆలౌట్
- ఆసీస్ మహిళల చేతిలో నాలుగు వికెట్ల తేడాతో ఓటమి



బ్రిస్బేన్: ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన తొలివన్డే టీమిండియా ఘోర పరాజయాన్ని చవిచూసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా అలెన్ బోర్డర్ స్టేడియంలో గురువారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 5వికెట్ల తేడాతో ఓడింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 100 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆసీస్ కూడా తడబాటుకు గురైంది. టార్గెట్ 101 పరుగులే కావడంతో.. వికెట్లు పడినా ఆసీస్ ఇబ్బంది పడలేదు. కేవలం 16.2 ఓవర్లలోనే ఐదు వికెట్లను కోల్పోయి ఆసీస్ విజయం సాధించింది. ఓపెనర్లు జార్జియా వోల్ (46), ఫోబ్ లిట్చ్‌ఫీల్డ్ (35) రాణించారు. భారత బౌలర్లలో రేణుకా ఠాకూర్ 3, ప్రియా మిశ్రా 2 వికెట్లు తీశారు. కెరీర్‌లో తొలి వన్డే ఆడుతోన్న ఆసీస్ బౌలర్ మెగాన్ స్కట్ (5/19) ఐదు వికెట్ల ప్రదర్శనతో భారత్ బ్యాటర్లను బెంబేలెత్తించింది. భారత బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్ (23) టాప్ స్కోరర్. ఆమెతోపాటు హర్లీన్ డియోల్ (19), హర్మన్ ప్రీత్ కౌర్ (17), రిచా ఘోష్ (14) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. ఓపెనర్లు ప్రియా పునియా 3, స్మృతీ మంధాన 8, దీప్తి శర్మ 1, సైమా ఠాకూర్ 4, టిటాస్ సధు 2 పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో స్కట్ 5 వికెట్లు.. కిమ్ గార్త్, గార్డెనర్, సదర్లాండ్, అలానా కింగ్ తలో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్కట్‌కు దక్కింది. రెండో వన్డే ఆదివారం(8న) జరగనుంది.

స్కోర్‌బోర్డు...

ఇండియా మహిళల ఇన్నింగ్స్: ప్రియ పూనియా (సి)గార్డినర్ (బి)స్కట్ 3, స్మృతి మంధాన (సి)మూనీ (బి)స్కట్ 8, హర్లిన్ (సి)సథర్లాండ్ (బి)గార్డినర్ 19, హర్మన్‌ప్రీత్ (ఎల్‌బి)సథర్లాండ్ 17, రోడ్రిగ్స్ (బి)కిమ్ గార్త్ 23, రిచా ఘోష్ (సి)కిమ్ గార్త్ (బి)స్కట్ 14, దీప్తి శర్మ (రనౌట్)వారేహామ్ 1, సైమా ఠాకూర్ (సి)లిచ్‌ఫీల్డ్ (బి)స్కట్ 4, టిటాస్ సధ్ధు (సి)లిచ్‌ఫీల్డ్ (బి)కింగ్ 2, ప్రియా మిశ్రా (బి)స్కట్ 0, రేణుక (నాటౌట్) 0, అదనం 9. (34.2ఓవర్లలో ఆలౌట్) 100పరుగులు. **వికెట్ల పతనం:** 1/9, 2/19, 3/42, 4/62, 5/89, 6/92, 7/97, 8/100, 9/100, 10/100 **బౌలింగ్:** స్కట్ 6.2-1-19-5, కిమ్ గార్త్ 8-1-20-1, ఎలీసా పెర్రీ 3-0-13-0, గార్డినర్ 7-0-14-1, సథర్లాండ్ 5-0-13-1, కింగ్ 5-1-18-1.

ఆస్ట్రేలియా మహిళల ఇన్నింగ్స్: లిచ్‌ఫీల్డ్ (సి)హర్మన్‌ప్రీత్ (బి)రేణుక 35, జార్జియా వాల్ (నాటౌట్) 46, ఎలీసా పెర్రీ (సి)రిచా (బి)రేణుక 1, బెత్ మూనీ (సి)రోడ్రిగ్స్ (బి)రేణుక 1, సథర్లాండ్ (సి)మంధాన (బి)ప్రియా మిశ్రా 6, గార్డినర్ (స్టంప్)రిచా (బి)ప్రియా మిశ్రా 8, మెక్ గ్రాత్ (నాటౌట్) 4, అదనం 1. (16.2ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 102పరుగులు. **వికెట్ల పతనం:** 1/48, 2/50, 3/52, 4/77, 5/97 **బౌలింగ్:** రేణుక 7-0-45-3, సైమా ఠాకూర్ 3-0-18-0, టిటాస్ సధ్ధు 4.2-0-27-0, ప్రియా మిశ్రా 2-0-11-2.

ఓపెనర్లుగా కెఎల్ రాహుల్, జైస్వాల్

- మీడియాతో కెప్టెన్ రోహిత్ శర్మ
- నేటినుంచి పింక్‌బాల్ టెస్ట్
- ఉ.9.30గం॥ల నుంచి



అడిలైడ్: భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య అడిలైడ్ వేదికగా నేటినుంచి పింక్‌బాల్ టెస్ట్ ప్రారంభం కానుంది. తొలి టెస్ట్‌లో ఘన విజయం సాధించిన టీమిండియా.. రెండోటెస్ట్‌లోనూ గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతుండగా.. మరోవైపు ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు సంక్లిష్ట పరిస్థితుల్లో ఈ టెస్ట్‌కు సిద్ధమైంది. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్ట్‌లో ఓటమి, గత రెండు సీజన్లలోనూ స్వదేశంలో భారత్ చేతిలో ఓటమితో డీలా పడింది. రెండో టెస్టుకు ఒకరోజు ముందే ఆస్ట్రేలియా తుది జట్టును ప్రకటించింది. స్పీడ్ బౌలర్ స్కాట్ బోలాండ్‌కు చోటు దక్కింది. 18 నెలల బ్రేక్ తర్వాత అతను మళ్లీ జాతీయ జట్టుకు ఆడనున్నట్లు కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ తెలిపాడు. అడిలైడ్‌లో డే అండ్ నైట్ టెస్టు కావడంతో.. బోలాండ్‌కు అవకాశం ఇచ్చినట్లు సమాచారం. తొలి టెస్టులో గాయపడ్డ జోష్ హేజిల్‌వుడ్ స్థానంలో అతడు జట్టులో చేరాడు. ఆల్‌రౌండర్ మార్ష్‌కు వెన్ను నొప్పి ఉన్నా.. అతన్ని రెండో టెస్టుకు అందుబాటులో ఉన్నాడు. కొన్ని రోజుల క్రితం మనూకా ఓవల్‌లో ప్రైమ్‌మినిస్టర్ లెవన్‌తో జరిగిన మ్యాచ్‌లో బోలాండ్ మెరుగ్గా బౌలింగ్ చేశాడు. వికెట్ తీసుకోకున్నా.. బ్యాటర్‌ను కట్టడి చేయగలిగాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా రెండు జట్ల మధ్య అయిదు టెస్టు మ్యాచ్‌లు జరగనుంది. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్ 295 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

మిడిలార్డర్‌లో రోహిత్..

తొలిటెస్ట్‌లో రాణించిన కెఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ రెండోటెస్ట్‌కూ ఓపెనర్లుగా రానున్నట్లు కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. రెండోటెస్ట్ ప్రారంభానికి ముందు జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రోహిత్ ఈ వ్యాఖ్యలు చేశాడు. తొలిటెస్ట్‌లో ఈ జోడీ అద్భుతంగా రాణించిందని, ఆ టెస్ట్‌లో టీమిండియా గెలుపులో వీరి పాత్ర కీలకమైందని తెలిపాడు. తాను రెండోటెస్ట్ బరిలో దిగుతున్నా.. మిడిలార్డర్‌లోనే బ్యాటింగ్‌కు దిగుతానని, ఇందులో ఎలాంటి మార్పుల్లేవని తెలిపాడు.



వరుసగా ఆరోగేమ్ కూడా..

- డ్రాతో ముగించిన లిరెన్–గుకేశ్
- ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్

సింగపూర్: ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌కోసం డిఫెండింగ్ ఛాంపియన్, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌తో తలపడుతున్న భారత గ్రాండ్ మాస్టర్ డి. గుకేశ్ అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్నాడు. గురువారం ఇరువురి మధ్య జరిగిన 9వ రౌండ్ గేమ్ కూడా డ్రాగా ముగిసింది. తొలి మూడు గేమ్‌లు ముగిసే సరికి ఇరువురు ఒక్కో గేమ్‌లో గెలుపొందగా.. ఆ తర్వాత జరిగిన ఆరు గేమ్‌లు డ్రాతో ముగిసాయి. గురువారం జరిగిన 9వ రౌండ్ గేమ్ సుమారు 54 ఎత్తుల వరకు సాగింది. తెల్లపావులతో గుకేశ్, నల్లపావులతో డింగ్ లిరెన్ ఆటను ప్రారంభించగా.. డి–4తో గుకేశ్, ఎన్ఎఫ్–6తో డింగ్ తమ తమ గేమ్‌లను ప్రారంభించారు. దీంతో ఇరువురు గ్రాండ్‌మాస్టర్లు 4.5 పాయింట్లతో సమంగా ఉన్నారు. శుక్రవారం రెస్ట్ డే కాగా.. శనివారం 10వ రౌండ్ గేమ్ జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68